RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



16 ఏప్రిల్ 2025 బుధవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:271

## రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు చెక్కులు అందజేత



సిద్దిపేట మంత్రులతో కలిసి వివిధ జిల్లాలలో ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులలో బేస్ మెంట్ లెవెల్ పూర్తి చేసిన లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. సిద్దిపేట జిల్లా నుండి బేస్మెంట్ లెవెల్ పూర్తిచేసిన లబ్ధిదారులలో ఎంపికైన వారు. కోహెడ మండలం పోరెడ్డి పల్లి గ్రామం దబ్బెట రాజవ్వ, సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామం గోపగాని లచ్చవ్వ వీరిరువురికి ముఖ్యమంత్రి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ కి సీఎం అందించిన చెక్కులు చూపిస్తూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా చేక్కులు స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. సీఎం గారి చేతుల మీదుగా చెక్కులు స్వీకరించిన ఇద్దరు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు పతకం మొదలైన తర్వాత 2667 ఇండ్ల మంజూరు, 606 ఇందిర ఇండ్లు ముగ్గు పోసారని , 156 బేస్ మెంట్ లెవెల్ పూర్తయ్యాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ దామోదర్ రావు, ఆయా మండల ఎంపీడీవోలు పంచాయతీరాజ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్లు విడుదల

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

హైదరాబాద్ :- బేస్మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఆర్ధికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 12 మంది లబ్దిదారులకు మంగళవారం నాడు లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు.

బేస్మెంట్ గాని గోడలు గాని శ్లాబ్గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్లో అప్లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్ ఎఫ్ టి కి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.

## క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభం

### -నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం

### -ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 15:**మందమర్రి మండలంలోని క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని మంగళవారం పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు బ్రిడ్జి సమస్య ప్రధాన అంశంగా ఉండేదని, ఎమ్మెల్యే గా వివేక్ గెలిచిన సంవత్సర కాలంలో బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన మాటప్రకారం ప్రజల కోరిక నెరవేర్చామని తెలిపారు. కరోనా సమయంలో నిలిచిన అజ్ని ప్యాసింజర్ రైలును పునరుద్ధరించడం జరిగిందని పేర్కొన్నారు. సింగరేణిలో కాక వెంకటస్వామి మొదలు పెట్టిన పెన్షన్ స్కీంను నేడు పది వేలకు పెంచాలని సంబంధిత మంత్రికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, త్వరలోనే పెన్షన్ పెరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అ్న రైలును రవీంద్రఖని రైల్వే స్టేషన్ లో నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. అనంతరం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన మూడు నెలల్లోనే బ్రిడ్జిని ప్రారంభించాలని దృఢంగా ఉన్నప్పటికీ గుత్తేదారుడుకి రావల్సిన నిధులు, భూ నిర్వాసితులకు అందాల్సిన నష్ట పరిహారం పూర్తి స్థాయిలో రాకపోవడంతో కొంత ఆలస్యమైందని, వెంటనే వారికి రావల్సిన నిధులు మంజూరు చేయించి పనులను వేగవంతం చేయడం, బ్రిడ్జిని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైయినేజీలు, మంచినీటి సౌకర్యార్థం కొరకు స్పెషల్ డెవలప్మెంట్ నిధులు మంజూరు చేపించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. అలాగే విద్యా, వైద్య రంగానికి పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో రెండు వందల కోట్ల రూపాయలతో నూతన ఓరవడితో విద్యాలయాన్ని నిర్మిస్తామని తెలియజేశారు. అలాగే సన్నబియ్యం, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, ఐదు వందల రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వడంతో పాటు, రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువకులకు నాలుగు లక్షల రూపాయల రుణాలను త్వరలోనే మంజూరు చేస్తానని, ప్రతి నిరుద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్, మాజీ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, నాయకులు గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్, యాకూబ్ అలీ, నీలం శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



## జపాన్ పర్యటనకు సీఎం రేవంత్

### బుధవారం నుంచి 22 వరకు అక్కడే

### టోక్యో, మౌంట్ ఫుజి, ఓసాకా, హీరోషిమా లో పర్యటించనున్న సీఎం బృందం

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి జపాన్ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. ఆయనతోపాటు రాష్ట్ర అధికారుల బృందం కూడా అక్కడ పర్యటించనుంది. ఈనెల 22 వరకు ఈ టూర్ కొనసాగనుంది. టోక్యో, మౌంట్ ఫుజి, ఓసాకా, హీరోషిమా లో ముఖ్యమంత్రి బృందం పర్యటిస్తుంది. ఓసాకా వరల్డ్ ఎక్స్పో 2025లో తెలంగాణ పెవిలియన్ ను ప్రారంభిస్తుంది. ఆ దేశానికి చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, పలువురు ప్రతినిధుల తో ఈ బృందం సమావేశమవుతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరుపుతుంది.

ముఖ్యమంత్రి బృందం జపాన్ పర్యటన షెడ్యూల్ (16 %-% 22 ఏప్రిల్ 2025)లి

-మంగళవారం రాత్రి బెంగుళూరు ఎయిర్పోర్టు నుంచి ముఖ్యమంత్రితో పాటు అధికారులు జపాన్ కు బయల్దేరుతారు

16 ఏప్రిల్ (బుధవారం) టోక్యో

జపాన్ చేరుకుంటారు (నారిటా ఎయిర్పోర్ట్)

భారత రాయబారి తో ఆతిథ్య భేటీ.

17 ఏప్రిల్ (గురువారం) టోక్యో

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ, JETRO, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్, వివిధ సంస్థలతో సమావేశాలు

సాయంత్రం తోషిబా ఫ్యాక్టరీ సందర్శన

18 ఏప్రిల్ (శుక్రవారం) టోక్యో

గాంధీ విగ్రహానికి పుష్పాంజ

టోక్యో గవర్నర్ గారితో మర్యాదపూర్వక సమావేశం

ఇండియన్ ఎంబసీ అధ్వర్యంలో ఇండస్ట్రీ ప్రతినిధుల భేటీ

టయోటా, తోసిబా, ఐసిన్, ఎన్టీటీ తదితర కంపెనీల సీఈవోలతో వేర్వేరుగా సమావేశాలు

జపాన్ ఓవర్సీస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ మెంట్ కార్పొరేషన్ ఫర్ ట్రాన్సఫోర్ట్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రతినిధులతో సమావేశం

సుమిదా రివర్ ఫ్రంట్ సందర్శన

19 ఏప్రిల్ (శనివారం) టోక్యో నుంచి ఓసాకా

మౌంట్ ఫుజి ప్రాంత సందర్శన

అరకురయామా పార్క్ సందర్శన

## అంబేద్కర్, రాజీవ్ ల మూలంగా మహిళలకు విశిష్ట అధికారాలు

### గ్రీన్ పవర్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం

### మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

### -స్త్రీ సమ్మిట్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

### ఈ దేశంలో మహిళలకు విశిష్ట అధికారాలు,

హక్కులు, రాజకీయాల్లో వాటాకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ లే పునాదులు వేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం హైదరాబాద్ తాజ్ డెక్కన్ లో జరిగిన స్త్రీ సమ్మిట్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మనదేశంలోబాల్యవివాహాలు, వరకట్నం నిషేధం, మహిళలకు ఓటు హక్కు, విడాకులు, మహిళలకు ఆస్తిలో వాటా వంటి చట్టాలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హిందూ కోడ్ బిల్ ద్వారానే ఆచరణలోకి వచ్చాయని వివరించారు. స్థానిక సంస్థల్లో 33% మహిళలకు రిజర్వేషన్ను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ చర్యల మూలంగా మహిళలు ఎన్నికలు, పరిపాలన రంగంలోకి ప్రవేశించారని తెలిపారు. రాష్ట్రంలోనీ ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం లక్ష్యానికి మించి 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశామని తెలిపారు. రాబోయే నాలుగు సంవత్సరాలు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు అందజేస్తామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రీన్ పవర్ పాలసీలో మహిళలకు భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. సోలార్ ఉత్పత్తి రంగాల్లోకి వారిని తీసుకు వస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ శాఖ, ప్రభుత్వంలోని ఇతర శాఖలు కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం



చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం అయితే పెద్ద ఎత్తున వారితో సోలార్ ఉత్పత్తి చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించి, ఖాళీ స్థలాలు ప్రభుత్వమే లీజుకు ఇచ్చి, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒప్పందం కుర్చున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందేందుకు ఆర్టీసీ బస్సులో రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించినట్టు వివరించారు. ఈ సౌకర్యం ద్వారా మహిళలు హాస్టల్లోనే పిల్లలను చూసేందుకు, మార్కెట్లు, దేవాలయాలను స్వేచ్ఛగా సందర్శించేందుకు అవకాశం ఏర్పడిందని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్రంలో విజయవంతం అయిందని వివరించారు. బ్యాంకు రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలతో బస్సులు కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీకి లీజుకు ఇచ్చి ఆర్థికంగా ప్రయోజనం పొందే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. వీటితోపాటు రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు అన్నిటిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇందిరాశక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇచ్చాము దీని ద్వారా వారు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆధునిక యుగంలోనూ నేటికీ బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు కొనసాగుతున్నాయి ఈ అంశంపై సమాజం మొత్తం ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం కోరారు. స్త్రీ సమ్మిట్ వంటి కార్యక్రమాలు ప్రజలను సన్మార్గంలో నడపడానికి ప్రభుత్వాలు సరైన చట్టాలు తెచ్చేందుకు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.



# ప్రజాబలం

16 ఏప్రిల్ 2025 బుధవారం


## చెరకు రైతుల దీనగాథలు...

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రెండు సంవత్సరాల క్రితం వరకు దాదాపు 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పండిన 5.50 లక్షల టన్నుల చెరకును పంచదార ఉత్పత్తికి తరలించే పరిస్థితి వుండేది. అలాంటిది నేడు 1 లక్ష టన్నులకు రైతాంగం దిగిపోయారంటే ప్రభుత్వాలు ఎంత దుర్మార్గంగా వ్యవహరించాయో అర్ధమౌతోంది. గోవాడ సహకార చక్కెర ఫ్యాక్టరీ గత 6 దశాబ్దాలుగా నడుస్తుండడం, మిషనరీ పాతది కావడంతో దిగుబడి తగ్గడం, ఆధునీకరణకు నిధులు లేక పంచదారకు మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడం, గత పాలక వర్గాల అవినీతికి పాల్పడడంతో నేడు అత్యంత దయనీయ స్థితిలో ఈ ఫ్యాక్టరీ నడుస్తోంది. 2025 జనవరి 20వ తేదీన చెరకు క్రషింగ్ ప్రారంభించినా నిధుల లేమితో యంత్రాలను సరిగా శుద్ధి చేయకపోవడంతో ప్రారంభం నుండి ఇప్పటికి 40 సార్లు చెరకు గానుగాట ఆగిపోయి రైతులు, కార్మికులకు అగ్నిపరీక్ష పెట్టింది. దీంతో ఫ్యాక్టరీకి చెరకు తీసుకువచ్చిన రైతాంగం విసిగి, వేసారి భారీ ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి, అధికారులకు పెద్ద హెచ్చరిక ఇచ్చారు. రాష్ట్రంలో మిగిలిన ఏకైక సహకార గోవాడ షుగర్ ఫ్యాక్టరీ దయనీయ పరిస్థితి, అక్కడ రైతాంగం పడుతున్న ఇబ్బందులను గమనించి... సిపిఎం రక్షణ యాత్రలో భాగంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు%^%ఇటీవల గోవాడ చక్కెర ఫ్యాక్టరీని సందర్శించి అక్కడ రైతాంగం, కార్మికుల స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ ఫ్యాక్టరీ ఆధునీకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని, చెరుకు రైతాంగానికి, పని చేస్తున్న కార్మికులకు బకాయిలు చెల్లించాలని సిపిఎం, రైతు, కార్మిక సంఘాలు మార్చి 21న మహా ధర్నాను, భారీ రాస్తారోకోను నిర్వహించాయి. పది రోజుల్లో బకాయిలు చెల్లించడానికి, ఆధునీకరణకు ప్రభుత్వానికి విన్నవించడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం హామీనిచ్చింది! గోవాడ చక్కెర ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఎన్నో అవార్డులను అందుకుంది. ఈ సహకార ఫ్యాక్టరీ 25 వేల మంది రైతులు, కౌలు రైతుల సభ్యత్వంతో రైతాంగానికి విత్తనాలు, ఎరువులు, పంచదార వంటి సబ్సిడీలు ఇచ్చేది. అలాంటి షుగర్ ఫ్యాక్టరీ పాలకుల వైఫల్యం వల్ల నేడు లక్ష టన్నుల క్రష్షింగుకు పడిపోయింది. వచ్చే ఏడాది ఈ మాత్రం పరిస్థితి కూడా వుండదు. అనకాపల్లి బిజెపి ఎం.పీ., సిఎం. రమేష్ కేంద్ర ప్రభుత్వం నుండి రూ.200 కోట్లు తెస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా సీజన్‌లో ఫ్యాక్టరీ అనేక ఇబ్బందులను ఎదర్కొంటున్నా కనీసం ఒక్కసారి కూడా అటువైపు చూడలేదు. కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ పేరుతో కొత్త పరిశ్రమలు పెట్టి అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి ఉన్న ఒక్క సహకార గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించి ఉన్న ఉపాధిని కాపాడడం లేదు. కార్మికులకు నెలా నెలా జీతాలు రాక అప్పులు చేసి బతుకుతున్నారు. రైతులకు గత ఏడాది బకాయిలను నేటికీ చెల్లించలేదు. స్థానిక ఎమ్మెల్యేలు దీన్ని పూర్తి సామర్థ్యంతో నడుపుతానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నీటి మూటగానే నిలిచిపోయింది. పైగా ఇక్కడ చెరకు బదులు డిస్టలరీ యూనిట్‌గా ఈ ఫ్యాక్టరీని మార్చుతానని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. ఒకవైపు చెరకు పరిశ్రమను ఆధునీకరించి ఈ ప్రాంత రైతాంగాన్ని, ప్రజల్ని ఆదుకోకుండా వచ్చే ఏడాదికి చెరుకు పంట వేయాలో లేదో, పంట వేసినా ఫ్యాక్టరీ నడుస్తుందో లేదోనని చెరుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫ్యాక్టరీని మూసేస్తే ఫ్యాక్టరీ ఆస్తులను, భూములను ఎలా సొంతం చేసుకోవాలనే ఆలోచనతో ఇక్కడ ప్రజాప్రతినిధులకు ఉన్నట్టు ప్రజానీకం భావిస్తున్నారు! మరోవైపు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలు చెరకు రైతులకు ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధర కల్పించి పంచదార ఉత్పత్తిలోను, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోను మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. చెరకుకు మద్దతు ధర పొరుగు రాష్ట్రాల్లో రూ.4 వేలు ఇస్తున్నా, ఇక్కడ రూ.3151 ప్రకటించినా ఇది కూడా సకాలంలో అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చెరకు దిగుబడి తగ్గిపోయి రైతాంగానికి రావాల్సిన ధర రావడం లేదు. ప్రభుత్వాలు కొత్త వంగడాలు ఇవ్వలేదు. మన రాష్ట్రంలోని ప్రభుత్వాలు గత 15 ఏళ్ల నుండి సహకార చక్కెర ఫ్యాక్టరీలను నిర్వీర్యం చేయడం, ఉన్న ఫ్యాక్టరీని, ఇక్కడ రైతాంగాన్ని పట్టించుకోకుండా గాలికొదిలేసింది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మీద సుమారు 11 మండలాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ మూతబడితే చెరకు రైతులు, కార్మికులు రోడ్డున పడతారు. గోవాడ చక్కెర ఫ్యాక్టరీని కాపాడుకోవడం కోసం రైతులు, కార్మికులు, ప్రజలు ఐక్యంగా కదిలి మరో పోరాటానికి దిగడం మినహా మరో మార్గం లేదు.

## బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ లో అగ్ని ప్రమాదాలపై అవగాహన



బద్వేలు అగ్నిమాపక వారోత్సవాలు 2025 సందర్భంగా రెండవ రోజు భాగంగా అగ్నిమాపక ఆఫీసర్ చంద్రుడు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం బద్వేల్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని ఫైర్ సిబ్బంది ద్వారా పలు రకాల విన్యాసాలతో అవగాహన కల్పించారు అనంతరం బస్టాండ్ ప్రాంతంలోని కంట్రోలర్ ప్రసాద్ గారు, ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల వారోత్సవాల పత్రికలను అందజేశారు,వారికి అగ్ని ప్రమాదాల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించి, అగ్నిమాపక విన్యాసాలు చేసి వారోత్సవాల కరపత్రాలను పంచి, అగ్నిమాపక పరికరాల ప్రాముఖ్యతను తెలిపి, అదే విధంగా వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వివరించడమైంది. ఈ కార్యమంలో ప్రయాణికులు, పాత్రికేయులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొనడం జరిగినది.

## వివాహ వేడుకల్లో బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



బద్వేలు నియోజకవర్గం కలసపాడు మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పాముురి బాలిరెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమానికి బద్వేల్ తెదేపా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హాజరై పెళ్లికూతురు అన్న పూర్ణిమ చేతులు మీదుగా తాంబూలాన్ని స్వీకరించి ఆశీర్వదించింది ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సాధనకారి రంతు కలసపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోపవరం వెంకటరామిరెడ్డి ఎల్ఐసి నారాయణరెడ్డి వెంకటేశ్వర వైన్స్ యజమాని పాలకొలను రమణారెడ్డి రాజుపాలెం యువ నాయకుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## దొర గూడలో పిచికరి...



డుంబ్రిగుడ మండలంలోని గుంట గన్నెల పంచాయతీ దొర గూడ గ్రామంలో వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో ప్రతి ఇంటి ఇంటికి పిచికరిచేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్ వైజర్ రామారావు మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి ఇంటింటికి వెళ్లి పీచికరి చేయటం జరిగిందన్నారు. మొదటి రౌండ్ (ఆల్ఫా సైపర్ మిత్రెన్) మందుతో పీచికరిచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, ఏఎన్ఎం గీత, సుబ్బలక్ష్మి, ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ

### మందకృష్ణ మాదిగ కు యావత్ మాదిగ జాతి రుణపడి ఉంది

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

### ఎమ్మార్పీఎస్ నేత నక్క సతీష్ మాదిగ

జగిత్యాల, :ఎస్సీ వర్గీకరణ కోసం అసువులు బాసిన అమరుల త్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ నేత సతీష్ మాదిగ అన్నారు.జగిత్యాల రూరల్ మండల పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో మంగళవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని షెడ్యూల్ కులాల వర్గీకరణ జీవో ఆమోదం తెలిపిన సందర్భంగా గ్రామ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం సతీష్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు కు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవో అమల్లోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటం నెరవేరింది అన్నారు. యావత్ మాదిగ జాతిరుణపడి ఉంటుందన్నారు.మాదిగ మాదిగ ఉప కులాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీలం లక్ష్మి నరసయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నక్క గంగారం, దీకొండ ప్రేమ్ నాథ్, నీలం గంగాధర్, నక్క లక్ష్మణ్,కల్లపల్లి గంగారం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలలో అప్రమత్తత అవసరం : తాసిల్దార్ పుష్ప కుమారి.

### శిరివెళ్ల ఆపదలో చేసే చిన్న సహాయమే పెద్ద ఓదార్పు : ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప.



శిరివెళ్ల ఏప్రిల్ 15 : ప్రకృతి వైపరీత్యాలు ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు గ్రామ వార్డు స్థాయి నుండి మండల స్థాయి అధికారులు అప్రమత్తత కలిగి ఉండాలని తాసిల్దార్ పుష్పకుమారి ఆదేశించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వైపరీత్యాల పట్ల అధికారులు ఎలా స్పందించాలన్న అవగాహన కార్యక్రమం ఆర్ఐ సీ రాఘవేంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వరదలు అగ్నిప్రమాదాలు తుపానులు పెనుగాలులు విద్యుత్ ప్రమాదాలు పురాతన భవనాలు గృహాలు కూలిపోయే ప్రమాదాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు విలువైన సూచనలు సలహాలు అందించారు. ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప మాట్లాడుతూ వరదలు అధికమై పూరి గుడిసెలు కూలిపోయి ఇళ్లల్లోకి నీరు ప్రవేశించి చెరువుగట్టు తెగి అనేక నష్టాలను చెవి చూసినప్పుడు బాధిత ప్రజలను ఆదుకునేందుకు ముందు వరుసలో రెవెన్యూ శాఖ ఉంటుందని గ్రామ రెవెన్యూ శాఖ సిబ్బందితో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఇతర శాఖల అధికారులతో సంయుక్తంగా అప్రమత్తంగా ఉంటూ అధికారులకు తక్షణ సమాచారం అందించి బాధితుల పక్షాన నిలబడి వారికి ప్రభుత్వ సహాయ సహకారాలు పునరావాస సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపిడిఒ సూచించారు. ఆపదలో అండగా నిలబడి తగినంత సహాయ సహకారాలు అందిస్తే చిన్నపాటి ఓదార్పే వారికి కొండంత ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని అన్నారు.విద్యుత్ శాఖ ఏఈ ఎం నాగరాజు మాట్లాడుతూ పెనుగాలులు బీభత్సం సృష్టించినప్పుడు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరగడం జరుగుతుందని అలాగే ఎడతెరిపి లేని వర్షాలు కురిసినప్పుడు విద్యుత్ స్తంభాలకు మరియు చెట్లు వాలి ఉంటాయని తదితర సందర్భాలలో విద్యుత్ శాఖకు సమాచారం అందించి విద్యుత్ ప్రమాదానికి ఎవరు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేసి సహకరించాలని గ్రామస్థాయి అధికారులకు తెలిపారు. ప్రస్తుతం వేసవి సెలవులలో విద్యార్థినీ విద్యార్థులు చెరువుగట్లకు వ్యవసాయ భావుల వద్దకు వెళ్లకుండా గ్రామంలో అవగాహన కల్పిం చాలని తాసిల్దార్ పేర్కొన్నారు.మట్టి మిద్దెలు పురాతన భవనాలలో నివసించే వారిని సురక్షిత నివాసాలకు తరలించాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ కె ఎస్ఎన్ భాష పేర్కొన్నారు. తీవ్రమైన ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగకుండా. కొన్ని రకాల వైపరీత్యాలను ఎదుర్కొనడానికి ఒక్కరిలో చైతన్యం అవసరం అన్నారు.పునరావాస పనులు, ప్రథమ చికిత్స, ఆహారం, బట్టలు, మందులు, రక్షణ చర్యలు, ఆశ్రయం, మొదలైన అంశాల గురించి ప్రజలకు తగినంత అవగాహన కల్పించాలని మండల స్థాయి అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాసుల శర్మ,గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండల సర్వ సభ్య సమావేశం :ఎంపీడీఓ రాణెమ్మ



సి.బెళగల్ మండలంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు వారి బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించబడునని ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. కావున గౌరవ పార్లమెంట్ సభ్యులు, గౌరవ శాసనసభ సభ్యులు, గౌరవ మండల సభ్యులు, గౌరవ మండల ప్రాదేశిక సభ్యులు, గ్రామపంచాయతీ సభ్యులు మరియు మండల మరియు గ్రామస్థాయి అధికారులు సర్వసభ్య సమావేశం తప్పనిసరిగా హాజరు కావలసిందిగా తెలిపారు. అలాగే మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల వివరములను తెలుగు భాషలో ఆరు పత్రులను కార్యాలయమునకు తీసుకురావాల్సిందిగా తెలిపారు.

## కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులు వరం లాంటిది

### కోరుట్ల,ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

### కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

కోరుట్ల, :పేదింటి ఆడ పిల్లలకు కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులు వరం లాంటిదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు.మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల పట్టణ, మండలానికి సంబంధించిన రూ. 11,913,804 ఒక కోటి పంతొమ్మిది లక్షల పదమూడు వేళ ఎనిమిది వందల నాలుగు రూపాయల విలువగల 119 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడ పిల్లలకు కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులు వరం లాంటిదని బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపట్టారని గుర్తు చేశారు.నిరుపేద తల్లిదండ్రులకుకళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, మాజీ కౌన్సిలర్లు సజ్జు, నాయకులు చిటి వెంకట్ రావు,చిత్తురి ఆనంద్, ఫాయిం,ప్రభు, మాజీ సర్పంచ్లు, మాజీ కౌన్సిలర్లు,కార్యాకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చరమాంకంలో తెలుగు నాటక రంగం

19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శిపం చేశారు. తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోద ప్రదేశమే కాదుబీ వివిధ సంస్కృతుల్నీ. జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసు కోవచ్చు. తెలుగు దేశంలో ఆధునిక నాటక రచన ప్రదర్శనలకు దారితీసిన వారు పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు ఆధునిక తెలుగు నాటక రచనా ప్రారంభ విషయాన ప్రథములు. కందుకూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధునిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు. ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభంకాగా నాటక ప్రదర్శన మాత్రం 1880 లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన"మంజరీ మధుకరీయము". 'ఆంధ్రా జాన్సన్ 'గా సుప్రసిద్ధులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన "నరకాసుర విజయము" అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలము"ను ఆంధ్రీకరించడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని "సీజరు చరిత్రము" అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు. ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడు రూపకర్తలు. వీరేశలింగం సంభాషణ రూపాన "బ్రాహ్మ వివాహము" అను ప్రహసనమును తన "హాస్య సంజీవని" అను పత్రికలో రచించగా, అనంతరం "వ్యవహార ధర్మబోధిని" వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి "రత్నావళి", "చమత్కార రత్నావళి" అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగునాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే.ఆయన స్వతంత్ర రచన అయిన "వ్యవహార ధర్మబోధిని", సంస్కృత నాటక అనువాదమైన "రత్నావళి", ఆంగ్ల నాటక అనుసరణ అయిన "చమత్కార రత్నావళి" ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880 లో జరిగింది. అందుచేత 1980వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది. తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడువలె గానం కాదు) ప్రవేశపెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. వీరి నాటకాలలో ప్రసిద్ధమై, 'వేణీ సంహారము'. తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884-86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయ వంతంగా ప్రదర్శించారు. పాత్రోచిత భాష, అనుప్రాసయుక్తము ప్రాబంధికము అయిన శైలి ఆయన పాటించిన అంశాలు. పాటలు (టపాలు) పాడుట ఇతడు ప్రవేశపెట్టిన క్రొత్త అంశము. ఈ మూడు అంశాలు కాలక్రమంలో తెలుగు నాటక రంగం మీద ప్రాధాన్యం వహించాయి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు వారు తన తొలి తెలుగు నాటకమైన "చిత్రనళీయం"ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయవంతంగా ప్రదర్శించారు. రామకృష్ణమాచార్యులవారు 30 నాటకాలు రచించారు. అన్నీ స్వతంత్ర రచనలే. తన నాటకాలలో పాటలు ప్రవేశ పెట్టారు. పద్యాలను రాగయుక్తంగా పాడడం కూడా ప్రవేశ పెట్టారు. అయన "సారంగధర" తెలుగులోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్య-పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే "ఆంధ్ర నాటక పితామహ" అని బిరుదునిచ్చి సత్కరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా, అయన నాటకాలలో "గయోపాఖ్యానం" సుప్రసిద్ధమైనది. 1891లో "వెంకట రాయశాస్త్రి రచించిన 'ప్రతాపరుద్రీయం' బహుళ ఖ్యాతినొందింది. 1887లో ప్రకటితమైన గురజాడ అప్పారావుగారి "కన్యాశుల్కం" వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరంలోని జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. "ప్రతాపరుద్రీయం", "కన్యాశుల్కం" రెండు రాత్రుల రూపకాలు కాగా 1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీనివాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడంచేత "చారిత్రక నాటక పితామహుడు"గా పేరొందారు. ఆయన నాటకాలలో "కర్ణాటక రాజ్యనాశము" లేదా "రామరాజు చరిత్రము"నకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘవ. పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు రచించిన తొలి నాటకం "నర్మదాపురుకుత్సీయము" 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో "రాధాకృష్ణ", "పాదుకాపట్టాభిషేకం", "కంఠాభరణము" ప్రసిద్ధమైనవి. " 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగుదేశంలోని అన్ని ప్రాంతాలకూ వ్యాపించాయి. 1906-20 మధ్య కాలంలో బయల్దేరిన "హరిశ్చంద్ర" నాటకాలు 13. "సారంగధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల ప్రభావం వల్ల నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగుదేశంలో వ్యాపార నాటకరంగం విజృంభించడం. 1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశమంతటా వ్యాపించాయి. "గయోపాఖ్యానం", "పాండవ ఉద్యోగ విజయములు", "బొబ్బిలి యుద్ధం", "రంగూన్ రౌడీ" మొదలగు నాటకాలకు విడివిడిగా పోటీలు జరిగాయి. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు తెనాలిలో స్థాపించబడింది. 1930 నుంచి సాంఘిక నాటకోద్యమం విజృంభించింది. "విశ్వశాంతి", "ఎన్.జీ.ఓ.", "మా భూమి", "కీర్తిశేషులు", "నిర్మల" "కుక్క" వంటి నాటక రచనల ద్వారా రచయితలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. 1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి అభివృద్ధి చెందింది. కాళ్ళకూరి నారాయణరావు రచించిన "చింతామణి", "వరవిక్రయం", "మధుసేవ" సమస్యల ఆలంబనగా వెలసిన నాటకాలు. ఇలా వుండగా సంప్రదాయాల ఆధిక్యాన్ని రూపుమాపడం కోసం రచనలు చేసినవారు త్రిపురనేని రామస్వామి, ముద్దుకృష్ణ, గుడిపాటి వెంకట చలం, ఆమంచర్ల గోపాలరావు మొదలగువారు. ఈ కాలంలో దువ్వూరి రామిరెడ్డి గారి "కుంభరాణా", విశ్వనాథ సత్యనారాయణ "నర్తనశాల" ఉత్తమ విషాద రూపకాలు. 1930 తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన నాటకాలు కూడా వెలిశాయి. 1944-45 తరువాతి కాలాన్ని నాటక/నాటిక పోటీల యుగం అనవచ్చు. 1937 నుంచి రేడియో నాటికలు, 1944-45 నుంచి రంగస్థల ఏకాంకికలు పుంఖాను పుంఖాలుగా వెలువడు తున్నాయి. 1964లో ఎన్.ఆర్.నంది రచించిన "మరో మొహెంజొదారో" నాటకం ద్వారా తెలుగు నాటక ప్రయోగంలో "ఫ్రీజ్" ప్రవేశించింది. ఆ తరువాత లెక్కలేనన్ని ప్రయోగాలు ఆధునిక నాటకరంగాన్ని వరించాయి. సాంఘిక నాటకాలలో లేజర్ టెక్నిక్‌ను వాడడం ద్వారా సైంటిఫిక్ పోకడలను సైతం గ్రహించి ప్రదర్శించే అవసరం అనివార్యం అయింది. ఇక ప్రస్తుతం రంగస్థలానికి కావల్సిన సౌకర్యాలు సరైన థియేటర్లు లేవు. ఏదో హాలులో నాటకం వేయ్యాల్సిన పరిస్థితులు. అతి ముఖ్యమైన మైకులూ, స్పీకర్ సిస్టములూ ఉండవు. ఉన్నా సరిగా పనిచేయవు. మైకులు మొరాయించని నాటకం ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. నటులూ అంటే సినిమా నటులే అన్న ఒక అభిప్రాయం బలంగా నాటుకు పోయింది. సినిమాల్లో నటన ముక్కలు ముక్కలుగా చిత్రీకరించ బడుతుంది. నాటకంలో ఏకబిగిన మొత్తం సన్నివేశంలో నిమగ్నమై నటించాలి. అది చాలా కష్టం. నాటకాలు వేసిన వాళ్ళు సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినిమా నటులు నాటకాల్లో రాణించడం అంత సులభం కాదు. ఇది వరకు తెలుగు సినిమా నటుల్లో అధికులు నాటక రంగం నుండి వచ్చిన వారే అన్న విషయం గుర్తుంచు కోవాలి. ఏటా నంది నాటకాలు పేరు చెప్పి ఓ పది పదిహేను నాటకాలు వేయించి ప్రభుత్వమూ చేతులు దులిపేసు కుంతింద్. ప్రభుత్వాలు చొరవ తీసుకుని, నాటక సంస్థలకు చేయూత అందించి, ప్రోత్సహిస్తే తప్ప మినుకు మినుకు మంటూ అరి పోవడానికి సిద్ధంగా ఉన్న నాటకరంగం బతికి బట్ట కట్టడం కష్టం. ఈ విషయాన్ని ప్రభుత్వాలు ఇకనైనా గ్రహించక పోతే చరమాంకంలో ఉన్న నాటక రంగం తెర మరుగు కాక తప్పని స్థితి నెలకొంది.

# నటనకు భాష్యం బళ్ళారి రాఘవ

తెలుగు నాటక రంగ చరిత్రతో మహా నటుడు బళ్ళారి రాఘవ కు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినమైన తెలుగు నాటక రంగ దినోత్సవ దినమే బళ్ళారి రాఘవ వర్ధంతి దినం కావడం యాదృచ్ఛికం. రాఘవ 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా, తాడిపత్రిలో శేషమ్మ, నరసింహాచార్యులు అనే పుణ్య దంపతకులకు శ్రీ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. వీరి ఇంటి పేరు తాడిపత్రి, కానీ బళ్లారిలో స్థిరనివాసం ఏర్పరచుకోవటం వలన బళ్ళారి రాఘవగా ప్రసిద్ధులయ్యారు. రాఘవకు తల్లిదండ్రులు పెట్టిన పేరు బసప్ప. వైష్ణవ మతాచారం ప్రకారం పేరు చివర ఆచార్యులుంటుంది. ఆయనను అందరూ ప్రేమగా రాఘవ అని పిలిచేవారు. అలా ఆయన కాలక్రమేణా బళ్ళారి రాఘవాచార్యులుగా ప్రఖ్యాతి గాంచారు. బళ్ళారిలో ప్రాథమిక మాధ్యమిక విద్య ను పూర్తిచేసి, మద్రాసులోని క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రులయ్యారు. తర్వాత న్యాయశాస్త్రాన్ని కూడా అభ్యసించారు. మద్రాసులోనే న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. అచిరకాలంలో నేక్రిమినల్ లాయర్ గా పేరు ప్రఖ్యాతులు, విశేష ధనాన్ని కూడా ఆర్జించారు. ఆ రోజుల్లో ఉన్న ఆంగ్ల ప్రభుత్వం, వీరి ప్రజ్ఞా పాటవాలను గుర్తించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించటమే కాకుండా 'రావు బహదూర్' అనే బిరుదుతో సత్కరించారు. చిన్నతనం నుండి నటన పట్ల అభిరుచి కలిగి, తన పన్నెండవ ఏటనుండే నటనను ప్రారంభించారు. చిన్నతనంలోనే, బళ్లారిలో వీరు షేక్స్పియర్ అనే సంస్థను స్థాపించి, ఆంగ్ల నాటక ప్రదర్శనలను జనరంజకంగా ప్రదర్శించారు. ఆ రోజుల్లో శ్రీ కోలాచలం శ్రీనివాసరావు గారికి బళ్లారిలో 'సుమనోరమ'అనే నాటక సంస్థ ఉండేది. మొదట్లో, శ్రీరాఘవ ఆ సంస్థలోనే నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. ఆ సంస్థ తరపున రాఘవ నటించిన మొదటి నాటకం "సునందినీ పరిణయం" దానిలో రాఘవది 70 ఏళ్ల వృద్ధుని పాత్ర. అప్పటికి రాఘవ వయస్సు 27 ఏళ్లు మాత్రమే. ఆ ముదుసలి పాత్రలో చక్కగా నటించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు హరిశ్చంద్ర, బృహన్నల, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, రామరాజు చరిత్ర, రామదాసు, తప్పెవరిదీ?, సరిపడని సంగతులు మొదలైన వీరి నాటకాలను ప్రజలు ఇష్టపడి చూసేవారు. ప్రతినాయక పాత్రలైన హిరణ్యకశిప, దుర్యోధన, మాయలఫకీర్ మున్నగు పాత్రలను అత్యద్భుతంగా పోషించేవారు. నవరసాలనూ ఒకేసారి ముఖంలో చూపించగల దిట్టగా పేరొందారు. ఒకసారి దర్శకుడు పి. పుల్లయ్య చదువుకుంటున్న రోజుల్లో మద్రాసులో ఓ లండన్ థియేటర్ వారితో కలసి రాఘవ గారు షేక్స్పియర్ డ్రామాలో నటించారట. అప్పటికి విద్యార్థిగా ఉన్న పుల్లయ్య ఆ నాటకాన్ని చూసారట. సగం నాటకం పూర్తికాగానే గ్రీన్ రూంలోకి వెళ్లి, తనను తాను పరిచయం చేసుకొని, ఈ నాటకం నిండా బ్రిటిష్ నటుల హవాయే కనిపిస్తోంది , మీ పాత్ర తేలిపోతోందేమిటి?' అని రాఘవ గారిని అడిగారట. అప్పుడు రాఘవ గారు ' ఆఖరి సీన్ చూసి అప్పుడు రా!' అన్నారట. చివరి సీన్ పూర్తయింది. తెరపడింది. పుల్లయ్య గారు నేరుగా పోయి రాఘవాచార్యుల వారి పాదాలకు నమస్కరించారట! నాటకంకు వినోదమే ప్రధాన లక్ష్యం కాకూడదని, సంఘ దురాచారాలు, సంఘ సంస్కరణలను ప్రజలకు తెలియచేయటానికి, సామాజిక చైతన్యానికి ఉపయోగపడే ఒక గొప్ప ప్రక్రియగా నాటకాలను ప్రదర్శించాలని ఆయన చెపుతుండేవారు. శ్రీ లంక, ఇంగ్లాండ్, ఫ్రాన్సు, జర్మనీ, స్విట్జర్ లాండ్ లాంటి పలు విదేశాలను దర్శించి ఆయా దేశాల్లో భారతీయ రంగస్థల వైభవాన్ని గురించి పెక్కు ప్రసంగాలను చేసారు. 1928లో రాఘవ గారి ఇంగ్లాండ్ పర్యటనలో ఆయనకు జార్జిబెర్నార్డ్ షాతో పరిచయమైంది. రాఘవ ప్రతిభను కొనియాడుతూ బెర్నార్డ్ షా అన్న మాటలు, "మీరు భారత దేశంలో పుట్టారు, ఇంగ్లాండులో పుట్టివుంటే షేక్స్ పియర్ అంత గొప్ప కీర్తిని పొందేవారు" అని ప్రశంసించారట. 1919లో బెంగుళూరులో రాఘవ నటించిన 'పఠాన్ రుస్తుం' నాటకాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ చూసి తన్మయత్వం చెంది, రాఘవ నటనా ప్రతిభను కొనియాడారు. 1927లో మహాత్మాగాంధీ... రాఘవ నటించిన నాటకాన్ని చూసి, ఆనందాన్ని పట్టలేక 'రాఘవ మహారాజ్‌కి జై' అని పొగిరారట. బళ్ళారి రాఘవ నటుడిగా తెలుగులో ఎంత ఖ్యాతి గడించారో, కన్నడంలో కూడా అంత ప్రఖ్యాతిని గడించారు. రాఘవ నటించిన ఇంగ్లీషు నాటకాలను చూసినవారు ఆయన తెలుగు నటుడంటే ఎవరూ నమ్మలేరు. భాషలపై, భావ ప్రకటనలపై, హావభావాలలో ఆయనకున్న పట్టు అటువంటిది. ఆ రోజుల్లో స్త్రీలు రంగస్థల ప్రదర్శనలు ఇవ్వటానికి జంకేవారు. కారణాలు అనేకం ఉన్నాయి. వీరు స్త్రీలను రంగస్థలంపైన అభినయించటానికి ప్రోత్సహించారు. కొప్పరపు సరోజినీ, కొమ్మూరి పద్మావతి, కాకినాడ అన్నపూర్ణ లాంటి పలువురు స్త్రీ ప్రముఖులను రంగస్థలానికి పరిచయం చేసిన ఘనత బళ్ళారికే దక్కింది. బళ్ళారి చేత పరిచయం చేయబడిన కే.యస్. వాసుదేవరావు, బసవరాజు అప్పారావు, బందా కనకలింగేశ్వర రావు లాంటి గొప్ప వారు ప్రఖ్యాత నటులుగా పేరు తెచ్చుకున్నారు. 1936లో శ్రీ హెచ్. యమ్. రెడ్డి గారి దర్శకత్వంలో వచ్చిన 'ద్రౌపదీ మాన సంరక్షణం' అనే సినిమాలో దుర్యోధన పాత్రను పోషించారు. ఆ పాత్రను అద్భుతంగా పోషించి ప్రజా బాహుళ్యంలో ఖ్యాతి గడించు కున్నారు. రైతుబిడ్డ, చండిక మొదలైన కొన్ని సాంఘిక చిత్రాలలో కూడా నటించారు. తరువాత కాలంలో మాస్టర్ తారానాథ్ అనే ఆధ్యాత్మిక గురువు ప్రభావం చేత, తుంగభద్రా నదీ తీరంలో తారానాథ్ గారు నిర్మించిన ఒక ఆశ్రమానికి భూరిగా విరాళం ఇవ్వటమే కాకుండా, ఆయన శిష్యరికంలో, ఆధ్యాత్మిక జీవనం సాగించారు. మహాకవి శ్రీశ్రీకి బళ్లారిలో సాన్నిహిత్యం ఉండేది. రాఘవ చివరి రోజుల్లో అనారోగ్యం చేత చిక్కి శల్యమై పోయారు. ఆయనను కలిసి, పరామర్శించ టానికి ప్రత్యేకంగా శ్రీశ్రీ బళ్ళారి వెళ్ళారు. ఆ సమయంలో, రాఘవ శ్రీశ్రీని, "ఇంత దూరం వచ్చారు కదా! హంపీ శిధిలాలు కూడా చూసిపోవచ్చు కదా!"అని అన్నారట. అందుకు శ్రీశ్రీ. మిమల్ని చూశాం కదా! ఇంక వాటిని ప్రత్యేకంగా చూడనవసరం లేదు అంటే వారు కడుపుబ్బ నవ్వు కున్నారట. రాఘవ సేవలకు గుర్తింపుగా ఆంధ్ర కళాప్రపూర్ణ బిరుదుతో ప్రజలు, సంస్థలు ఆయనను సత్క రించాయి. బళ్లారి రాఘవ జీవిత చరమాంకం వరకూ నటించి, అనారోగ్య కారణాలతో 1946 ఏప్రిల్ 16న తెలుగు కళామతల్లి ఒడిలో శాశ్వత నిద్రలోకి జారు కున్నారు.

## చేనేతల్లో బహుముఖ ప్రజ్ఞ

గంటల తరబడి శ్రమిస్తేనే నోట్లోకి ఒక ముద్ద. సృజనాత్మక కళాకృతులను ప్రపంచానికి అందించాలనే ఒక దృఢ సంకల్పం. మగ్గాల నుంచి ఆధునిక మరమగ్గాల వరకు ఏ మిషనరీని ఉపయోగించినా నేతన్న చేయి లేకుంటే వస్త్రంగా ఆకృతి దాల్చదు. నాటి నుండి విభిన్న పరిణామాల అనంతరం రకరకాల వస్త్రాలుగా రూపుదిద్దుకొని, అద్దకంతో సొబగులు అద్దుకొని మార్కెట్లో ఆవిష్కరించబడుతున్నాయి. ఆ క్రమంలో అనేక సృజనాత్మక మేధస్సుతో కళలు చోటుచేసుకోవడం ఒక గొప్ప విషయం. చేతి రుమాల నుంచి మొదలుకొని పట్టువస్త్రాల వరకు అనేక విభాగాలలో ఒక్కో ఆవిష్కరణలో ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంటాయి. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా మరమగ్గాలు ఉన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పద్మశాలి వర్గం నేతవృత్తిని నమ్ముకొని పరిశ్రమలతో జీవనోపాధి పొందుతున్నాయి. కష్టపడి పని చేసి చేనేత కార్మికులు కొందరు యజమానుల వరకు ఎదిగారు. ఆ క్రమంలో అనుకూల, ప్రతికూల పరిస్థితుల కారణంతో అనేక మార్పులు సంభవించడం సిరిసిల్ల పరిశ్రమ వర్గాలలో సహజంగా ఉన్నాయి. ఇతర వృత్తులలో కంటే చేనేత వృత్తిలో కార్మికుడు ఏకధాటిగా గంటల పాటు శ్రమను వెచ్చిస్తేనే గాని ఒక ఆకృతి ముందుకు రాదు. సునిశితమైనటువంటి డిజైన్లు, అనేక సాంకేతిక విభాగాలను మిషనరీల ద్వారా అనుబంధ పరిశ్రమల కూర్పుతో ప్రత్యేకమైనది. స్పెండల్ మిషన్లు, వార్పిండ్లు, డయింగులు, లూమ్స్, ట్విస్టింగ్ మిషన్లు, సైజింగ్‌లు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఫినిషింగ్ విభాగాలు ఇలా అనేకమైనటువంటివి వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తికి ప్రత్యేక మూలాలు. ఒక్కొక్క విభాగంలో పలు రకాల నైపుణ్యత కలిగిన కార్మికుల శ్రమ ప్రత్యేకంగా ఉంటుంది. చేనేతలు ప్రత్యేక అనుభవంతో కూడిన చేనేత కార్మికుని సృజనాత్మక ప్రత్యేకత. కాలక్రమేణా సాంకేతిక మిషనరీ విభాగాలలో ప్రత్యేకతలు ఎన్ని వచ్చినప్పటికీ చేనేత వస్త్ర ఉత్పత్తిలో నిబద్ధతతో కూడిన కార్మికశక్తి ఎక్కువ శాతంగా కేంద్రీకృతమైంది. సిరిసిల్ల ప్రాంతంలో తయారైన వస్త్రాలు దేశం నలుమూలల్లోకి వెళ్లి బహుళజాతి కంపెనీల ఉత్పత్తుల పోటీకి సరసన నిలిచి 'అగ్గిపెట్టలో చీర'ను సృష్టించిన ఘన చరిత్ర సిరిసిల్లకే దక్కింది. యజమాని నుండి కార్మికుని వరకు మధ్యలో కలిగిన అనేక విభాగాలలో వ్యవస్థ సమ్మేళితంగా మనుగడ సాగుతున్న క్రమంలో.. కార్మికులు, ఆసాములు, యజమానులు మూడు దశల్లో పరిశ్రమ విరాజిల్లుతుంది. మొదటగా కొన్ని ఏళ్ల శ్రమతో కార్మికుడిగా మొదలై ఆసాములుగా, యజమానులుగా ఎదిగిన వారు ఉన్నారు. కుటీర పరిశ్రమలోని అనేక మూలాలలో వారి మధ్య అనుబంధం కనిపిస్తుంది. నేతవృత్తిని నమ్ముకున్న కుటుంబాలలో ఇంటిల్లిపాది శ్రమించి వస్త్రోత్పత్తిలో భాగమవడం సిరిసిల్ల నేత పరిశ్రమలో ఒక ప్రత్యేకం. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన సిరిసిల్ల నేత వర్గంలో అనేక ఏళ్లుగా ఉత్పత్తిలో మాంద్యంను అనేక సార్లు ఎదుర్కొన్నారు. అయినా వాళ్లు నమ్ముకున్న వృత్తిని వీడలేదు. చేనేత బతుకు జీవన పోరాటంలో నిత్యం ఒక ఆవిష్కరణ కోసం అన్వేషణ జరుగుతూనే ఉంటుంది. ఆనాడు చేనేత మగ్గం ద్వారా ఉత్పత్తి గావించి అనేక అద్భుతాలు సృష్టించారు. నేడు ఆధునిక రేపర్ లూమ్స్‌పై కూడా వారి మార్కును చాటుకున్నారు. కాలక్రమేణా అనేక కొత్త ఉత్పత్తి యంత్రాలు రూపుదాల్చుకున్ననూ మార్కెట్ ఎగుడు దిగుడు పరిస్థితులను ఎదుర్కోవడం వారికి తప్పలేదు. అందుకు ప్రత్యేక కారణంగా ఒకసారి పరిశీలిస్తే దేశంలో బొంబై, సూరత్, సోలాపూర్, అహ్మదాబాద్, గుజరాత్, భీవండిలలో వస్త్ర ఉత్పత్తి కేంద్రీకృతమైన విషయం అందరికీ తెలిసిందే. సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తి పరిశ్రమతో దేశంలో ప్రసిద్ధి చెందిన వస్త్ర ఉత్పత్తి కేంద్రాలను పోల్చి చూస్తే అనేక వ్యాపార ఉత్పత్తి విభాగాలు భిన్నంగా ఉంటాయి. అందుకు ప్రత్యేక కారణంగా చెప్పాలంటే సిరిసిల్లకు రవాణా సదుపాయాలలో రైలు మార్గం లేకపోవడం, పెద్ద మార్కెట్లకు అనుసంధానంగా లేకపోవడం ఇది ఒక వెనుకబాటు అని చెప్పవచ్చు. ముడిసరుకులు గానీ, తయారైన ఉత్పత్తులు గానీ ఎగుమతి దిగుమతి విషయంలో నేరుగా సంబంధాలు పెద్ద మార్కెట్లతో లేకపోవడం జరుగుతుంది. తయారైన వస్త్రాన్ని ఇతర రాష్ట్రాల మార్కెట్లలోకి నేరుగా గతంలో ప్రస్తుతం ఎగుమతి చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు దక్కకపోవడం గమనార్హం. సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్క్, అపెరల్ పార్కు కలవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌పిఎం, చీరల తయారీ, మ్యాక్స్ సొసైటీలు, నూలు డిపో ఇలా సిరిసిల్ల నేత వర్గాలకు ఇచ్చి ఊరట కలిగించాయి. మరిన్ని పథకాలను కూడా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త విధానాలను కూడా సిరిసిల్ల నేత వర్గానికి అందివ్వడం ప్రభుత్వాలు చేస్తున్న కృషికి నిదర్శనం. నైపుణ్యత, కళాత్మకతలతో పాటు వృత్తిపై బాధ్యతతో శ్రమించి పని చేసే తత్వం కలిగిన నేత వర్గానికి ఆదరించే అవకాశాలు, పథకాలు పెద్దపీట వేస్తున్నాయి.

## ఏపీకి వచ్చేస్తున్న ఫ్రీ బస్సులు

విజయవాడ, ఏప్రిల్ 15, ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనపడుతుంది. ఆర్టీసీపై భారం పడకుండా ఎలక్ట్రికల్ త్తు బస్సులను రాష్ట్ర ప్రభుత్వం రెడీ చేస్తుంది. అయితే ఈ పథకం త్వరలోనే అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు తెలసింది. అందుకోసమే అంతా సిద్ధం చేసిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని నిర్ణయించి ఈ మేరకు ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మొదటి దశలో కొన్ని బస్సులను కొనుగోలు చేసిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు పంపుతూనిర్ణయం తీసుకుంది. తక్కువ ఖర్చుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు పథకం పై వివిధ రాష్ట్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఆర్టీసీపై భారం పడకుండా ఉండేందుకు కొన్నిముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. గత ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఎన్నికల ప్రచారంలో స్పష్టమైన ఇచ్చిన హామీ అమలు చేయకపోతే మహిళల్లో వ్యతిరేకత వస్తుందని భావించిన ప్రభుత్వం త్వరలోనే ఈ పథకాన్ని అమలుచేయాలని భావిస్తూ ఎలక్ట్రికల్ బస్సులను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల ఉచిత ప్రయాణం పెద్దగా ఖర్చు లేకుండానే, భారం ఆర్టీసీపైనా, ప్రభుత్వంపైన పడకుండానే నామమాత్రంగా వ్యయంఅవుతుందని ప్రభుత్వం అంచనాలు వేస్తుంది. నగరాలకు కేటాయించి... అందులోనూ కొన్ని నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు భిన్నంగా తీసుకుంది. ఉచిత బస్సు ప్రయాణం జిల్లాల వరకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎక్కువగా సిటీ బస్సుల్లో ఎక్కువ మంది ఉచితంగా నిత్యం తిరిగే అవకాశముందని భావించిన ప్రభుత్వం మొదటి దశలో 750 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తుంది. ఇందులో వంద బస్సులు విశాఖపట్నానికి కేటాయించారు. మరో వంద బస్సులు విజయవాడకు ఇచ్చారు. గుంటూరుకు వంద, నెల్లూరుకు వంద, కర్నూలుకు యాభై బస్సులతో పాటు కాకినాడ, రాజమండ్రి, కడప మరియు అనంతపురం డిపోలకు 50 బస్సులు కేటాయించనున్నారు. తిరుపతితో పాటుమంగళగిరి డిపోలకు 50 బస్సులు కేటాయించారు. ఈ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్లు సంబంధిత డిపోలలో ఏర్పాటు చేయనున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్నచో?ట ఈ బస్సుల కేటాయింపు చేస్తూ భారం తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది

# సజ్జల హవానేనా...

విజయవాడ, ఏప్రిల్ 15, వైసీపీ అధినేత జగన్ అధికారాన్ని కోల్పోయినా ఆయనలో మార్పు రాలేదని స్పష్టంగా తెలుస్తుంది. ఎంత మంది పార్టీ నేతలు వెళ్లింది కారణాలు ఎవరని చెప్పిందీ అందరికీ తెలుసు. అందరి వేళ్లూ చూపించిన వారినే అందలం ఎక్కించుకుంటుంటే ఇక జగన్ వైఖరిలో ఏం మార్పు వచ్చినట్లు? సీట్ల కేటాయింపుల దగ్గర నుంచి ముఖ్యమైన నిర్ణయాల వరకూ.. ఐదేళ్లలో అన్ని శాఖలపై పెత్తనం వెలగబెట్టిన సజ్జల రామకృష్ణారెడ్డికి మరోసారి జగన్ కీలక పదవి కట్టబెట్టడం పార్టీలోనే చర్చనీయాంశమైంది. సజ్జల రామకృష్ణారెడ్డిని పీఏసీ కన్వీనర్ గా నియమించడం జగన్ చేసిన అతి పెద్ద తప్పు అంటూ ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియాలో పెద్దయెత్తున పోస్టులు కనపడుతున్నాయి.. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరించిన తీరు వివాదాలకు నిలయంగా మారింది. నాటి ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తే అది రాజకీయ విమర్శలు అని సరిపెట్టుకోవచ్చు. కానీ పార్టీని వీడి వెళ్లిపోతున్న నేతలందరూ సజ్జల వైపు చూపుతున్నారు. చివరకు జగన్ కు కష్టకాలంలో అండగా ఉండి ఆయనతో పాటు జైలుకు వెళ్లి పదహారు నెలలు గడిపి వచ్చిన విజయసాయిరెడ్డి కూడా కోటరీ అంటూ పరోక్షంగా సజ్జల రామకృష్ణారెడ్డి వైపు చూపారు. అంటే ఆయనపై పార్టీలో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు. పార్టీ నుంచి వెళ్లి పోయేవారు సజ్జలను కార్నర్ చేస్తున్నారని జగన్ భావిస్తే అంతకంటే మించిన కామెడీ మరొకటి ఉండదు. ఎందుకంటే జగన్ కు తెలియకుండా సజ్జల రామకృష్ణారెడ్డి అనేక పనులు ఐదేళ్లలో చక్కపెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యమైన పదవుల నియామకం నుంచి పార్టీ ఇన్ ఛార్జుల మార్పు వరకూ అంతా సజ్జల చెప్పినట్లే జరిగిందంటారు. జగన్ వద్దకు కనీసం వెళ్లేందుకు కూడా సజ్జల అంగీకరించేవారు కాదు. అంతా తన వద్దనే సర్దుబాటు చేసి మంత్రులను, ఎమ్మెల్యేలను పంపేవారు. జగన్ తనకు చెప్పారంటూ నేతలకు చెబుతుండటంతో అది నిజమేనని నమ్మిన నేతలు మౌనంగానే వెనక్కు వెళ్లిపోయేవారు. అలాగే క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు జగన్ దృష్టికి తీసుకెళ్లకుండా సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకున్నాన్న విమర్శలు కూడా ఫ్యాన్ పార్టీలో వినిపించాయి.అలాంటి సజ్జల రామకృష్ణారెడ్డి గత ఎనిమిది నెలలుగా కొంత దూరంగా ఉంటున్నారు. అయితే జగన్ కూడా ఆయనను దూరం పెట్టారులే అని అందరూ అనుకున్నారు. కానీ పీఏసీ కమిటీ కన్వీనర్ గా నియమించడంతో జగన్ వద్ద సజ్జల రామకృష్ణారెడ్డి హవా ఏమాత్రం తగ్గలేదన్నది మరోసారి స్పష్టమయింది. సజ్జల వల్ల పార్టీకి ప్రయోజనం లేకపోగా, నష్టమేనని అందరూ చెబుతున్నప్పటికీ జగన్ మాత్రం మొండిగా వ్యవహరించడం పట్ల వైసీపీ సీనియర్ నేతలు సయితం ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్ల కాలంలో ఉన్న పరిస్థితులు వైసీపీలో ఏం మారలేదనడానికి సజ్జల రామకృష్ణారెడ్డి నియామకమే నిదర్శనమని అంటున్నారు. మరి సజ్జల వల్ల ఉపయోగం జగన్ కు మాత్రమే తెలుసా? ఆయన వైఖరిలో మార్పు రాదన్నది ఈ నియామకంతో వెల్లడయింది.

మండిపడుతున్న సీనియర్లు

నమ్మకం.. ఈ మాట ఎంత దూరమైనా తీసుకెళు _ంది. నమ్మకం ఉండాలి తప్పు.. అదే నమ్మకాన్ని గుడ్డిగా ఫాలో కాకూడదు. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి చేస్తోంది అదే. ఏకంగా పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి చేతిలో పెట్టేశారు. తాను పార్టీ అధినేతగా కొనసాగుతుండగా.. పార్టీలో అత్యంత విలువైన రాజకీయ వేదికగా ఉన్న పొలిటికల్ అడ్వైజరీ కమిటీకి సజ్జల వారిని చైర్మన్ చేశారు. అంటే తన తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని అంటూ సంకేతాలు ఇచ్చారు. అయితే సజ్జల వల్లే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందన్నది మెజారిటీ నేతల అభిప్రాయం. కానీ జగన్మోహన్ రెడ్డి దానిని విశ్వసించలేదు. సజ్జల రామకృష్ణారెడ్డి పై నమ్మకం పెట్టుకొని ఏకంగా పొలిటికల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టారు.సజ్జల రామకృష్ణారెడ్డి ఎక్కడో సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ గా ఉండేవారు. అటువంటి వ్యక్తిని తెచ్చి పార్టీ కార్యక్రమాలను అప్పగించారు. పార్టీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వంలోనూ కీలక బాధ్యతలు కట్టబెట్టారు. చివరకు పార్టీలో కూడా విశేష హక్కులు కల్పించారు. కానీ జగన్మోహన్ రెడ్డి తో నడిచిన నేతలకు ఇది మింగుడు పడని విషయం. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీనియర్లు సజ్జల విషయంలో భిన్నభిప్రాయాలతో ఉన్నారు. అసలు రాజకీయాలతో సంబంధం లేని సజ్జలను తమపై రుద్దడాన్ని ఎక్కువమంది వ్యతిరేకిస్తున్నారు. గత ఐదేళ్ల వైసిపి అధికారంలో ఉండేటప్పుడు ఏ నిర్ణయం అయినా చెల్లి పోయింది. కానీ ఇప్పుడు సజ్జలను తమపై వేయడం ఏమిటన్న అభిప్రాయం సీనియర్లలో ఉంది.తెలుగుదేశం పార్టీకి పోలిట్ బ్యూరో ఉంది. దానిలో దాదాపు 30 మంది వరకు సభ్యులు ఉన్నారు. దానికి అధ్యక్ష పదవి అంటూ లేదు. పార్టీ అధినేత చంద్రబాబు.. పొలిట్ బ్యూరో సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఆయన మార్గదర్శకంలోనే అత్యున్నత సమావేశంలో రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారు. కానీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ లో అందుకు భిన్నం జరుగుతోంది. ఏకంగా ఆ కమిటీ అధ్యక్ష బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించారు జగన్. ఇది ఎంత మాత్రం వైసీపీ సీనియర్లకు రుచించడం లేదు. సజ్జల తీరు వల్లే పార్టీ ఓడిపోయింది అన్నది ఎక్కువమంది అభిప్రాయం. అటువంటి వారంతా ఇప్పుడు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రభుత్వం పై పెత్తనం చేశారు సజ్జల రామకృష్ణారెడ్డి. ఆయన కుమారుడు భార్గవరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని చూసేవారు. ఈ ఇద్దరు తండ్రి కుమారులు ఆర్థికంగా బలపడ్డారు. కానీ పార్టీకి మైనస్ చేశారు అన్నది సీనియర్ నేతల అభిప్రాయం. అందుకే సీనియర్లు సజ్జల తాజా నియామకాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎవరి తీరుతో ఓటమి చెందామో.. అటువంటి వ్యక్తికి బాధ్యతలు ఇవ్వడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మొత్తానికైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సజ్జల నియామకం వివాదానికి దారి తీసినట్టు ఉంది.

# లిక్కర్ స్కాంలో రహస్యంగా విచారణ

నెల్లూరు, ఏప్రిల్ 15, ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాంలో కీలక నిందితుడిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి కోసం సిట్ బృందాలు గాలింపు ప్రారంభించాయి. హైదరాబాద్‌లో అరెటా హాస్పిటల్‌తో పాటు మరికొన్ని చోట్ల సిట్ బృందాలు సోదాలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో రాజ్ కసిరెడ్డి ఇల్లు, ఆఫీసుల్లోనూ సోదాలు చేస్తున్నారు. దాడుల్లో పాల్గొంటున్న సుమారు 10 నుంచి 15 సిట్ బృందాలు పాల్గొంటున్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డి లిక్కర్ స్కాంపై సిట్ విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఆయన ముందస్తు బెయిల్ విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించినా విచారణకు హాజరు కావడం లేదు. ఏపీ మద్యం స్కాంలో సైలెంట్‌గా సీఐడీ సిట్ తన తాను పని చేసుకుపోతోంది. కీలక పాత్రధారులకు నోటీసులు జారీ చేస్తోంది. వారంతా కోర్టుకు వెళ్తున్నారు. కానీ హైకోర్టులో మాత్రం సానుకూల ఫలితం రావడం లేదు. ఏపీ లిక్కర్ స్కాంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంటూ విజయసాయిరెడ్డి గతంలో ప్రకటించారు. రాజ్ కసిరెడ్డిపై సీఐడీ ఎప్పుడో దృష్టి పెట్టింది. నోటీసులు జారీ చేసింది. ఆయన నోటీసులను తాజాగా హైకోర్టులో సవాల్ చేశారు. తనపై దూకుడైన చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసి ఆయన పిటిషన్ డిస్మిస్ చేసింది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి జగన్ ఐటీ సలహాదారుగా నియమించారు. ఏపీ లిక్కర్ స్కాంపై సీఐడీ చాలా లోతుగా దర్యాప్తు చేసింది. చాలా విషయాలు వెలుగులోకి తెచ్చిందని చెబుతున్నారు. ఏపీబీసీఎల్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మొత్తం వ్యవహారాలపై రోజుల తరబడి స్టేట్ మెంట్ ఇచ్చారు. న్యాయమూర్తి ముందు కూడా వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ స్కాంలో కీలకంగా ఉన్న వారి గుట్టు అంతా బయటపడుతోందని చెబుతున్నరా?. ఇప్పటికే మిథున్ రెడ్డికి ఈ స్కాంలో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఆయన సుప్రీంకోర్టు నుంచి రిలీఫ్ తెచ్చుకున్నారు. వైసీపీ హయాంలో లిక్కర్ పాలసీపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి . వైసీపీ గెలవగానే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. మద్యనిషేధం పేరిట దుకాణాలు తగ్గిస్తామని చెప్పి ఈ నిర్ణయం తీసుకున్నారు. అనూహ్యంగా బయట దొరికే బ్రాండ్ల మద్యం మొత్తం ఏపీలో బ్యాన్ చేశారు. కేవలం కొన్ని కంపెనీలు.. అది కూడా ఏపీ లోనే మద్యం అమ్మే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చారు. అవన్నీ వైసీపీ నేతలవన్న ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిపై దర్యాప్తు ప్రారంభించింది. ఈడీ కూడా విచారణ చేయాలని సిఫారసు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కు సంబంధించి హైదరాబాద్ లో ఏపీ సిట్ బృందాలు సోదాలు జరుపుతున్నాయి. రాజ్ కసిరెడ్డి కోసం హైదరాబాద్ లో గాలిస్తున్నాయి. రాయదుర్గం పోలీసుల సాయంతో అరెటా ఆసుపత్రిలో ఏపీ సిట్ బృందాలు సోదాలు చేశాయి. రాజ్ కసిరెడ్డి కుటుంబసభ్యులు అరెటా ఆసుపత్రిలో డైరెక్టర్లుగా ఉన్నారు. విచారణకు హాజరుకాకుండా కసిరెడ్డి హైదరాబాద్ లో తలదాచుకున్నట్లు సిట్ అనుమానిస్తోంది.ఏపీ లిక్కర్ స్కామ్ లో రాజ్ కసిరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు గుర్తించాయి. జూబ్లీహిల్స్ తో పాటు గచ్చిబౌలి, ఫైనాన్స్ డిస్ట్రిక్ లో ఏపీ సిట్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. రాజ్ కసిరెడ్డి దేశం దాటి వెళ్లకుండా ఇప్పటికే ఎల్‌ఓసీ ఇచ్చారు ఏపీ పోలీసులు. సిట్ విచారణకు హాజరుకావాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ

# 19వతేదీన ఏం జరగబోతోంది...

## విదేశీ టూర్ లలో కార్పొరేటర్లు

విశాఖపట్టణం, ఏప్రిల్ 15, స్టీల్ సిటీలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. వైసీపీకి విశాఖలో మరో షాక్ తగిలింది. ఊహించినట్లుగానే ఆ పార్టీ నుంచి కార్పొరేటర్లు ఒక్కరొక్కరుగా చేజారిపోతున్నారు. తాజాగా వైసీపీ కార్పొరేటర్ తిప్పల వంశి జనసేన గూటికి చేరారు. మాజీ మంత్రి జనసేన నాయకుడు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు. 74వ వార్డు కార్పొరేటర్ గా కొనసాగుతున్న వంశీ వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనయుడు.తిప్పలనాగిరెడ్డి తొలి నుంచి వార్డు అభివృద్ధిపై తమకు నిధులు కేటాయించడం లేదన్న అసంతృప్తితో రగిలిపోతున్నారంట. నిధుల కేటాయింపు విషయమై వంశీ కౌన్సిల్ సమావేశాల్లో పలు సందర్భాల్లో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐనా ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో చివరకు పార్టీ మారాలని నిర్ణయించుకొని జనసేనలో చేరిపోయారు. వంశీ జనసేనలో చేరడంతో గ్రేటర్ పీఠం కూటమి కైవసం చేసుకోబోతుందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమయం దగ్గర పడుతుండడంతో నగరంలో పాలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. ఈనెల 19న అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఓటింగ్ జరగనుంది. దీంతో కొద్దిరోజులుగా క్యాంపు రాజకీయాలు ఊపందుకున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గి మేయర్ పీఠం దక్కించుకుంటామని టిడిపి బలంగా చెబుతోంది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పదవిని నిలుపుకుంటామని వైసీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. రెండు పార్టీలు క్యాంప్ రాజకీయాలకు తెరలేపాయి. కొంతమంది కార్పొరేటర్లను విదేశాలకు తరలించినట్లు జోరుగా ప్రచారం కూడా సాగుతోంది. అయితే మేయర్ పీఠం కైవసం చేసుకోవడానికి 74 మంది సభ్యుల అవసరంకాగా..ఇప్పటికే కూటమికి 70 మంది సభ్యులు సహకారం ఉంది.వీరితో పాటు మరో ఐదుగురు వైసీపీ సభ్యులు తమతో టచ్ లో ఉన్నారని పలు సందర్భాల్లో కూటమి నేతలు చెబుతున్నారంట. దీనికి తగ్గట్టుగానే వంశీ పార్టీ మారడంతో వైసీపీ వర్గాల్లో టెన్షన్ స్టార్ట్ అయిందట. దీంతో కార్పొరేటర్లు జారిపోకుండా శ్రీలంకలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అటు కూటమి సైతం మలేసియాలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. జనసేన సైతం కౌలాలంపూర్ లో స్పెషల్ క్యాంపును ఏర్పాటు చేసిందట. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని వైసీపీ దక్కించుకుంది. 98 డివిజన్లు ఉన్న గ్రేటర్ విశాఖలో..58 డివిజన్లలో వైసీపీ విజయం సాధించింది. టిడిపి 29 స్థానాలకు పరిమితం అయింది. జనసేన మూడు చోట్ల గెలిచింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చాలామంది వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరారు. టీడీపీతో పాటు జనసేనలోకి అధిక సంఖ్యలో చేరడంతో కూటమి బలం పెరిగింది.దీనికి తోడు కూటమికి చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు ఉన్నారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా వారు సైతం ఓటింగ్ కు వచ్చే అవకాశం ఉంది. అయితే వైసీపీ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చాలామంది కార్పొరేటర్లు..ముఖం చాటేస్తున్నారంట. బహిరంగంగానే తాము కూటమికి మద్దతు తెలుపుతామని కొంతమంది చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఈనెల 19న జరిగే అవిశ్వాస తీర్మానం ఓటింగ్ లో కూటమి నెగ్గడం ఖాయమనే చర్చ నడుస్తోంది. మరి 19న జరిగే అవిశ్వాస తీర్మానంతో విశాఖ నగర పొలిటికల్ సీన్ మారుతుందా లేదా? ఆ రోజు అసలేం జరుగుతుందో చూడాలి.

# వక్ఫ్ బోర్డుపై సుప్రీంకు వైసీపీ...

## తప్పు పట్టిన బీజేపీ

విశాఖపట్టణం, ఏప్రిల్ 15,వక్ఫ్ బోర్డు చట్టం విషయంలో వైఎస్‌ఆర్‌సీపీ వ్యవహరిస్తున్న తీరుపై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. నాడు అధికారంలో ఉండి ఆంధ్రప్రదేశ్ అంతటా వక్ఫ్ భూములు లూటీ అయినప్పుడు కళ్లుమూసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ముస్లింల రక్షకుల్లా నటిస్తోందని విమర్శించారు. వైఎస్‌ఆర్‌సీపీ వక్ఫ్ చట్టాన్ని రక్షించడానికి కాదు ? వారి పాలనలో వక్ఫ్ ఆస్తులు కబ్జా చేసిన నేరస్తులను కాపాడడానికే నేడు సుప్రీంకోర్టు లో సవాల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనారిటీలంటే నిజమైన ప్రేమ కాదు , వారిని ఓటు బ్యాంక్ గానే చూస్తున్నారన్నారు. ఇప్పుడేమో కోర్టులను కూడా వాడుకుని తమ పాపాల్ని కడిగేసుకునే ప్రయత్నం చేస్తున్నారని.. ఇది అసహ్యకరమైన రాజకీయ నాటకమని విష్ణు విమర్శించారు. వక్ఫ్ బిల్లును చట్టంగా చేయడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో వైఎస్‌ఆర్‌సీపీ పిటిషన్ వేసింది. ముస్లిం సమాజం ఆందోళనలను పరిష్కరించడంలో వైఫల్యం, రాజ్యాంగ ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని వైఎస్‌ఆర్‌సీపీ తెలిపింది. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 13, 14, 25 , 26 లను ఉల్లంఘిస్తుందని పిటిషన్‌లో పేర్కొంది. . ప్రాథమిక హక్కులు, చట్టం ముందు సమానత్వం, మత స్వేచ్ఛ , మతపరమైన వర్గాలు తమ సొంత వ్యవహారాలను నిర్వహించడానికి స్వయంప్రతిపత్తిని రాజ్యాంగం హామీ ఇచ్చిందన్నారు. సెక్షన్ 9 , 14 కింద ముస్లిమేతర సభ్యులను చేర్చడం వక్ఫ్ సంస్థల అంతర్గత పనితీరులో జోక్యంగా పరిగణించాలని.. ఈ నిబంధన బోర్డుల మతపరమైన లక్షణాన్ని, పరిపాలనా స్వచ్ఛను దెబ్బతీస్తుందని వైసీపీ తన పిటిషన్ లో పేర్కొంది. వక్ఫ్ చట్టం-2025 సవరణ బిల్లుపై సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర ముస్లిం సంస్థలు, ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ముస్లిం ఆస్తుల సేకరణకు వ్యతిరేకమని వాదిస్తూ పిటిషన్ వేశాయి. అసదుద్దీన్ ఓవైసీ, తృణమూల్ కాంగ్రెస్ తో పాటు తమిళనాడులో రాజకీయ పార్టీ పెట్టిన విజయ్ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ప్రధానంగా వక్ఫ్ చట్టంలోని సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తాయని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణపై ప్రభావం చూపుతాయని వాదిస్తూ దాఖలు చేశారు. నిజానికి వక్ఫ్ చట్టాన్ని పార్లమెంట్ లో వైఎస్‌ఆర్‌సీపీ వ్యతిరేకించింది. లోక్ సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే రాజ్యసభలో మాత్రం అనుకూలంగా ఓటేశారన్న ప్రచారం జరుగుతోంది. తాము బిల్లును వ్యతిరేకిస్తామని రాజ్యసభలో వైసీపీ పక్ష నేత సుబ్బారెడ్డి ప్రకటించారు. కానీ విపక్ష సభ్యులు .. వక్ఫ్ బిల్లును వ్యతిరేకించిన వారి ఓట్లు చూస్తే సరిపోలలేదు. మూడు ఓట్లు వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఎక్కువగా వచ్చాయి. అదే సమయంలో వ్యతిరేకించిన వారి ఓట్లు తక్కువగా వచ్చాయి. వైసీపీ సభ్యుల్లో ఒకరైన గుజరాత్ కు చెందిన పరిమిళ్ నత్వానీ బిల్లుకు అనుకూలంగా ఓటేశారని అంటున్నారు. ఆయన ఒక్కరే కాదని.. మరో ఇద్దరు, ముగ్గురు కూడా బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారని అంటున్నారు. విప్ జారీ చేశామని వైఎస్‌ఆర్‌సీపీ అంటున్నా.. ఓటింగ్ అయిపోయిన తర్వాత జారీ చేశారని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే తాము బిల్లును సమర్థించడం లేదని నిరూపించుకునేందుకు వైసీపీ కోర్టులోనూ పిటిషన్లు దాఖలు చేసినట్లుగా భావిస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లోక్ సభలో..రాజ్యసభలో వక్ఫ్ బిల్లును వ్యతిరేకించింది. కానీ రాజ్యసభ ఓటింగ్ సమయంలో కొంత మంది వైసీపీ సభ్యులు వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఓటేశారన్న ప్రచారం జరిగింది. అయితే తాము విప్ జారీ చేశామని వైసీపీ తెలిపింది. పలు పార్టీలు, వ్యక్తులు ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయగా వారితో పాటు వైసీపీ కూడా దాఖలు చేసింది.

## ఢిల్లీలో ఆ వాహనాలకు నో పెట్రోల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)మీరు ఢిల్లీలో నివసిస్తుంటే, మీకు 10 సంవత్సరాల పాత వాహనం ఉంటే, మీరు ఈ వార్త తెలుసుకోవడం చాలా ముఖ్యం. కాలుష్యాన్ని నియంత్రించడానికి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. మీ వాహనం పాతదైతే, పెట్రోల్ పంప్ నుండి పెట్రోల్ వేసుకోలేరని గుర్తించుకోండి.పాత వాహనాలకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. 2024 నుండి ఢిల్లీలో 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్/సీఎన్జీ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు రవాణా శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిబంధనల పరిధిలోకి వచ్చే వాహనాల సంఖ్య 55 లక్షలకు పైగా ఉంది. అంతేకాకుండా అటువంటి వాహనాలను బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేయడం పూర్తిగా నిషేధించింది.ఇప్పుడు కారు యజమానులు ఆశ్రయించగల కొన్ని ఎంపికలు ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ నిషేధం తర్వాత, యజమానులు ప్రైవేట్ పార్కింగ్ స్థలాలను మాత్రమే ఉపయోగించుకోవచ్చు. మీ వాహనం 10 సంవత్సరాలు (డీజిల్) లేదా 15 సంవత్సరాలు (పెట్రోల్, సీఎన్జీ) పూర్తి చేసి ఉంటే, దానిని ఔఅఖీ నుండి బయటకు రావాలంటే ఒక సంవత్సరం లోపు ఎన్వోసీ పొందడం తప్పనిసరి.ఇది కాకుండా, స్క్రాపింగ్ కూడా చివరి ఎంపికగా అందుబాటులో ఉంది. మీరు స్వచ్ఛంద వాహన స్క్రాపింగ్ అప్లికేషన్ ద్వారా మీ వాహనాన్ని స్క్రాప్ చేస్తే కొత్త వాహనం కొనుగోలుపై మీకు మోటారు వాహన పన్ను మినహాయింపు లభిస్తుంది.ఢిల్లీలో పాత వాహనాలను నడిపినా లేదా బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసినా, మీకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు జరిమానా విధించవచ్చు. అలాగే, మీ వాహనాన్ని కూడా జప్తు చేయవచ్చు. ఢిల్లీ ప్రభుత్వం 477 పెట్రోల్ పంపులలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతోంది. ఈ వ్యవస్థ సహాయంతో వాహనాల వయస్సుకు సంబంధించిన డేటా అందుబాటులో ఉంటుంది. మీ వాహనం నిర్దేశించిన పరిమితి కంటే పాతదైతే, దానికి పెట్రోల్/డీజిల్‌ను వేయించుకోలేరని గుర్తించుకోండి.

# భర్తే...యముడు...

## ఇంట్లో చెప్పకుండా రెండేళ్లు మేనేజ్

విశాఖపట్టణం, ఏప్రిల్ 156, వారిద్దరి కులాలు వేరు.. మనసులు కలిశాయి.. పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయ్యారు. పెళ్లి జరిగి రెండేళ్లు అయ్యింది. ఈ విషయాన్ని భర్త తల్లిదండ్రులకు చెప్పకుండా మేనేజ్ చేశాడు. భార్య గర్భవతి అయ్యింది. రేపో మాపో పండంటి బిడ్డకు జన్మ ఇవ్వనుంది. అంతలో కట్టుకున్న భార్యని ఆ లోకం నుంచి పంపించేశాడు భర్త. సంచలన రేపిన ఈ ఘటన విశాఖ సిటీలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన కథనం ప్రకారం.. దువ్వాడకు చెందిన జ్ఞానేశ్వర్, సిటీలోని ఓ ప్రాంతానికి చెందిన అనూషను ప్రేమించాడు. అనూష తల్లికి చూపు మందగించింది. నాలుగేళ్ల కిందట తండ్రి చనిపోయాడు. ఆ ఇంటికి ఆమె పెద్ద దిక్కు అయ్యింది. మూడేళ్ల కిందట జ్ఞానేశ్వర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే వీరిద్దరు కులాలు వేరు వేర్వేరుజ్ఞానేశ్వర్ రెండు ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు నడుపుతున్నాడు. డబ్బులకు కొదవలేదు. పెళ్లి జరిగి మూడేళ్లు గడిచినా భార్యను తల్లిదండ్రులకు పరిచయం చేయలేదు జ్ఞానేశ్వర్. పెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకుండా సిటీలో ఉద్యోగం చేస్తున్నానని వారిని నమ్మించాడు. అత్తమామల వద్దకు వెళ్దామని భార్య ఎప్పుడు అడిగినా రకరకాల కారణాలు చెప్పి తప్పించుకునేవాడు.భార్య అనూష గర్భవతి అయ్యింది. ప్రస్తుతం ఎనిమిదో నెల. వచ్చేవారంలో ఆమెకి డెలివరీ డేట్ ఇచ్చారు డాక్టర్లు. ఇప్పుడున్న సమయంలో భార్య డెలివరీ అయితే తల్లిదండ్రులతో లేనిపోని సమస్యలు వస్తాయని భావించాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భార్యని ఏదోవిధంగా చంపేయడమే బెటరని నిర్ణయానికి వచ్చాడు.భార్యను వదిలించుకునేందుకు రకరకాల స్కెచ్‌లు వేశాడు. తనకు క్యాన్సర్ వచ్చిందని ఒకసారి, విడాకులు తీసుకుని వేరే పెళ్లి చేసుకోవాలని భార్యను కన్విన్స్ చేసే ప్రయత్నం చేసేవాడు. అందుకు భార్య ససేమిరా చెప్పింది. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి.గర్భిణిగా ఉన్న అనూషకు నెలలు నిండాయి. సోమవారం ఆమెని ఆసుపత్రిలో చేరాల్సి ఉంది. అక్కడే తన స్కెచ్‌ని పక్కాగా అమలు చేశాడు జ్ఞానేశ్వర్. ఆసుపత్రికి తోడు తీసుకెళ్లేందుకు అమ్మమ్మను రెండు రోజుల కిందట ఇంటికి పిలిచాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తలు కలిసి నిద్రపోయాడు. ఇదే సరైన సమయమని భావించాడు భర్త.సోమవారం వేకువజామున నిద్రలో ఉన్న భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. తెల్లారిపోయింది..

మనుమరాలు నుంచి కనీసం ఉలుకు పలుకు లేదు. దీంతో వాళ్ల అమ్మమ్మ కంగారుపడి జ్ఞానేశ్వర్‌ను పిలిచింది. పైకి ఏమీ తెలియనట్టు స్థానికులతో కలిసి భార్యను కేజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.దీనిపై స్థానికుల్లో అనుమానాలు మొదలయ్యాయి. చివరకు ఈ వ్యవహారం పోలీసుల వద్దకు చేరింది. జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పీఎం పాలెం పోలీసులు. దీంతో అసలు విషయం బయటపడింది. ప్రేమ పేరుతో అనూషను నమ్మించి మోసం చేశానని తెలిపాడు. ఆమెని వదిలించుకునే ప్రయత్నంలో హత్య చేసినట్టు అంగీకరించాడు.


# వృద్ధురాలిని చంపి..మృతదేహంపై డాన్సు చేసి?

మేడ్చల్ కుషాయిగూడలో కిరాతకం బయటపడింది. ఒక యువకుడు 70 ఏళ్ల వృద్ధురాలిని చంపి మృతదేహంపై డాన్సులు చేసాడు. మృతదేహంపై డాన్సులు చేస్తూ సెల్ఫీ వీడియో తీసాడు. సెల్ఫీ వీడియోలని తన మిత్రులందరికీ షేర్ చేసాడు. ఒంటరిగా ఉంటున్న కమలను యువకుడు ఉరివేసి హత్య చేసాడు. హంతకుడు కమలాదేవి కి చెందిన షాపులో రెంటుకు ఉంటున్నాడు. అద్దె విషయంలో యువకున్ని వృద్ధురాలు కమలాదేవి మందలించింది. దాంతో ఆమెపై యువకుడు కక్ష పెంచుకున్నాడు. 11వ తేదీన వృద్ధురాలని చంపి తాళం వేసి పారిపోయాడు. ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని రికవరీ చేసుకొని పోస్టుమార్టం కోసం పంపారు. యువకుడు పంపిన వీడియో బెంగళూరులో వైరల్ కావడంతో పోలీసులకు సమాచారం చేరింది. హంతకుడికోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ఏపీలో ఐదు చోట్ల రోప్ వేలు

కర్నూలు, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్) ఏపీలో( కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే సీ ప్లేన్ తో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలను కలుపుతూ మార్గాన్ని ఏర్పాటు చేసింది. విజయవంతంగా సిప్లేన్లను నడుపుతోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి రాష్ట్రవ్యాప్తంగా రోప్ వేల నిర్మాణం పై ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎందుకు సంబంధించి నేషనల్ హైవే లాజిస్టిక్ అథారిటీతో ఒప్పందం చేసుకుంది రాష్ట్ర ప్రభుత్వం.రోప్ వేలు ఇప్పటికే విశాఖ నగరంలో అందుబాటులో ఉన్నాయి. నగరంలోని కైలాసగిరి వద్ద వీటిని ఏర్పాటు చేశారు. పర్యాటకులను సైతం ఆకట్టుకుంటున్నాయి. అయితే తాజాగా ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం, నంద్యాల జిల్లాలోని అహోబిలం, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. రూప్ వేలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును తీసుకొస్తోంది కూటమి ప్రభుత్వం.2014లో టిడిపిఅధికారంలోకి వచ్చింది. ఆ సమయంలోనే ఈ ప్రాజెక్టుల కోసం ప్లాన్ చేసింది. అప్పటిలో నివేదికలను సైతం రూపొందించింది. అయితే తర్వాత వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో కొంత కదలిక వచ్చింది. ఇప్పటికే పర్యాటక శాఖ అధికారులు కొన్ని ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. ఒకటి రెండు చోట్ల డిపిఆర్లను సైతం తయారు చేశారు. జాతీయ రహదారుల లాజిస్టిక్ అథారిటీతో మాట్లాడిన తర్వాత రూప్ వేల నిర్మాణానికి అడుగులు వేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు భావిస్తున్నారు. అవసరం అనుకుంటే ప్రభుత్వం సైతం నిధులు వెచ్చించేందుకు ఆలోచన చేస్తోంది. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పాలనలో పర్యాటక రంగానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవు. ఆ శాఖలో అభివృద్ధి కూడా అంతంతమాత్రంగానే ఉండేది. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంపై దృష్టి పెట్టడం విశేషం. మరోవైపు రాష్ట్రంలో డ్రోన్ రంగంలో పెట్టుబడిదారులు, వ్యాపారులు, ప్రజలను అనుసంధానం చేసేందుకు ఏపీ డ్రోన్ మార్ట్ పేరిట ఓ పోర్టల్ ను డ్రోన్ కార్పొరేషన్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. డ్రోన్ల తయారీ రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తగిన ప్రతిపాదనలతో రావాలని సంస్థ కోరింది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం డ్రోన్ల హబ్ గా అమరావతిని తీర్చిదిద్దాలని భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది

# అశోక్ గజపతి రాజు కు గవర్నర్ గిరీ.?



విజయవాడ, ఏప్రిల్ 15,కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంకీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా ఏపీ విషయంలో అత్యంత శ్రద్ధతో ఉంది. మోదీ నేతృత్వంలో వరుసగా మూడుసార్లు ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. అయితే గత రెండుసార్లు ఏపీకి ఎటువంటి ప్రాధాన్యం దక్కలేదు. అయితే ఈసారి మాత్రం ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు ప్రధాని మోదీ. ఎన్డీఏ లో టిడిపి కీలక భాగస్వామి కావడమే అందుకు కారణం. అయితే ఈసారి రాజకీయంగా కూడా ఏపీకి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తున్నారు. గవర్నర్ పోస్ట్ ఒకటి టీడీపీకి కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ తరుణంలో గవర్నర్ పోస్ట్ ఎవరికి ఇస్తారు? అన్నది హాట్ టాపిక్ అవుతోంది.తెలుగుదేశం పార్టీలోగవర్నర్ పోస్ట్ కు ఇద్దరు పెద్దలు వేచి చూస్తున్నారు. అందులో పూసపాటి అశోక్ గజపతిరాజు ఒకరు. మరొకరు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు. ఇద్దరు నేతలు సమకాలీకులే. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వారే. ఆ ఇద్దరు నేతలు ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. వారసులను బరిలో దించి రిలాక్స్ అయ్యారు. ఇద్దరు కూడా గౌరవప్రదమైన పదవి విరమణ కోరుకుంటున్నారు. గవర్నర్ పోస్టును ఆశిస్తున్నారు. ఇప్పటివరకు రాజకీయాల్లో మునిగిపోయిన వారు.. రాజ్ భవన్ లో అడుగు పెట్టాలని ఆశపడుతున్నారు.అయితే విశ్వసనీయ సమాచారం మేరకు అశోక్ గజపతిరాజు వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం గవర్నర్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్రం నుంచి సంకేతాలు వచ్చాయి. తమిళనాడు గవర్నర్ రవిని పక్కన పెడుతున్న తరుణంలో అక్కడ మంచి వ్యక్తిని గవర్నర్ గా నియమించాలన్నది కేంద్ర ప్రజల ప్లాన్. అందుకు అశోక్ గజపతి రాజు అయితే సరిపోతారని ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అశోక్ విషయంలో చంద్రబాబుతో పాటు లోకేష్ సానుకూలంగా ఉన్నారు. పార్టీని ఇరుకున పెట్టేలా ఎప్పుడు అశోక్ గజపతిరాజు వ్యవహరించలేదు. పార్టీతో పాటు అధినేత పట్ల విధేయతతోనే ఉన్నారు. అందుకే అశోక్ పెద్దరికాన్ని గౌరవించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది.మరోవైపు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పేరు గవర్నర్ పోస్ట్ కు పరిశీలనలోకి ఉంది. ఇటీవల ఎమ్మెల్సీగా ఉన్న యనమల పదవీ విరమణ పొందారు. పార్టీతో పాటు అధినేతతో గ్యాప్ ఉందన్నది ఒక ప్రచారం. ఈ తరుణంలో స్వీయ చరిత్రను రాసుకున్నారు యనమల రామకృష్ణుడు. అందులో ఎన్టీఆర్ కంటే చంద్రబాబు పాలనా దక్షుడు అంటూ కొనియాడారు. కానీ ఎందుకో దీనిపై స్పందించలేదు చంద్రబాబు. కనీసం లోకేష్ సైతం నోరు తెరవలేదు. పైగా యనమల కుమార్తె దివ్య పై ఫిర్యాదులు వస్తున్నాయి. అందుకే యనమలను వదిలించుకునేందుకు చంద్రబాబు సిద్ధపడినట్లు ప్రచారం నడుస్తోంది. అయితే యనమల మాత్రం పార్టీతో విభేదాలు పెట్టుకొని అనవసరంగా ఇబ్బందులు పడకూడదని భావిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే ఇద్దరు సీనియర్ల లో ఒక్కరి వైపు మాత్రమే చంద్రబాబు మొగ్గుచూపుతుండడం విశేషం.

# 1,213 ఎకరాల్లో గులాబీ సమావేశం

వరంగల్, ఏప్రిల్ 15,14ఏళ్ల ఉద్యమం.. పదేళ్ల అధికారం.. ఇప్పుడు ప్రతిపక్షంగా కదనోత్సాహం.. మొత్తంగా గులాబీసేన 25వసంతాలు పూర్తి చేసుకుంటోంది. అధికార పార్టీగా పదేళ్లపాటు పండగలా ఆవిర్భావ వేడుకలు చేసుకున్న కారు పార్టీ.. ఇప్పుడు విపక్షంగా రజోత్సవ వేడుకలకు సిద్ధమవుతోంది. ఉద్యమకాలం నుంచి సెంటిమెంటల్‌గా కలిసొచ్చిన వరంగల్, కరీంనగర్ జిల్లాలనే.. ఈ వేడుకలకు వేదికగా ఎంచుకున్న గులాబీపార్టీ.. అక్కడి నుంచే మరో అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకుంది. ఉమ్మడి జిల్లాల మధ్య పొలిమేరల్లోనే మహాసభ నిర్వహణకు జోరుగా ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఈసారి బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు? రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఉద్యమ పార్టీగా, అధికారపక్షంగా ఇంతకు ముందు ఒకెత్తు.. ఇప్పుడు ప్రతిపక్షంగా మరో ఎత్తు. అందులోనూ 25ఏళ్ల రజతోత్సవ పండగ. అందుకే, మహాసభ నిర్వహణ ద్వారా.. తెలంగాణ నలుమూలల నుంచి కార్యకర్తలను, ప్రజలను రప్పించాలని చూస్తోంది గులాబీ సేన. అధికారంలో ఉండి ఉంటే ఆ రేంజ్ వేరేలా ఉండేది. కానీ ఇప్పుడు ప్రతిపక్షంగా.. ఎన్నో అడ్డంకులను అధిగమించి అనుకున్న స్థాయిలో మహాసభను విజయవంతం చేయడం పెద్ద టాస్క్ అనే చెప్పాలి. అందుకే, బీఆర్ఎస్ సభ ఇప్పుడు అటు రాజకీయవర్గా?ల్లోనూ, ప్రజల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే అన్ని జిల్లాలోనూ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న గులాబీ హైకమాండ్? అధికారం ఉన్నా, లేకున్నా.. బహిరంగసభల నిర్వహణలో మనల్ని కొట్టేటోడు లేరన్నట్టుగా మనోధైర్యాన్ని పార్టీ శ్రేణుల్లో నింపే ప్రయత్నం చేస్తోంది.ఆవిర్భావం నుంచి నేటి దాకా.. ఎన్నో ఒడిదుడుకుల్ని చూసిన బీఆర్ఎస్‌కు.. ఓటములు కొత్తకాకపోవచ్చు. కానీ, ఇటీవల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన వరుస ఓటములు.. పార్టీ శ్రేణుల్లో తీవ్రనిరాశను నింపాయనే చెప్పాలి. అప్పట్నుంచి అధినేత కేసీఆర్ అడపాదడపా ఫామ్‌హౌజ్‌కు వచ్చిన నాయకులను ఉద్దేశించి మాట్లాడటమే తప్ప? బయటకు మాత్రం రాలేదు. దీంతో ఏప్రిల్ 27న జరగబోయే పార్టీ 25 వసంతాల వేడుకలో ఆయన ఏం మాట్లాడబోతున్నారనే ఆసక్తి గులాబీ శ్రేణులతో పాటు, ప్రజలు, అటు ప్రత్యర్థివర్గాల్లోనూ వ్యక్తమవుతోంది.ఉద్యమ ఆరంభం నుంచి బీఆర్ఎస్‌కు వెన్నంటి నిలిచిన కరీంనగర్, వరంగల్ జిల్లాలంటే.. గులాబీసేనకు విపరీతమైన సెంటిమెంట్. ఏ ఉప ఎన్నికలు వచ్చినా.. ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా.. ఇక్కణ్నుంచే సింహనాదం పూరించేవారు కేసీఆర్. గతంలో ఇక్కడ బీఆర్ఎస్ నిర్వహించిన సభలు సక్సెస్ అయిన తీరు కూడా అదే రుజువు చేస్తున్నాయ్. అందుకే అదే సెంటిమెంట్‌ను కంటిన్యూ చేస్తూ? వరంగల్ ? కరీంనగర్ జిల్లాల పొలిమేరల్లోనే ఈ మహా బహిరంగసభకు సన్నాహాలు చేస్తోంది బీఆర్ఎస్. దీని ఏర్పాటు మొదలు నిర్వహణవరకు.. అన్ని బాధ్యతలూ వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలకు అప్పగించిన అధినేత.. ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నారు.ఔఊ 563, ఎల్కతుర్తి గ్రామ శివారులోని 1,213 ఎకరాల్లో బీఆర్ఎస్ బహిరంగ సభ జరగనుంది. ఇందులో 159 ఎకరాల్లో సభా ప్రాంగణం ఉంటే.. మిగితా స్థలాన్ని పార్కింగ్, భోజనశాలలు, ఇతర సదుపాయాలను కల్పించేందుకు వాడుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలను, సాధారణ ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను, ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేస్తోంది బీఆర్ఎస్ అధినాయకత్వం. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతుండటంతో.. ఈ మహాసభ ఃఖీకు మంచి బూస్టింగ్ అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సెంటిమెంట్ ప్లేసులో సభ.. కొత్తగా వచ్చిన కష్టాలనుంచి గట్టెక్కిస్తుందా అన్నది కూడా ఆసక్తిరపుతోంది. మరో భారీ విజయానికి ఇక్కడే నాందివేసుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఆ పార్టీ శ్రేణులకు.. అధినేత ఏం చెబుతారో, తదనంతర రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి.

# లక్ష్మణరేఖ దాటేస్తున్నారా...

దేశానికి రాష్ట్రపతి ఎంత కీలకమో రాష్ట్రాలకు గవర్నర్ పదవి అంతే కీలకం. వీళ్లద్దరూ భారత రాజ్యాంగ బద్ధంగా ప్రభుత్వాలు నడుస్తున్నాయో లేదో చూడాలి తప్ప రాజకీయ పార్టీల్లా పాలిటిక్స్ చేస్తే పనిచేయదని క్లారిటీ ఇచ్చింది. గవర్నర్ల విచక్షణాధికారానికి కత్తెర వేసింది. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న గవర్నర్ల వల్ల అత్యున్నతమైన ఆ ఉన్నత వ్యవస్థకు ఇలాంటి నిబంధనలు విధించాల్సి వచ్చింది. అయితే, ఇకపై ఇలాంటి పరిస్థితిలో మార్పు వస్తుందని అంతా ఆశీస్తున్నారు. గవర్నర్ల నియామకంలో మార్పులు వచ్చినా రాకపోయినా.. ఇప్పుడు, సుప్రీం తీర్పుతో.. గవర్నర్లు దారిలోకి వస్తారనడంలో సందేహం లేదు. ఇక, ఎలాగూ కేంద్రంలో ఉన్న అధికార పార్టీకి కూడా దాదాపు హెచ్చరికలు వెళ్లినట్లే భావించాలి గనుక.. సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా నడుచుకునే సాహసం అయితే చేయరనే అభిప్రాయాలు ఉన్నాయి.ఇండియాలో పాలిటిక్స్ ఎంత పీక్స్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, పాలనలో మాత్రం స్వార్థపూరిత రాజకీయాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే రాజ్‌భవన్‌కు కూడా రాజ్యాంగం అధికారాలు ఇచ్చింది భారత రాజ్యాంగం. ఒకవేళ, ప్రజా ప్రతినిధులు రాజకీయాలు చేస్తున్నా.. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాలకు సక్రమమైన సలహాలు ఇవ్వడానికి రాజ్‌భవన్‌లో ఉండే రాష్ట్రపతికి, గవర్నర్లకు విచక్షణాధికారాలు కూడా కట్టబెట్టింది. అయితే, ఇక్కడ కూడా పొలిటికల్ వ్యవహారాలకే పెద్దపీట వేస్తున్న పరిస్థితి. "నా ప్రభుత్వం ఫలానా పని చేసిందని గర్వగా చెబుతున్నాను" అనాల్సిన గవర్నర్లు ఆ ప్రభుత్వాలతోనే ఫైట్ చేస్తున్నారు.వివాదాస్పద బిల్లులైతే ఓకే గానీ.. పాలనా పరమైన కీలక బిల్లుల్ని కూడా పక్కనపెట్టేస్తోంది రాజ్‌భవన్. కొన్ని సందర్భాల్లో పాలనకు కూడా అడ్డొస్తున్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల్ని రాజ్‌భవన్‌లోనే తొక్కి పెట్టి, కక్ష్యపూరింతంగా వ్యవహరిస్తున్నారు. గవర్నర్‌లను రాజకీయంగా ఉపయోగించుకునే దుస్థితి ఇప్పటిది కాకపోయినప్పటికీ? ఇటీవల కాలంలో ఇది మరింత దిగజారింది. అందుకే, సుప్రీం కోర్టు ఫైనల్ రూల్ ఇచ్చేసింది. ఇకపై బిల్లులను ఇష్టం వచ్చినట్లు ఆపేస్తామంటే కదరదనీ.. గవర్నర్ల విచక్షణాధికారానికి సుప్రీం కోర్టు కత్తెర వేసింది. ప్రజాస్వామ్యాన్ని దాటి గవర్నర్లకైనా? రాష్ట్రపతికైనా సూపర్ అధికారాలు లేవంటూ కుండబద్దలు కొట్టింది.దశాబ్దంగా దేశంలోని పలు రాష్ట్రాల గవర్నర్ల తీరుపై సుప్రీం కోర్టుకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. అసెంబ్లీలో ఆమోదించి, రాజ్‌భవన్‌కు పంపుతున్న బిల్లులను సంవత్సరాల తరబడి ఆపేస్తున్నారంటూ ఆందోళనలు వచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నుండి కేరళ, తమిళనాడు, తెలంగాణా, పశ్చిమ బెంగాల్, పంజాబ్, జార్ఖండ్ వరకు తమ గవర్నర్లపై ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోపణలు గుప్పించాయి. కొందరైతే ఇంకాస్త ముందుకెళ్లి గవర్నర్‌ను తొలగించమని వినతులు కూడా పెట్టారు. ఆయా రాష్ట్రాలు..'తమ గవర్నర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీల కొమ్ముకాస్తున్నారని' చెబితే? 'గవర్నర్ ఎందులోనైనా కలుగచేసుకుంటారు' అనే స్థాయిలో గవర్నర్లు మాట్లాడారు.అయితే, ఈ పరిస్థితి నాన్ బిజెపి ప్రభుత్వం ఉన్న దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కనిపించింది. కొన్ని రాష్ట్రాల్లో అయితే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కంటే కేంద్రం నామినేట్ చేసిన గవర్నర్‌దే రూలింగ్ అనే లెవల్‌కు వెళ్లింది. దేశంలోని మాజీ న్యాయమూర్తులు కూడా ఈ ధోరణిని రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. వామపక్ష పార్టీలైతే? గవర్నర్ పదవిని "అసంబద్ధం"గా పేర్కొంటూ రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశాయి. ఇక, ఈ యుద్ధానికి ఇప్పుడు ముగింపు వచ్చింది. ఇటీవల, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరుపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీమ్ కోర్టుకు వెళ్లగా.. అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. ఏప్రిల్ 11న ఈ తీర్పు కాపీని బహిరంగపరిచింది కోర్టు.తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ సంచలన తీర్పు ఇచ్చింది. రాష్ట్ర శాసనసభ పంపించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పెట్టే అధికారం గవర్నర్‌కు లేదని తేల్చి చెప్పింది. అలాంటి వీటో అధికారాలు గవర్నర్‌కు ఉండబోవని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పును వెలువరించింది. తమిళనాడు అసెంబ్లీ తీర్మానించి రాజ్‌భవన్‌కు పంపించిన 10 బిల్లులకు సంబంధించి 2020 నుండీ గవర్నర్ ఆర్ఎన్ రవి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉండటం చట్టవిరుద్ధమని ప్రకటించింది.సాధారణంగా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ తన అంగీకారాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఆ బిల్లులు ఉంటేనే గానీ వాటిని పునఃపరిశీలనకు పంపించే అవకాశం దాదాపుగా ఉండదు. అయితే, తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన అనేక బిల్లులను గవర్నర్ రవి ఆమోదించకుండా ఉద్దేశపూరకంగా అడ్డుకుంటున్నారనేది ప్రభుత్వం వాదన. దీన్ని తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేయగా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ తన విధులను నిర్వర్తించడానికి స్పష్టంగా కాలపరిమితి లేదని, ఎలాంటి సమయ పరిమితులు లేనప్పటికీ, తనకు అందిన బిల్లులను ఆమోదించకపోవడం, దీనివల్ల రాష్ట్రంలో చట్టాల రూపకల్పన ప్రక్రియను ఆలస్యం చేయడానికి అంగీకరించినట్టయిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ.. కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం. 'బిల్లులపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఆలస్యం చేయడం ద్వారా రాష్ట్రంలో శాసన నిర్మాణ వ్యవస్థకు గవర్నర్ అవరోధం కలిగించవచ్చన్న అర్థం వచ్చేలా రాజ్యాంగంలోని 200వ అధికరణాన్ని చదువుకోకూడదు' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఆర్టికల్ 200ని ఆర్టికల్ 163తో పాటు చదవాలని కోర్టు వెల్లడించింది. దీని ప్రకారం.. క్యాబినెట్ సలహా మేరకు గవర్నర్ చర్య తీసుకోడానికి కట్టుబడి ఉండాలని" పేర్కొంది.నిజానికి, గవర్నర్ స్థాయిలో ఉన్నవారికి కోర్టుల నుండి మొట్టికాయలు పడటం.. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పదవిలో ఉన్న వ్యక్తిని రాజ్యాంగబద్ధంగా నడుచుకోమని పదేపదే చెప్పాల్సిరావడం ఆ పదవికి, మొత్తంగా రాజ్‌భవన్‌కే అవమానంగా మారుతున్న పరిస్థితి. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు, రాష్ట్రాల అధికారాలకు తాము అతీతులమన్న తరహాలో వ్యవహరిస్తున్న గవర్నర్లకు ఈ తీర్పు స్పష్టమైన హెచ్చరికే అనుకోవాలి. కాలపరిమితులను దాటితే గవర్నర్ల నిర్ణయాలు కూడా న్యాయసమీక్ష ముందు నిలవాల్సివస్తుందన్న సూచన చాలా మార్పులను తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. ఇది, ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలకు, గవర్నర్లకు మధ్య సఖ్యతను కుదురుస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# గ్రూప్ వన్ వివాదాలు... ఫుల్ స్టాప్ ఎప్పుడు

హైదరాబాద్, ఏప్రిల్ 15, తెలంగాణలో 2024 అక్టోబర్‌లో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ పరీక్షల్లో 563 పోస్టుల కోసం 31,383 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. అయితే, ఫలితాల్లో అనేక అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయని, ఇది భారతదేశంలోనే అతిపెద్ద పరీక్షా కుంభకోణంగా ఉండవచ్చని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు ఆరోపిస్తున్నారు. ఒకే హాల్ టికెట్ వరుసలో ఉన్న వందలాది మంది అభ్యర్థులకు ఒకే మార్కులు రావడం, కొన్ని పరీక్షా కేంద్రాల నుంచి అసాధారణ సంఖ్యలో టాపర్‌లు రావడం వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి.తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలు 2025 ఏప్రిల్‌లో విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఒకే హాల్ టికెట్ వరుసలో ఉన్న 654 మంది అభ్యర్థులకు ఒకే మార్కులు, మరో వరుసలో 702 మందికి ఒకే మార్కులు రావడం సంచలనం రేపింది. ఈ అసాధారణ ఫలితాలు పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత లోపించిందని, సాంకేతిక లేదా మానవ తప్పిదాలు జరిగి ఉండవచ్చని అనుమానాలకు దారితీశాయి.హైదరాబాద్‌లోని కొన్ని పరీక్షా కేంద్రాల నుంచి అసాధారణ సంఖ్యలో టాపర్‌లు రావడం మరో వివాదాస్పద అంశం. కేవలం రెండు కేంద్రాల నుంచి 74 మంది టాపర్‌లు రావడం, 15 కేంద్రాల నుంచి అన్ని ర్యాంకులు రావడం సందేహాలను రేకెత్తించాయి.

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణల ప్రకారం, 563 పోస్టుల్లో టాప్ 500 ర్యాంకుల్లో ఒక్క తెలుగు మీడియం విద్యార్థి కూడా చోటు సంపాదించలేదు, ఇది మూల్యాంకనంలో పక్షపాతం ఉందనే అనుమానాలను బలపరిచింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ ఫలితాలను "భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద పరీక్షా కుంభకోణం"గా అభివర్ణించారు. ఆయన ఈ అనుమానాస్పద ఫలితాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులకు తెలంగాణ యువత పట్ల చిత్తశుద్ధి ఉంటే, వారు వెంటనే ఈ కుంభకోణంపై సీబీఐ విచారణకు మద్దతు ఇవ్వాలని ఆయన సవాలు విసిరారు.మూల్యాంకనంలో మూడవ దశ తనిఖీ జరగలేదని, రెండవ దశ మూల్యాంకనం కాంట్రాక్ట్ సిబ్బంది చేతిలో జరిగిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇది ప్రొఫెసర్‌లు లేదా శాశ్వత సిబ్బంది చేయాల్సిన పనిని అనధికార వ్యక్తులకు అప్పగించినట్లు చెప్పారు. పరీక్షలకు సంబంధించిన డేటా లీక్ అయినట్లు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు అవసరమని డిమాండ్ చేశారు.

ఈ వివాదాస్పద ఫలితాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో వందలాది గ్రూప్-1 అభ్యర్థులు నిరసనలు చేపట్టారు. ఈ ఫలితాలను రద్దు చేసి, పారదర్శకంగా మళ్లీ మూల్యాంకనం చేయాలని వారు డిమాండ్ చేశారు. అశోక్ నగర్, సివిల్ సర్వీసెస్ కోచింగ్ కేంద్రాలకు కేంద్రంగా ఉండడంతో, ఈ నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కొందరు అభ్యర్థులను నిర్బంధించి, వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు, దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందించారు.రాజకీయ మద్దతు: బీఆర్ఎస్‌తో పాటు, బీజేపీ నాయకులు కూడా అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. గతంలో బీజేపీ నాయకుడు బండి సంజయ్ కూడా గ్రూప్-1 అభ్యర్థుల నిరసనలకు మద్దతు ప్రకటించారు, అయితే సీబీఐ విచారణపై బీజేపీ నుంచి స్పష్టమైన స్పందన ఇంకా రాలేదు.తెలంగాణ గ్రూప్-1 పరీక్షల చుట్టూ గతంలో కూడా అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. 2022, 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరీక్షలు పేపర్ లీక్ ఆరోపణలతో రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో, 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలపై కూడా అనుమానాలు రావడం రాష్ట్రంలో యువతలో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. 2024లో జరిగిన గ్రూప్-1 పరీక్షలకు ముందు జీవో 29పై కూడా తీవ్ర వివాదం చెలరేగింది. ఈ జీవో రిజర్వేషన్ నిబంధనలను మార్చిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై సుప్రీం కోర్టులో కేసు కొనసాగుతోంది. గతంలో జరిగిన పేపర్ లీక్ ఘటనలు, ఇప్పుడు ఫలితాల్లో అనుమానాస్పద అంశాలు టీజీపీఎస్సీ నిర్వహణలో పారదర్శకత లోపించిందనే ఆరోపణలను బలపరుస్తున్నాయి.ఈ విషయాన్ని రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది. అదే సమయంలో, బీజేపీ కూడా ఈ వివాదంపై స్పందించాల్సిన ఒత్తిడిలో ఉంది, ఎందుకంటే అభ్యర్థులు బీజేపీ మద్దతు కోరుతున్నారు. ఈ వివాదం రాష్ట్రంలో ఉద్యోగార్థులను నిరాశపరిచింది. గత 13 ఏళ్లలో గ్రూప్-1 పరీక్షలు కేవలం రెండుసార్లు మాత్రమే జరగడం, ప్రతీసారి వివాదాలు తలెత్తడం వల్ల యువతలో ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతోంది.

## నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం

## -సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి




తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16న నిర్వహిస్తారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటక ప్రదర్శనతోపాటు నాటకానికి సంబంధించిన అనేక అంశాలపై సదస్సులు జరగాలని, నాటక కళాకారుల జయంతులను వర్ధంతులను నిర్వహించడం ద్వారా ప్రజల్లో నాటక కళ పట్ల ఉత్సాహం, విలువలు పెరుగుతాయని, వీటన్నింటిని సమతుల్యం చేసేలా ఉండేందుకు నాటకరంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలుగు నాటక కళాకారులు భావించారు. అయితే, ఏ రోజును నాటకరంగం దినోత్సవంగా చేయాలన్న అంశంపై అనేక చర్చలు జరిగాయి. అనేకమంది అనేక పేర్లూ, తేదీలు సూచించారు.

దీనికి 2000వ సంవత్సరంలో బీజం పడింది. 2000వ సంవత్సరంలో కొంతమంది యువనాటక కళకారులతో కలిసి డా. పెద్ది రామారావు ఆధ్వర్యంలో యవనిక త్రైమాసిక నాటకరంగ పత్రిక ప్రారంభమయింది. నాలుగేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలో ప్రపంచ, భారతీయ, తెలుగు నాటకరంగాలకు సంబంధించి నాటక ముఖ్యులు, ఔత్సాహికులు రాసిన అనేక వ్యాసాలను యవనిక ప్రచురించడంతోపాటు నాటకరంగ కార్యక్రమాలు, నాటకోత్సవాలను కూడా నిర్వహించింది. నాటకరంగాన్ని మరింత పటిష్టపరచడంకోసం ఇతర దేశాల, రాష్ట్రాల నాటకరంగానికి ఉన్నట్లుగా తెలుగు నాటకరంగానికి కూడా ఒక దినోత్సవం ఉంటే బాగుంటుందని భావించి, "ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవం" శీర్షికతో 2000 ఏప్రిల్-జూన్ ప్రత్యేక యవనిక సంచికను ప్రచురించింది. యవనిక ఆలోచనకు "ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక" సహకారం తోడైంది. తెలుగు నాటక కళాకారులంతా నాటకరంగ దినోత్సవ ఏర్పాటుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శిపంచేశాడు. అంతేకాకుండా తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించాడు. ఆధునిక తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలను అందించిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని నాటక సంస్థలు 2001 నుండి తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపాయి. ఈ క్రమంలో డా. కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా, కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ 2007 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ. విడుదలచేసింది. 2007, ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటకరంగ దినోత్సవం జరుపబడింది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేసిన నాటక కళాకారులకు సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు, బిరుదులు అందజేస్తారు.

# వేలానికి గోల్కొండ రాయల్ డైమండ్..

హైదరాబాద్, ఏప్రిల్ 15 ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.అప్పట్లో ఇండోర్ మహారాజు వద్ద ఈ ఉంగరం ఉండేదని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ జ్యుయెలరీ చీఫ్ రాహుల్ కడాకియా అన్నారు. ఇటువంటి ఉంగరం ఎన్నడూ వేలానికి రాలేదని తెలిపారు. వేలంలో ఇది రూ.300 కోట్లు ? రూ.430 కోట్ల మధ్య అమ్ముడుపోవచ్చని చెప్పారు.ఇలాంటి చాలా అరుదైన, విలువైన వజ్రాలు జీవితకాలంలో ఒకసారి మాత్రమే వేలానికి వస్తాయని రాహుల్ కడాకియా అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ అయిన తమ క్రిస్టీస్ 259 సంవత్సరాలుగా పనిచేస్తోందని తెలిపారు. ఇన్నేళ్లుగా క్రిస్టీస్ ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ, ముఖ్యమైన వజ్రాలను విక్రయించిందని అన్నారు.తమ వేలంలో గతంలో అమ్ముడైన ప్రసిద్ధ గోల్కొండ వజ్రాలకు ఉదాహరణలుగా పలు డైమండ్ల పేర్లను ఆయన వివరించారు. ఆర్చ్‌డ్యూక్ జోసెఫ్ డైమండ్, ప్రిన్సీ డైమండ్, విట్టెల్స్‌బాచ్ డైమండ్ వంటివాటిని అమ్మామని చెప్పారు. రాజ వారసత్వం, అసాధారణ రంగు, పరిమాణంతో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ప్రపంచంలోనే అత్యంత అరుదైన నీలి రంగు వజ్రాలలో ఒకటని రాహుల్ కడాకియా ఒక ప్రకటనలో తెలిపారు.క్రిస్టీస్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ఒకప్పుడు ఇండోర్ మహారాజా యశ్వంత్ రావు హోల్కర్ ఎఎకు చెందింది. 1923లో మహారాజ తండ్రి ఈ వజ్రంతో కూడిన ఒక బ్రాస్లెట్‌ను తయారు చేయాలని ఫ్రాన్స్‌కు చెందిన ప్రసిద్ధ లగ్జరీ ఆభరణాల బ్రాండ్ చౌమెట్‌కి ఆర్డర్ ఇచ్చారు. అంతకు ముందు అదే ఆభరణాల సంస్థ నుంచి "ఇండోర్ పియర్స్" అనే రెండు గోల్కొండ వజ్రాలను ఆయన కొనుగోలు చేశారు.దశాబ్ద కాలం తర్వాత మహారాజు ప్రసిద్ధ ఫ్రెంచ్ లగ్జరీ ఆభరణాల కంపెనీ మౌబౌసిన్‌కు మరో ఆర్డర్ ఇచ్చారు. ఈ కంపెనీ 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను రీడిజైన్ చేసి ఇండోర్ పియర్ వజ్రాలతో పాటు హారంలో చేర్చింది.న్యూయార్క్‌కు చెందిన హ్యారీ విన్‌స్టన్ అనే ప్రసిద్ధ ఆభరణాల వ్యాపారి 1947లో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను కొన్నారు. ఆయన ఈ నీలి వజ్రాన్ని అదే పరిమాణంలో ఉన్న మరొక తెల్ల వజ్రాన్ని వాడుతూ బ్రూచ్‌ను తయారు చేశారు. తరువాత ఆ బ్రూచ్ బరోడా మహారాజుకు చేరింది. కొంతకాలం తర్వాత ఆ బ్రూచ్ ఆ రాజకుటుంబం ఒక ప్రైవేట్ వ్యక్తికి అమ్మింది. ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.

# చార్జీల పేరుతో కోతలు

వరంగల్, ఏప్రిల్ 15, అధిక ధర ఆశ చూపి రైతులను తమ వద్ద వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేలా రప్పించి.. తర్వాత చార్జీల పేరుతో కోతలు పెడుతూ రైతులకు కుచ్చుటోపి పెడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలో వ్యాపారులు కొందరు మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా మార్కెట్ బయట వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు తెర లేపారు.మార్కెట్లో వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులకు కిందటి రోజు లభించిన ధరలకు క్వింటాలుకు 100 నుండి 200 రూపాయలు అధికంగా చెల్లిస్తామని మార్కెట్ కు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకువచ్చే వాహనాలను మార్గమధ్యలోనే అడ్డుకొని తమ ట్రేడింగ్ కంపెనీలు, మిల్లులకు తీసుకెళ్తున్నారు. అధిక ధర ఆశతో వారికి సరుకులను విక్రయించడానికి మొగ్గు చూపిందే తడువు వెంటనే సదరు వాహనాన్ని వే బ్రిడ్జి కాంటా పై తూకం వేయించి తీసుకురావాలని చెబుతున్నారు.వే బ్రిడ్జి తూకం చార్జీ 50 రూపాయలు రైతే చెల్లించి తూకం వేయించి సదరు వ్యాపారికి చెందిన మిల్లు, ట్రేడింగ్ కంపెనీ వద్దకు వాహనాన్ని తీసుకు వెళ్ళగానే అక్కడ నేరుగా లిఫ్ట్ చేయిస్తున్నారు. వే బ్రిడ్జి లో నిర్దేశించిన వే మెంట్ ప్రకారం ప్రకారం ముందుగా నిర్ణయించిన ధరతో లెక్క చూసి రైతుకు డబ్బులు చెల్లించకుండా 30 కిలోలు తరుగు కింద మినహాయించుకుని, ఆ తరువాత బస్తాలకు లెక్క గట్టి ఒక్కో బస్తాకు దడువాయి, హమాలీ, కూలీ పేరుతో 16 నుంచి 25 రూపాయల వరకు చార్జీల పేరుతో కోత పెట్టి డబ్బులు చెల్లిస్తున్నారు.ఎక్కడ కూడా కార్మికుల ప్రమేయం లేకుండానే రైతే నేరుగా తాను పండించిన పంటను ట్రాక్టర్ లేదంటే ఇతర వాహనాల్లో తీసుకువచ్చి వే బ్రిడ్జి కాంట వేయించి ట్రేడర్ వద్దకు తీసుకువచ్చి దిగుమతి చేస్తుండగా చార్జీల పేరుతో మినహాయింపులు చేసుకోవడం విశేషం.దీనికి తోడు నగదు చెల్లింపులు చేస్తున్నామని విక్రయించిన వ్యవసాయ ఉత్పత్తుల విలువలో ఒక శాతం నగదు మినహాయించుకుంటున్నారు. అటు చేయని పనికి చార్జీలు, తరుగు పేరుతో 30 కిలోలు, నగదు చెల్లింపు పేరుతో ఒక శాతం కోత పెడుతుండడంతో ముందు చెప్పిన అధిక ధర.. అన్నదాతకు.. అల్లికి అల్లి.. సున్నకు సున్న.. అన్న చందంగా మారుతోంది. గ్రామాల నుండి కేసముద్రం మార్కెట్ కు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకువచ్చే వాహనాల డ్రైవర్లకు కొందరు ట్రేడర్లు మామూళ్ళు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నేరుగా తమ వద్దకే వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి రైతుకు నచ్చజెప్పి తమకు విక్రయించేలా సహకరించిన డ్రైవర్లకు 150 నుండి 200 రూపాయలు చెల్లిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.మామూళ్లకు ఆశపడ్డ డ్రైవర్లు కొందరు నేరుగా సదరు ట్రేడింగ్ కంపెనీ వద్దకే వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళ్లి ఇక్కడైతే మంచి ధర లభిస్తుంది వెంటనే డబ్బులు ఇస్తారని రైతులకు నచ్చజెప్పి సరుకులను డంపు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు తగ్గిస్తున్న వ్యాపారులు, నేరుగా కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు 'రాస్తామాల్' పేరుతో మార్కెట్ కు చెల్లించాల్సిన పన్ను చెల్లింపులు చేస్తున్నారు. 2023 - 24 సంవత్సరంలో 'రాస్తా మాల్' ద్వారా మార్కెట్ ఆదాయం 95 లక్షల రూపాయలు రాగా, 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో కోటి 17 లక్షలకు పెరగడం, అదే సమయంలో కేసముద్రం మార్కెట్ 'గంజ్' ఆదాయం గత ఏడాది రెండు కోట్ల 88 లక్షలు రాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు కోట్ల 42 లక్షలకు పడిపోవడం మార్కెట్ బయట పెరిగిన కొనుగోళ్ల తీరుకు సాక్ష్యంగా నిలుస్తోంది.

ప్రచారం మినహా చర్యలు లేవు

మార్కెట్ బయట వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా నిలువరించాల్సిన మార్కెట్ కమిటీ, అధికారులు ఇటీవల దిద్దుబాటు చర్యలు చేపట్టామని ప్రకటించినప్పటికీ కేవలం కంటి తుడుపుగా ఆటోల ద్వారా గ్రామాల్లో మార్కెట్లోనే సరుకులు విక్రయించాలని ప్రచారం చేయడం మినహా మార్కెట్ బయట కొనుగోలు నిలువరించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.కేసముద్రం వ్యవసాయ మార్కెట్ జాతీయ ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ విధానం ఈ - నామ్ పరిధిలో కొనసాగడంతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా జాతీయస్థాయిలో విశిష్ట సేవలకు 'బెస్ట్ ఎక్సలెన్సీ' అవార్డు అందుకున్నది. అటువంటి మార్కెట్ లో రోజురోజుకు సరుకుల రాబడి తగ్గిపోయి మార్కెట్ ప్రతిష్ట, ప్రభావం కోల్పోయే పరిస్థితికి చేరువవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

# పెద్దపల్లిలో నేతల సైలెంట్...

కరీంనగర్, ఏప్రిల్ 15, పెద్దపల్లి జిల్లా అంటే గుర్తొచ్చేది ఇద్దరు నేతలు. ఒకరు గతంలో పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దాసరి మనోహర్ రెడ్డికాగా? మరొకరు ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ రమణారావు.. గతంలో ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా వ్యవహరించేవారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచేది.నీ అవినీతి బాగోతం బయటకు తీస్తా అంటే?నీ అవినీతి అవినీతి బాగోతం కూడా బయటకు తీస్తానంటూ ఇద్దరు నిత్యం ఉప్పు-నిప్పులా ఉండేవారు. వీరిద్దరి మధ్య ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో జిల్లా రాజకీయాలు హీటెక్కేవి. ఇదంతా 2023కు ముందు ఇద్దరి మధ్య జరిగిన పొలిటికల్ వార్. సీన్ కట్ చేస్తే.. 2023లో గులాబీ పార్టీ దారుణంగా ఓడిపోయింది.పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా జిల్లాను ఏకచక్రాధిపత్యంగా ఏలిన దాసరి మనోహర్ రెడ్డి ఓడిపోయారు. కాంగ్రెస్ నేత చింతపల్లి విజయ రమణారావు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. కాలం మారింది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ గెలుపుతో పెద్దపల్లి జిల్లా రాజకీయాలు కూడా ఒక్కసారిగా మారిపోయాయి.అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కయ్యానికి సై అంటూ కత్తులు దూసుకున్న ఇద్దరు నేతలు ఇప్పుడు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డి ఒక్కసారిగా దూకుడు తగ్గించారు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారట. ఏదైనా పార్టీ ప్రోగ్రామ్స్ ఉంటే అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారంట. అంతేకాదు క్యాడర్ కు సైతం అందుబాటులో ఉండడంలేదట. రాజకీయంగా మునుపటిలా దూకుడును ప్రదర్శించడంలేదట.ప్రత్యర్థులపై చేసే విమర్శల్లో వాడీవేడి లేకుండా చప్పగా సాగుతున్నాయంట ఆయన ప్రెస్ మీట్లు. కనీసం పార్టీ కార్యక్రమాల్లో అయినా యాక్టీవ్ గా ఉంటున్నారంటే అదికూడా లేదట. ఒక్క ఓటమితో మనోహర్ రెడ్డి తీరులో ఇంతలా మార్పు వచ్చిందేంటి అంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పదేళ్ల పాటు రాజ్యమేలిన మనోహర్ రెడ్డి.. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పైన గానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపైగాని పల్లెత్తు మాట కూడా అనకుండా ఎందుకు సైలెన్స్ గా ఉంటున్నారనేదే ఇప్పుడు ఎవరికీ అంతుచిక్కడంలేదట.మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ పైనే పార్టీ నేతలు తలా ఒకరకంగా చర్చించుకుంటున్నారట. 2023కు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డిపై.. చింతపల్లి విజయ రమణారావు నిత్యం ఏదో ఒక ఇష్యుపై ఆరోపణలు చేస్తుండేవారు.. భూ ఆక్రమణలు, అక్రమ దందాలపై బహిరంగంగానే విమర్శలు చేశారు. అయితే ఎన్నికల తరువాత ఇప్పుడు ఒక్కసారిగా సీన్ మారి పోయింది. పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతపల్లి విజయ రమణా రావు పెద్దపల్లి గెలవడంతో? మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మౌన ముద్రలోకి వెళ్లారు. అందుకు కారణం కూడా లేకపోలేదు అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కూడా మనోహర్ రెడ్డి భూ ఆక్రమణల భాగోతం బయట పెడతానంటూ ఎమ్మెల్యే విజయ రమణా రావు హెచ్చరించారు. బంధంపల్లి చెరువుతో పాటు, మనోహర్ రెడ్డికి సంబంధించిన స్కూళ్లు, హాస్టళ్ల లెక్కలు తీస్తానంటూ బహిరంగంగానే ప్రకటించారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే..తనకే నష్టం జరుగుతుందని భావించి మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ అయ్యారనే గుసగుసలు జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తున్నాయి.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మనోహర్ రెడ్డి భూ ఆక్రమాణలు బయట పెడతా.. విద్యా సంస్థలను కొలిపిస్తానంటూ హాట్ కామెంట్స్ చేసిన ఎమ్మెల్యే విజయ రమణరావు కూడా ఒక్కసారిగా సైలెన్స్ అయ్యారంట. మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే మౌనంపై వహించడం వెనుక ఏం జరిగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడి నుండి అధికారం చేపట్టే వరకు విజయ రమణ హెచ్చరికలకే పరిమితమవడం వెనుకున్న మతలబు ఏంటనే సందేహలు జిల్లా రాజకీయ నేతల్లో వ్యక్తమవుతున్నాయంట.ఇద్దరి మధ్య రాజీ ఏమైనా కుదిరిందా అంటూ రకరకాల పొలిటికల్ గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయంట. మరి భూ ఆక్రమణదారుల భరతం పడతానంటూ ఎమ్మెల్యే చేసిన శపథం.. మాజీ ఎమ్మెల్యే సైలెన్స్‌గా ఉండేంత స్థాయికి వెళ్లడం వెనుక ఏదో మతలబు జరిగే ఉంటుందంటూ పెద్దపల్లి రాజకీయ వర్గాలు సెటైర్లు వేసుకుంటున్నారట. మరి రాబోయే రోజుల్లో కూడా వీరిద్దరి మధ్య ఇలాగే సైలెన్స్ వాతావరణం కంటిన్యూ అవుతుందా లేక ఏదైనా వ్యవహారం బెడిసికొట్టి మళ్లీ మొదటికొస్తుందా అనేది వేచి చూడాలి.

# ఆచితూచి అడుగుల్లో గులాబీ దళపతి



హైదరాబాద్, ఏప్రిల్ 15, కేసీఆర్‌కు రాజకీయాలు అనగా చెరువులో చేపలకు ఈత నేర్పడం వంటిది. అంత సహజం, అంత సులభం! తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి, రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఆయన, 2014 నుంచి?2023 వరకు తెలంగాణను ముఖ్యమంత్రిగా నడిపించారు. అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారు. అలాంటి నాయకుడికి ఎప్పుడు, ఎలా రాజకీయం చేయాలో బాగా తెలుసు. అందుకే ఇప్పుడు ఆయన జనంలోకి రాకుండా, నీడలో నిశ్శబ్దంగా తన వ్యూహాలను రచిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచాయి. ఇంకా నాలుగేళ్లకు పైగా అధికారం వారి చేతిలోనే ఉంది. అయితే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ కొంత వెనుకబడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని పథకాలు అమలైనప్పటికీ, ఇంకా చాలా హామీలు నెరవేరాల్సి ఉంది. అంతేకాదు, కాంగ్రెస్‌లో అంతర్గత గ్రూప్ రాజకీయాలు, నాయకుల మధ్య సమన్వయ లోపం కూడా బయటకు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులను కేసీఆర్‌దూరం నుండి గమనిస్తున్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల అసంతృప్తి క్రమంగా పెరుగుతుందని, అది తమకు రాజకీయంగా లాభిస్తుందని ఆయన ఆశిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పాలన "పక్వానికి" చేరే వరకు వేచి చూడాలని కేసీఆర్ భావిస్తున్నారట.ఇప్పుడే జనంలోకి వెళ్లి కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉండదని కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. బదులుగా, సరైన సమయంలో, ప్రజల్లో అసంతృప్తి గరిష్ట స్థాయికి చేరినప్పుడు బయటకు వచ్చి మాట్లాడితే, ఆ మాటలు జనంలో బలంగా ప్రతిధ్వనిస్తాయని ఆయన నమ్ముతున్నారు. ఈ వ్యూహంతోనే ఆయన ఇప్పట్లో బహిరంగ సభలు, ర్యాలీలకు దూరంగా ఉంటున్నారు. అయితే, నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, ఆయన రాజకీయంగా నిష్క్రియంగా లేరు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ, బీఆర్ఎస్‌ను బలోపేతం చేసే వ్యూహాలను రూపొందిస్తున్నారు. అదే సమయంలో, తనకు ఇష్టమైన వ్యవసాయాన్ని కూడా పర్యవేక్షిస్తూ సమయాన్ని గడుపుతున్నారు.ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంజరగనుంది. ఈ సందర్భంగా కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఈ సభలో ఆయన తమ పార్టీ బలాన్ని చాటడంతో పాటు, కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైన తీరును ఎత్తిచూపవచ్చు. అయితే, ఈ సభ తర్వాత ఆయన మళ్లీ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యే అవకాశం ఉందని అంటున్నారు.కాంగ్రెస్‌కు ఇంకా 45 నెలలకు పైగా అధికారం ఉంది. ఈ సమయంలో వారు చేసే తప్పిదాలే బీఆర్ఎస్‌కు రాజకీయంగా లాభిస్తాయని కేసీఆర్ ఆలోచిస్తున్నారు. ఆయన దృష్టి 2026 లేదా అంతకు మించి ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అప్పటి వరకు పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం, యువ నాయకులను ప్రోత్సహించడం, కాంగ్రెస్ బలహీనతలను జనంలోకి తీసుకెళ్లడం వంటి వ్యూహాలపై ఆయన దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.కేసీఆర్‌కు రాజకీయం ఒక పని అయితే, వ్యవసాయం ఒక అభిరుచి. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఆయన వ్యవసాయ కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షిస్తారు. రైతు సంక్షేమం కోసం తీసుకొచ్చిన రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు ఆయన వ్యవసాయం పట్ల అభిమానానికి నిదర్శనం. ఈ విశ్రాంతి సమయంలో కూడా ఆయన తన రైతు మనసును తామరాకు మీద నీటిబొట్టులా ఉంచుకున్నారని సన్నిహితులు చెబుతున్నారు.కేసీఆర్ ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండొచ్చు, కానీ ఆయన రాజకీయ ఆటలో ఎప్పుడూ ఆచితూచి అడుగు వేస్తారు. సమయం కోసం వేచి ఉంటూ, పార్టీని బలోపేతం చేస్తూ, కాంగ్రెస్ తప్పిదాలను ఎత్తిచూపే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. 2026 తర్వాత ఆయన రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి.

# తక్కువ ధరకే స్టీల్, సిమెంట్...

నల్గొండ, ఏప్రిల్ 15, తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఇండ్లులేని నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఈ పథకాన్ని ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం కింద సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం నాలుగు విడతల్లో ఆర్థిక సహాయం అందిస్తారు. ఒక్కో లబ్ధిదారునికి మొత్తం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం లభిస్తుంది. మొదటి విడతగా పునాది కోసం రూ. లక్ష, ఆ తర్వాత గోడల నిర్మాణం, పైకప్పు నిర్మాణం, చివరగా ఇళ్లు పూర్తి అయిన ఇలా నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు అకౌంట్లలో జమ చేస్తారు.ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మొదటి దశలో అత్యంత నిరుపేదలకు, అర్హులకు మాత్రమే గృహాలను కేటాయించాలని అన్నారు. ఈ పథకం పారదర్శకంగా, నిరుపేదలకు న్యాయం చేసేలా అమలు కావాలని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్లపై శనివారం సాయంత్రం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు అత్యంత జాగ్రత్తగా పనిచేయాలన్నారు. కమిటీలు తయారు చేసిన అర్హుల జాబితాను తహశీల్దార్, ఎంపీడీవో, ఇంజినీర్‌లతో కూడిన మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేసి, ధృవీకరించాలని సూచించారు.ఒకవేళ అనర్హులకు ఇండ్లు కేటాయించబడినట్లు తేలితే వెంటనే ఇందిరమ్మ కమిటీకి తెలియజేసి, ఆ స్థానంలో అర్హులైన వారికి గృహం మంజూరు చేయాలన్నారు. పథకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు. దందాలకు పాల్పడే వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలన్నారు. అనర్హులు ఇండ్లు నిర్మించుకున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలతో పాటు, వారు పొందిన నిధులను వసూలు చేయాలన్నారు. లబ్ధిదారుల సౌకర్యం కోసం అదనపు సదుపాయాలను కల్పించాలన్నారు. గృహ నిర్మాణంలో లబ్ధిదారులు తమ అవసరాలకు అనుగుణంగా 50 శాతం అదనపు స్థలాన్ని నిర్మించుకునే అవకాశం కల్పించాలని సీఎం సూచించారు.ఇందిరమ్మ ఇండ్లకు సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపే లక్ష్యంతో రూపొందింది కాబట్టి ఈ పథకం అమలులో పారదర్శకత, నిజాయితీ ప్రధానంగా ఉండాలన్నారు. అర్హులైన వారికి మాత్రమే ఈ గృహాలు దక్కేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ఆసక్తికరంగా కల్వకుంట్ల ఫ్యామిలీ పాలిటిక్స్

నిజామాబాద్, ఏప్రిల్ 15, వరంగల్‌లో బీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్లీనరీ సభపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సైలెంట్ అయ్యారు. ఆమెకు పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానం లేదా? అందుకే సన్నాహక సమావేశాలకు గైర్హాజరు అవుతున్నారా? ప్రస్తుతం గులాబీపార్టీ శ్రేణుల్లో ఇవే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. దానికి తగ్గట్లే నిజామాబాద్ జిల్లా నేతల సమావేశాలకు సైతం ఆమె హాజరుకావడం లేదు. పార్టీ పరంగా సరైన ప్రాధాన్యత లేకపోవడంతో ఆమె సొంత ప్లాట్ ఫాం జాగృతితో యాక్టీవిటీస్ చేస్తున్నారనే చర్చజరుగుతుంది. ఇక మున్ముందు కూడా మరింత దూకుడు పెంచాలని కవిత ఆలోచిస్తున్నట్లు సమాచారం.గులాబీ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 27న వరంగల్ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభను విజయవంతం చేసేందుకు గులాబీపార్టీ సకల ఏర్పాట్లు చేస్తోంది. ఎక్కడికక్కడ పార్టీ కేడర్‌ను సైతం పార్టీ నాయకులు సన్నద్ధం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ జనం తరలింపుపై సలహాలు, సూచనలు తీసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎవరికివారు బిజీగా ఉన్నారు. కానీ కవిత మాత్రం పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు, వరంగల్ సభ ఏర్పాట్లకు సంబంధించి సైలెంట్‌గా ఉన్నారు.ఇంతకూ వేడుకలను ఆహ్వానం అందలేదా?.. కావాలని పార్టీ ఆమెను పక్కన పెట్టిందా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడు పార్టీలో యాక్టివ్ గా ఉండే కవిత పార్టీ సభ విషయంలో ఎందుకు స్పందించడం లేదనేది ఆమె క్యాడర్‌కే అంతుపట్టడం లేదంట. గ్రేటర్‌లో జరుగుతున్న పార్టీ సన్నాహక సమావేశాల్లో సైతం పాల్గొనడం లేదు. కావాలని ఆహ్వానించడం లేదా? లేకుంటే ఆమె తెలంగాణ జాగృతి సంస్థ ప్రోగ్రామ్స్‌తో బిజీగా ఉండటంతో పాల్గొనడం లేదా? అసలు పార్టీలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన కవిత 2019లో ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. తిరిగి 2021 నవంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించారు. ఆ జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి పట్టుకుంది. కేడర్ , నేతలతోనూ పరిచయాలు ఉన్నాయి. పార్టీ సన్నాహక సమావేశాలు అన్ని జిల్లాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల్లోనూ జరుగుతున్నాయి. అయితే కవిత మాత్రం ఇప్పటివరకు వెళ్లలేదు. పార్టీ కేడర్ ను సభకు సన్నద్ధం చేయడం లేదు.అంతేకాదు ఇటీవల వారం రోజులపాటు ఉమ్మడి జిల్లాల ముఖ్య నేతలతోనూ ఎర్రవెల్లి ఫాం హౌజ్ లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాలకు సైతం కేసీఆర్ కుమార్తె వెళ్లలేదు. ఇప్పుడు సొంత జిల్లా నిజామాబాద్ లో జరుగుతున్న సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. దాంతో ఆమెకు పార్టీ సమావేశాలు నిర్వహించమని చెప్పలేదా? ఆ జిల్లా అధ్యక్షుడు ఆహ్వానించడం లేదా? అసలు పార్టీ పెద్దలే ఆమెను దూరం పెడుతున్నారా? అనేది తెలంగాణ జాగృతి కార్యకర్తల్లో తీవ్ర గందరగోళానికి కారణమవుతుంది. అయితే పార్టీ సమావేశాలు నిర్వహించమని ఆదేశాలు లేకపోవడంతోనే కవిత ఆ జిల్లాకు వెళ్లడం లేదంట కవిత సొంత ప్లాట్‌ఫాం జాగృతితో యాక్టివిటీస్‌ను ముమ్మరం చేశారు. తెలంగాణ కళలు, సంస్కృతిపై జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి.. ప్రాచుర్యం కల్పించేందుకు 2006 ఆగస్టులో ఆమె తెలంగాణ జాగృతి సంస్థని ఏర్పాటు చేశారు. నాటి నుంచి జాగృతి సంస్థ బతుకమ్మ ఉత్సవాలతో పాటు సేవాకార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తుంది. ప్రస్తుతం బీసీ, మహిళ అంశంతో ముందుకు సాగుతుంది. 42శాతం రిజర్వేషన్లపై పోరాటం సాగిస్తూనే మరోవైపు పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ప్రతిష్టించాలన్న డిమాండ్‌తో ప్రతిజిల్లాలో ధర్నాలు, నిరసనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు.ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏవి దృష్టికి వచ్చినా వాటిపై గళం వినిపిస్తున్నారు. జాగృతితో పాటు పూలే ఫ్రంట్ తో కార్యచరణ కొనసాగిస్తున్నారు.నె క్లెస్ రోడ్డు పరిసరాల్లో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ యోచనను స్వాగతిస్తున్నట్లు కవిత ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాంక్ బండ్‌పై విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేయడం అభినందనీయమన్నారు. అలాగే అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అదలా ఉంటే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా మండలిలో ప్రభుత్వం కులగణన తప్పుల తడకగా ఉందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. కానీ కవిత మాత్రం మండలిలోనే ఉండటం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వానికి ఆమె సపోర్టు చేస్తున్నారనే ప్రచారం సైతం జరిగింది.కవిత తీసుకుంటున్న నిర్ణయాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. అసెంబ్లీలో పూలే విగ్రహం కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని సహకరించాలని వామపక్షాల మద్దతు కోరుతున్నారు. సీపీఎం జాగృతి కార్యక్రమాలకు మద్దతు ఇస్తామని, కానీ బీఆర్ఎస్ పార్టీగా చేస్తే మాత్రం ఇవ్వబోమని ఖరాఖండిగా చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. మరోవైపు సీపీఐ పార్టీ మద్దతు సైతం కూడగడుతున్నారు. ఆ పార్టీ నేతలతోనూ ఒకటి రెండ్రోజుల్లో భేటీ కాబోతున్నట్లు సమాచారం. జాగృతి చేసే కార్యక్రమాలకు కలిసి వచ్చే పార్టీలన్నింటితోనూ ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజాసమస్యలపై పోరాటాల్లో మరింత దూకుడు పెంచేందుకు కవిత సిద్ధమవుతున్నారంట. గతంలో ఎన్నడూ లేని విధంగా సొంతంగా రాజకీయంగా ఎదగాలని, తన సత్తా ఏంటో చూపాలని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే ఒక వైపు జాగృతి, మరోవైపు పూలే ఫ్రంట్ తో ప్రజలకు దగ్గరై, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కీలక నేతగా ఎదిగేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆమె అనుసరిస్తున్న వ్యూహాలే స్పష్టం చేస్తున్నాయంటున్నారు. ఎఅందులో భాగంగానే జాగృతి కమిటీలు గ్రామస్థాయిలో ఏర్పాటు చేసి సంస్థను పటిష్టం చేయాలని ప్లాన్ చేస్తున్నారంట. మొత్తమ్మీద కల్వకుంట్ల ఫ్యామిలీ పాలిటిక్స్ ఆసక్తికరంగా తయారయ్యాయిప్పుడు.

## రాజధానిలోని అనంతవరం లో మంత్రి నారాయణ పర్యటన

అమరావతి మంత్రి నారాయణ రాజధానిలోని అనంతవరంలో పర్యటించారు. అమరావతి నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్ కోసం కొండలను మంత్రి, సీఆర్డీయే, మైనింగ్ శాఖల అధికారులు పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకంతో రాజధాని పనుల ప్రారంభానికి ఆటంకాలు వచ్చాయి. న్యాయపరమైన సమస్యలు అధిగమించేందుకు 8 నెలలు పట్టింది. 68 పనులకు సంబంధించి 42360 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఈ పనులన్నీ ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. అమరావతి పనులకు అవసరమైన గ్రావెల్ కోసం గనుల శాఖ 851 ఎకరాలు సీఆర్డీయే కు కేటాయించింది. గతంలో అనంతవరం కొండను సీఆర్డీయే కు కేటాయించారు...అయితే గత ప్రభుత్వంలో 8 మీటర్ల లోతు వరకూ తవ్వేశారు. ఇక్కడ భూమిని కూడా ఏదోక అవసరానికి ఉపయోగించాలని చూస్తున్నాం. రాజధాని లో ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కట్టాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడ లను కలిపి మెగాసిటీ గా చేయాలనేది లక్ష్యం. ఎయిర్పోర్ట్ కోసం కనీసం 5 వేల ఎకరాలు అవసరం. ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకుంటే 30 వేల ఎకరాలు అవసరం. భూసేకరణ చేస్తే రిజిస్ట్రేషన్ ధర పై రెండున్నర రెట్లు మాత్రమే వస్తుంది. భూసేకరణ ద్వారా తీసుకుంటే రైతులు నష్టపోతారని...సమీకరణ చేయాలని స్థానిక ఎమ్మెల్యే లు కోరారు. ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తాం. రాజధానిలో 92 పనులను 64,912 కోట్లతో చేస్తున్నామని అన్నారు.

# పాకిస్థాని చేతిలో నిర్మల్ వాసి హత్య దుబాయి లో ఘటన

నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్ (40) అనే యువకుడు దుబాయిలో మత విద్వేషాల కారణంగా పాకిస్తాన్ కు చెందిన ఒక ఉన్మాది చేసిన దాడిలో హత్యకు గురయ్యాడు. మత విద్వేషాల కారణంగా పాకిస్తానీ జరిపిన దాడిలో ఇద్దరు తెలంగాణ వ్యక్తులు హత్యకు గురికాగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే సోన్ మండల కేంద్రానికి చెందిన ప్రేమ్ సాగర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడి బేకరీలో పనిచేస్తున్నాడు. అతనితో పాటు పాకిస్తాన్ కు చెందిన యువకుడు సైతం అదే బేకరీలో పనిచేస్తున్నాడు. అయితే శుక్రవారం జరిగిన ఘర్షణలో పాకిస్తాన్ యువకుడు ఉన్మాదిల మారి అకస్మాత్తుగా బేకరీలో పనిచేస్తున్న వ్యక్తులపై కత్తితో దాడి చేశాడు. దీంతో సోన్ మండల కేంద్రానికి చెందిన ప్రేమ్ సాగర్, జగిత్యాల జిల్లా ధర్మపురి కి చెందిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఈ దాడిలో ఆర్మూర్ పట్టణానికి చెందిన సాగర్ అనే యువకుడు తీవ్ర గాయాల పాలైనట్లు అక్కడి వ్యక్తులు సమాచారం ఇచ్చారు. ప్రేమ్ సాగర్ నానమ్మ గురువారం రోజే మరణించడంతో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు, రెండు రోజుల తర్వాత ప్రేమ్ సాగర్ బావ రోడ్డు ప్రమాదానికి గురై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండడంతో అతడిని నిజామాబాదులోని ఆసుపత్రికి తరలించగా ఐసియు లో చికిత్స పొందుతున్నాడు. ప్రేమ్ సాగర్ కుటుంబ సభ్యులందరూ నిజామాబాద్ ఆసుపత్రిలోనే ఉన్నారని, అంతలోనే ప్రేమ్ సాగర్ హత్యకు గురయ్యాడన్న వార్త తెలిసిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రేమ్ సాగర్ హత్యకు గురైన విషయం అతని కుటుంబ సభ్యులకు, భార్యకు గాని తెలియనియడం లేదన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ ప్రేమ్ సాగర్ మరణించిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రేమ్ సాగర్ మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు అలర్ట్.. మరోవారంలోనే పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదల

అమరావతి రాష్ట్ర వ్యాప్తంగా 2024-25 విద్యా సంతవత్సరానికి ఏప్రిల్ 1వ తేదీన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసిన సంగతి తెలిసిందే. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం కూడా ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమవగా.. ఏప్రిల్ 9వ తేదీతో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లా కేంద్రాల్లో మూల్యాంకనం చేపట్టారు. ప్రస్తుతం మార్కులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తున్నారు. ఇది కూడా దాదాపు తుది దశకు చేరుకుంది. దీంతో వారంలోపు పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని సవ్యంగా కుదిరితే ఏప్రిల్ 22వ తేదీన టెన్త్ ఫలితాలు విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ఎప్పుడెప్పుడాని ఫలితాల కోసం ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న విద్యార్థుల నిరీక్షలకు మరో వారంలో తెరపడనుంది.

# యువతి మృతి..బంధువుల అందోళన





నల్గొండ నిడమానూరు (మం) బొక్క మంతల పాడు గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ధర్మారపు మల్లేశ్వరి అనే యువతి హైదరాబాద్ లో మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన కుక్కల జాన్ రెడ్డి అనే యువకుడితో కలసి సహజీవనం చేసిందని ఆమెను కాదని జాన్ రెడ్డి మరొక యువతిని పెళ్లి చేసుకోవడం తో మల్లేశ్వరి మృతి చెందింది. మల్లేశ్వరీ మృతి చెందిద లేక చంపారా అనుమానం తో యువకునీ ఇంటి ముందు మృత దేహం తో మల్లేశ్వరి బందువులు ఆందోళన చేసారు. ఇంట్లో ఎవ్వరు లేకపోవడం తో మృత దేహం ను ఇంట్లో ఉంచి ఆందోళన చేసారు.

## ఎస్బిఐ బ్యాంకు లో భారీ అగ్నిప్రమాదం భారీగా ఎగిసిపడుతున్న మంటలు పొగలు

### వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్ కోట్ ఎస్బిఐ బ్యాంక్ నందు ఘటన

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్ కోట్ ఎస్బిఐ బ్యాంకు నందు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 9.30 నిమిషాలకు బ్యాంకు సెక్రటరీ గార్డు బ్యాంకు తాళాలు తీసి చూడగా ఒకసారిగా పోగలు వ్యాపించాయి దీంతో సెక్రెటరీ గార్డు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో ఉన్నత అధికారులు వచ్చి చూసేసరికి భారీగా మంటలు బ్యాంకు వ్యాపించ సాగాయి దీంతో అధికారులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కోడంగల్ నుంచి ఫైర్ ఇంజన్ రావడం జరిగింది దీంతో మంటలు ఆర్పడం కొనసాగుతుంది అయితే బ్యాంకులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా మరి ఏదైనా ఉందా అనేది ఇంకా తెలియాల్సి ఉంది అయితే బ్యాంకులో సరైన ప్రమాణాలు లేకపోవడం మని మరికొందరు అనుమానిస్తున్నారు బ్యాంకు పై భాగంలో ఇటీవల థర్మ కోల్ షీట్స్ తో పై కప్పు ఫర్నిచర్ గా ఏర్పాటు చేశారని దీని ద్వారా కూడా మంటలు అధికంగా వ్యాపించాయని పలువురు అనుమానిస్తున్నారు దీంతో పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించడంతో వాహనదారులు కూడా ఇబ్బంది పడ్డారు. ఒక బ్యాంకుకు భద్రత ప్రమాణాలు లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది

## బావిలో దూకి తల్లికొడుకులు ఆత్మహత్య



సూర్యాపేట చిలుకూరు మండలం కొత్త కొండాపురంలో దారుణం జరిగింది. వ్యవసాయ బావిలో దూకి తల్లికొడుకు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి బుడిగం వీరమ్మ, కుమారుడు నాగేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం వీరమ్మ అన్న దొంగరి నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందాడు. తమ బాగోగులు చూసేవారు లేరని ఆందోళనతో మనస్థాపం చెంది తల్లి కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

## హై టెన్షన్ వైర్లు తాకి డ్రైవర్ మృతి



రంగారెడ్డి శంషాబాద్ పరిధిలోని గగన్ పహాడ్ లో విషాదం జరిగింది. ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్ పహాడ్ పారిశ్రామిక వాడ లో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం తో హై టెన్షన్ వైర్లు తగిలి కంటైనర్ లారీ డ్రైవర్ హరిహర రాయ్ మృతి చెందాడు. మృతుడు బీహార్ వాసిగా గుర్తించారు. డ్రైవర్ తన కంటైనర్ వాహనంతో గగన్ పహాడ్ వద్ద పారిశ్రామిక వాడ కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గత కొద్ది రోజుల క్రితం కంపెనీ ప్రాంతంలో అధికారులు సిమెంట్ రోడ్డు వేసారు. రోడ్డు ఎత్తు పెరగడంతో కంటైనర్ కి హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ హరిహర రాయ్ మృతి చెందాడు. ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జేఎన్టీయూ లో హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన

హైదరాబాద్ కూకట్పల్లి జేఎన్టీయూలో తమ జీతాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళనకు దిగారు. విధులకు హాజరుకాకుండా జేఎన్టీయూ క్యాంపస్ లో విధులు బహిష్కరించారు. రెండేళ్లుగా పోరాడుతున్న 500 రూపాయలు పెంచి పనులు చేయమంటున్నారని ఆరోపిస్తున్న సిబ్బంది ఈనెల 1000 రూపాయలు పెంచుతామని పెంచకుండా యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు.
కార్మిక చట్టం ప్రకారం నెలకు 21000 వేతనం ఇవ్వాలని జేఎన్టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు

# పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15 :** ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కొరకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి పనులను పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలు ఫలాలు అందించే విధంగా అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేస్తామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంగళవారం కాజీపేట-బల్లార్ష సెక్షన్ ఎల్.సి. నం.57లో జిల్లాలోని రవీంద్రఖని-మంచిర్యాల మధ్య రైల్వే లైన్ 226/16-18 కి. మీ వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వి వే కా న ం ద్ , రో డ్ ్ల - భ ్ వ నా ల శాఖఎస్.ఈ.కె.రాము, క్యాతన్పల్లి మున్సిపల్ కమీషనర్ రాజులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ పారదర్శకమైన పాలన అందిస్తుందని,రాష్ట్ర అభివృద్ధిలో ప్రతిష్టాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు.ఈ క్రమంలో రామకృష్ణాపూర్, బి-జోన్ ప్రాంత వాసుల చిరకాల వాంఛ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి ద్వారా వాహన రాకపోకలు, ప్రయాణం సులభతరం అవుతుందని అన్నారు.ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేయడం జరుగుతుందని,సింగరేణి కార్మికుల పెన్షన్ పెంపొందించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికలలో గెలిచిన 3 నెలల్లో వంతెనను ప్రారంభించాలనే దృఢ సంకల్పంతో గుత్తేదారుకి రావలసిన నిధులు,భూ నిర్వాసితులకు అందవలసిన పరిహారం అంశాలను వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేసి వంతెన ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రహదారులు, మురుగుకాలువలు, మంచినీటి సౌకర్యం కొరకు ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని,విద్య, వైద్య రంగానికి పెద్ద పీట వేస్తామని తెలిపారు. నిరుపేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా సన్న బియ్యం,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,500 రూపాయలకు వంట గ్యాస్ ఇవ్వడంతో పాటు నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 50 వేల రూపాయల నుండి 4 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించి రాయితీతో పాటు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ మట్లాడుతూ... రవీంద్రఖని-మంచిర్యాల మధ్య గల క్యాతన్పల్లి ప్రాంతంలో రైల్వే ఓవర్రెడ్జి ప్రారంభించడంతో ప్రజల కష్టాలు తీరనున్నాయని, రాకపోకలు సులభతరం కాగా ప్రయాణం సుఖవంతంగా జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అటవీ శాఖ అనుమతులు పొంది జాతీయ రహదారి 363లో ప్రమాద ప్రాంతాలను గుర్తించి రోడ్డు భద్రతా నియమాలలో వాహనదారులకు తెలిసే విధంగా సూచికలు ఏర్పాటు చేయంతో పాటు అతి వేగం వల్ల కలిగే నష్టాలను,రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. క్యాతన్పల్లి పరిధిలోని ఇంటింటికి త్రాగునీరు సరఫరా చేసే విధంగా 27 కోట్ల రూపాయలు డి.ఎం.ఎఫ్.టి.,ఇతర నిధుల ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని లే-అవుట్ కలిగిన భూములలో జరిగే నిర్మాణాలకు మాత్రమే అనుమతులు జారీ చేసి విద్యుత్,నల్లా కనెక్షన్లు అందించడం జరుగుతుందని,మున్సిపల్ ప్రణాళికను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.నిరుపేదలకు చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యంను విక్రయించకుండా లబ్ధిదారులు వినియోగించుకోవాలని తెలిపారు.రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హత గల నిరుద్యోగ యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని,ఈ పథకంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. పేద ప్రజలకు గూడు కల్పించాలను ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హత గల నిరుపేద లబ్ధిదారులకు మాత్రమే ఇండ్లను కేటాయించడం జరుగుతుందని,ఈ క్రమంలో పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికులు తమ పెన్షన్ వివరాలు సమర్పించాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో నూతన రేషన్ కార్డు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని,ఇంతకు ముందు రేషన్కార్డు కలిగి ఉన్నట్లయితే సంబంధిత అభ్యర్థుల ఆధార్కార్డు అనుసంధానం కలిగి ఉంటుందని,అట్టి అభ్యర్థులు నూతన కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే తిరస్కరించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ,మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులతో మండల స్థాయి బృందాన్ని ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను 100 శాతం పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని,అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు అధికారులు,ప్రజాప్రతి నిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమలో రోడ్లు-భవనాల శాఖ డి.ఈ.ఈ.సిహెచ్. రమేష్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు,ప్రజలు పాల్గొన్నారు.

# నిలకడగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన జిల్లా వైద్యాధికారి



కోరుట్ల,ఏప్రిల్ 15 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ తెలిపారు.కోరుట్ల పట్టణ కల్లూరు రోడ్డు లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ సందర్శించారు.మంగళవారం ఉదయం కొంతమంది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అస్వస్థతకు గురైయిన నైపథ్యంలో రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేసి ఏఎన్ఎం వెంట పెట్టుకుని అల్లమయగుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.అక్కడి వైద్యాధికారి డాక్టర్. శివాని విద్యార్థులను పరిశీలించి చికిత్స అందించారు. జ్వరంతో బాధపడుతున్న నలుగురు విద్యార్థులను కోరుట్ల ఏరియా హాస్పిటల్ కు రిఫర్ చేయగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. సునీత రాణీ, ఆర్ఎంవో డాక్టర్ .వినోద్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శిల్ప పరిశీలించి వారిని అడ్మిట్ చేసుకొని చికిత్స అందించారు.అలాగే మిగతా విద్యార్థులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం పరిస్థితులు నిలకడగా ఉన్నందున డిస్చార్జ్ చేశారు.విషయం తెలుసుకున్న వైద్యాధికారి డాక్టర్ కే. ప్రమోద్ కుమార్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి అక్కడ పాఠశాల ప్రిన్సిపాల్ తో చర్చించి వెంటనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయవలసిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను పరీక్షించి చికిత్స అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం టీ హబులోని ల్యాబ్ కు పంపించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకునే జాగ్రత్తల గురించి వివరించారు. పాఠశాల సెలవులు ముగిశాక విద్యార్థులు ఎండలో తిరుగకుండా పగటి సమయంలో ఆటలు ఆడకుండా ఉదయం, సాయంత్రం సమయాలలో మాత్రమే ఆటలు ఆడుకోవాల్సిందిగా సూచించారు. తప్పనిసరి పరిస్థితులలో ఎండలో వెళ్లాల్సి వచ్చినప్పుడు తలకు టోపీలు గాని, టవల్స్ గాని చుట్టుకోవాలని తెలిపాడు. వీలైనంత ఎక్కువగా మంచినీటిని తాగాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి కోరుట్ల లోని ఏరియా హాస్పిటల్ ను సందర్శించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత తో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంఛార్జ్ ప్రిన్సిపల్ అంకం సురేశ్, వైద్యాధికారులు డాక్టర్ సమీన, డాక్టర్ శివాని, హెల్త్ ఎడ్యుకేటర్ తులసి వెంకటరమణ, ఎపిడమాలజిస్ట్ వంశీ, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్లాట్ బుకింగ్ నిలిపివేయాలి



మల్కాజిగిరి భూమి, ఫ్లాట్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న స్లాట్ బుక్కింగ్ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ మల్కాజిగిరి సబ్ రిజిస్టర్ కి మల్కాజిగిరి డాక్యుమెంట్ రైటర్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి పత్రం అందజేయడం జరిగింది.

నూతన స్లాట్ బుకింగ్ విధానం కారణంగా డాక్యుమెంట్ రైటర్ల ఉపాధి రోడ్లపై పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేసారు.

# కుర్సెంగ భూదేశావు స్వామి మరణించడంతో తల్లిని,వారి కుటుంబాన్ని పరామర్శించిన గిరిజన సంక్షేమ చైర్మన్ కోట్నాక్ తిరుపతి





**ప్రజాబలం బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 15 :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం లోని కుర్రెఘూడ్ గ్రామం నికి చెందిన కుర్సెంగ భూదేశావు స్వామి మరణించడంతో తల్లిని వారి కుటుంబాన్ని ఉన్న పరామర్శించడం జరిగింది. పల్లంగూడ గ్రామానికి చెందిన వేడమ్మ కిషన్ గారు గత ఐదు రోజుల క్రితం విద్యుత్ షాక్ తో మరణించడంతో వారి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి అన్న పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు,పెంద్రం శ్రీనివాస్ మంచిర్యాల జిల్లా ఆదివాసి సేన అధ్యక్షుడు

మంచిర్యాల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వేముల.కృష్ణ, మల్కె పల్లి మాజీ ఎంపీటీసీ మడావి. భీమరావు, ధర్మరావుపేట్ మాజీ ఎంపీటీసీ పార్వతి మల్లేష్ మడవి వెంకటేష్ ఆదివాసి సేన కాశిపేట మండల అధ్యక్షుడు,మడావి గంగారం ఆదివాసీ సేన గౌరవ అధ్యక్షుడు,పెంద్రం శంకర్ ఆదివాసేన వర్కింగ్ ప్రెసిడెంట్, ఆత్రం సంజీవ్ ఆదివాసీ సేన ఉపాధ్యక్షుడు,పేంద్రం తిరుపతి ఆదివాసీమ సభ్యుడు, కొండాపూర్ విలేజ్ ప్రెసిడెంట్ సజ్జనపు ఆనంద చారి, నేరెళ్ల రవి తదితరులు పాల్గొన్నారు..

# ఈసోజిపేట గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 15, ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా,ఉమ్మడి పుల్కల్ మండల పరిధిలో గల ఇసోజీపేట గ్రామంలో (పి ఏ సి ఎస్) ద్వారా వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేసిన, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, మున్నూరు మాణిక్యం, మాట్లాడుతూ, రైతుల యొక్క వరి ధాన్యం చివరి దశలో ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని, ముందస్తుగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం, వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని తెలిపారు, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు, ఏ గ్రేడ్ రకం 2,320, రూపాయలు, రెండవ రకం బి గ్రేడ్,2,300 రూపాయలు, ప్రభుత్వం చెల్లిస్తుందని, సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ కలిపి,2,820 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు, రైతులు వారి యొక్క ధాన్యాన్నికేంద్రాల్లోనే అమ్ముకోవాలని తెలిపారు రైతులకు ప్రభుత్వం వద్ద డబ్బులను వారం లోపట వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు, గత ప్రభుత్వం హయాంలో పంట పండించిన తర్వాత కూడా ధాన్యం కొనుగోలు చేయక రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు, కానీ ఈ ప్రభుత్వం రైతుల యొక్క శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, ముందుగా వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంజరుగుతుందని, ఇది రైతు ప్రభుత్వం అని తెలిపారు, ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, కాబట్టి రైతులు కూడా వచ్చే వర్షాకాలం సీజన్లో సన్న వడ్లను పండించి, ఈ ప్రజా ప్రభుత్వానికి సహకరించాలని, రైతులకు ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మున్నూరు మాణిక్యం అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నాయిని రవికుమార్, మాజీ సర్పంచి చర్ల దశరథ్ రెడ్డి, గ్రామ మాజీ ఉపాధ్యక్షుడు శివనోళ్ల గణపతి, సీనియర్ నాయకులు బోతిరెడ్డి గారి నారాయణరెడ్డి, నాయకులు గొల్ల వెంకటేశం, చాంద్ పాషా, మైబుసాబ్, మాజీ ఆయకట్టు చైర్మన్ చింతలపల్లి భూమయ్య, పార్టీ కార్యకర్తలు గ్రామ రైతులు పాల్గొన్నారు...

## యువత డ్రగ్స్ కు బానిస కావొద్దు – ప్రిన్సిపాల్ డాక్టర్. బీ రమేష్




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 15** విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడవద్దని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. బీ రమేష్ అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల యాంటి డ్రగ్స్ కమిటి ఆధ్వర్యములో ప్రిన్సిపాల్ డాక్టర్. బి. రమేష్ అధ్యక్షతన యాంటి డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ కు బానిసై జీవితాలను నాశనం చేసుకొవద్దన్నా రు. కాగా అనంతరం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిభా పూలే మహానీయుల జయంతిని పురస్కరించుకోని ఇటీవల నిర్వహించిన రంగోళి, వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్. ఓదేలు కుమార్, యాంటి డ్రగ్స్ కమిటీ కో–ఆర్డీనేటర్ సీ. రాజ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఈ రవి. ఎల్. రవీందర్, అధ్యాపకులు డాక్టర్. గణేష్, డాక్టర్. మాధవి, డాక్టర్. శ్యామల, డాక్టర్ రాజేంద్రం, కిరణ్ కుమార్, ఉమా కిరణ్ , అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు

## ఎల్కతుర్తి రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి... పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15 ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా/సదాశివపేట:హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి లో ఈ నెల 27వ తేదీన జరిగే రజతోత్సవ భారీ బహిరంగ సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి గులాబీ దండు వేలాదిగా కదం తొక్కలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు,సదాశివపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు,కేసీఆర్ బహిరంగ సభ సమయ సందర్భాన్ని ఎమ్మెల్యే వివరించారు,వార్డు నుంచి కుల సంఘాల నాయకులు పార్టీ నాయకులు కార్యకర్తలు బహిరంగ సభకు ఒక రోజు ముందు ప్రతి వార్డులో జెండా ఆవిష్కరణ చేసుకోవాలి కేసీఆర్ బహిరంగ సమావేశంలో దేశ రాజకీయంలో చర్చ జరుగుతుంది అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంది,ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన బి అర్ ఎస్ సిద్ధంగా ఉంది బి ఆర్ ఎస్ ను ఆశీర్వదించడానికి ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారు ...

## వ్యవసాయ పరికరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

మైలవరం మండలం చిలుకూరువారి గూడెంలో సబ్సిడీపై రైతులకు మంజూరు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను మైలవరం శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాదు మంగళవారం ప్రారంభించారు. తరువాత గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన.. సత్యం శ్రీరంగం

### కొత్త ప్రభాకర్ రెడ్డి మాటల వెనుక కుట్ర కోణం ఉంది దీనిపై వెంటనే విచారణ జరిపించాలి...



**కూకట్పల్లి (ప్రజా బలం) ఏప్రిల్ 15:** తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చడానికి సిద్ధంగా ఉన్నాయి, ఎమ్మెల్యేలను కొనడానికి ఎంత డబ్బు అయిన ఖర్చుపెట్టడానికి పారిశ్రామిక వేత్తలు మమల్ని కలుస్తున్నారు, తెలంగాణ ప్రభుత్వాన్ని ఎక్కువ కాలం నిలబడదు, త్వరలోనే కూల్చబోతున్నాం అని బి.ఆర్.ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. మాట్లాడుతూ అధికారం పోయిందన్న అహంకారంతో కల్వకుంట్ల కుటుంబానికి కడుపు మండుతుంది అని అన్నారు. ప్రజలతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలగొట్టే నైతిక హక్కు, రాజ్యాంగాన్ని ఖుని చేసే హక్కు మీకు ఎక్కడిది అన్ని అన్నారు, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుధంగా మాట్లాడినా మాటలు అని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి ఓర్వలేక బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న కుట్ర అని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చే దమ్ము %దీ=గా% వాళ్ళకి లేదు. పదేళ్లు చేసిన అరాచక పాలనలో చేసిన పాపాలు గుర్తుకు లేవా, ఎక్కడపడితే అక్కడ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారు. అబద్దాల బ్రాండ్ అంబాసిడర్ గా కేటీఆర్, పూటకో అబద్ధం,మోసమే బిఆర్ఎస్ నైజం అని, అబ్బదపు ప్రచారాలతో ప్రజలను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నంలో నిమగ్నమైన కేటీఆర్. అధికారం కోల్పోయిన క్షణం నుడి సీఎం రేవంత్ రెడ్డిని బద్నామ్ చేసే పనులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రోజుకో డైవర్షన్ చేస్తున్నారు. ఎక్కడ తమ అక్రమాలు, అన్యాయాలు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి చూస్తున్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాటల వెనుక కుట్ర కోణం ఉంది. కేసీఆర్ ఫార్మ్ హౌస్ లో పడుకొని ఇవాళ ప్రజాప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ ని కూలదోయడానికి కుట్రలు చేస్తున్నారు. కేసీఆర్ ఆత్మ అయినటువంటి కొత్త ప్రభాకర్ రెడ్డి తో మాట్లాడించిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా అన్నారు, దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలి అన్నారు.

# హత్య చేసిన నిందితుల అరెస్ట్, రిమాండ్ కు తరలింపు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలో ఆదివారం రోజున హత్య చేయబడిన మృతుడు చెట్టిపల్లి పరశురాములును హత్య చేసిన నిందితులను మంగళవారం రోజున వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏఎస్పి శేషాద్రిని రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మృతుల వివరాలను వెల్లడించారు. వేములవాడ శ్రీనగర్ కాలనీకి చెందిన చెట్టుపల్లి పరశు రాములు,నిందితులైన బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నే దూరి రాజేశం, అలాగే అడ్డగట్ల మనోజ్ కుమార్ అను వారూ గతంలో కలిసి తిరిగేవారని, వీరందరి పైన గంజాయి కేసులు, హత్య కేసులు అలాగే వివిధ కేసులు వివిధ పోలీస్ స్టేషన్లో నమోదఇ ఉన్నాయని చాలాసార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చినారని. గత కొంతకాలంగా మృతుడైన పరుశరాములు ఐదుగురితో ఉండకుండా తన పని తను చేసుకుంటూ ఇంటి వద్ద ఉంటున్నాడు. కొద్ది రోజుల క్రితం ఐదుగురు నిందితుల పైన వివిధ పోలీస్ స్టేషన్లో గంజాయి కేసులు నమోదు కాగా, అట్టి గంజాయి కేసులు నమోదు కావడానికి మృతుడైన పరుశురాములే కారణమని పోలీసులకు సమాచారం ఇస్తున్నాడు అన్న అనుమానంతో ఎలాగైనా పరశు రాములును చంపితేనే మాపై గంజాయి కేసులు కావని, సులువుగా గంజాయి వ్యాపారం చేయవచ్చునని, పోలీసులకు దొరకమని, తద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేయవచ్చునని ఐదుగురు నిందితులు భావించి తేది 13-04-2025 ఆదివారం



రోజున ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మృతుడు పరుశరాములు వేములవాడ రెండో బైపాస్ రోడ్డు లో గల మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్ ప్రక్కనగల స్టోర్ రూమ్ బిల్డింగ్ పైన ఒంటరిగా ఉండడం చూసి ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో తమ వెంట తెచ్చుకున్న గొడ్డళ్లు, కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో, ముగ్గురు నిందితులైన బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్ మృతుని విచక్షణ రహితంగా దాడి చేసి చంపినారని మరో నిందితుడు రాజేష్ బయట ఎవరూ రాకుండా గేటు వేసినాడని మరో నిందితుడైన అడ్డగట్ల మనోజ్ కుమార్ వీరందరికీ జైలుకు వెళ్తే బెయిల్ తీసుకురావడానికి తను బయట ఉంటానని చెప్పి వీరందరినీ హత్య చేయడానికి పంపించినాడని, మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి మంగళవారం రోజున ఉదయం 10 గంటలకు అయ్యోరుపల్లి గ్రామ శివారులో పట్టుకొని పంచనామ నిర్వహించి, నిందితుల నుండి పరుశరాములును చంపడానికి వాడిన రెండు గొడ్డన్లను, ఒక కత్తిని, రెండు బైకులను, మరియు రెండు సెల్ఫోన్లను స్వాధీన పరుచుకున్నామని పరారీలో ఉన్న మిగతా నిందితుడు మనోజ్ కుమార్ కోసం గాలిస్తున్నామని వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## తెలంగాణ గిరిజన ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక్ తిరుపతి గిరిజన నాయకులు సన్మానం



**ప్రజాబలం బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 15 :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో కొండాపూర్ (యాప)లో తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతిని మరియదాపూర్వకంగా కలిసి సాల్వతో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సేన నాయకులు కాసిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల ప్రజలు యువకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# చలో వరంగల్ సన్నాహక సమావేశం



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 15 ఏప్రిల్ 2025**భారత (తెలంగాణ) రాష్ట్ర సమితి పార్టీ 24 వసంతాలు పూర్తి చేసుకొని 25 వ సంవత్సరములో అడుగు పెడుతున్న శుభ సందర్భముగా పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సంబరాల దినోత్సవం జరుపుకునే విషయమై రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం రాజేంద్రనగర్ పార్టీ ఇన్చార్జి రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్ రెడ్డి నిర్దేశం మేరకు మంగళవారం రోజున చలో వరంగల్లు పేరిట కార్యకర్తల సన్నాహక సమావేశం జరుపు కోవడం జరిగినది. ఇట్టి సమావేశంలో కార్యకర్తలకు కార్తీక్ రెడ్డి దశా దిశా నిర్దేశించడం జరిగిన దరిమిలా పార్టీ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ మరియు స్థానిక నాయకులు అందరూ కలసి ఏకగ్రీవ తీర్మన్షముగా 27 ఏప్రిల్ రోజున ఉదయమే నెక్నంపూర్ కూడలిలో అలాగే పుపాలగూడ ఎల్.ఐ.సి కాలనీ కూడలిలో మరియు మణికొండ పరిధిలోని పాత ఆంధ్ర బ్యాంకు కూడలిలో, మర్రిచెట్టు కూడలిలో మొత్తంగా 4 చోట్ల పెద్ద ఎత్తున పార్టీ జండా కార్యక్రమం జరుపు కోని తదనంతరం ఉద్యమాల పురిటిగడ్డ ఓరుగల్లుగడ్డ కు పయనమై హనుమకొండ సమీపంలోని ఎలకతూర్తి గ్రామ కూడలిలో జరుగు పార్టీ ఆవిర్భావ రజతోత్సవ ఉత్సవాలకు మణికొండ నుండి ప్రైవేట్ బస్సులలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రతీ ఒక్క గులాబీదళ సైనికుడు కలసి కట్టుగా పెద్ద సంఖ్యలో కదం కదం తొక్కితూ తరలి వెళ్ళదానికి కృత నిక్షయంతో ఉన్నామని సీతారాం ధూళిపాళ తెలిపినాడు.



## అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకొని పతాకావిష్కరణ

## అగ్నిమాపక శాఖ అధికారి టీ, శ్రీనివాస్ గౌడ్





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 15, ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట, అగ్నిమాపక కేంద్రంలో, అగ్నిమాపక శాఖ అధికారి టి,శ్రీనివాస్ గౌడ్, ఆధ్వర్యంలో ఏప్రిల్ 14, నుండి 20వ,తారీకు వరకు నిర్వహించే వివిధ కార్యక్రమాలలో భాగంగా సోమవారం,పతాకావిష్కరణ, గావించారు, ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి టి,శ్రీనివాస్ గౌడ్,మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగిఉండాలని,

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ఉందని అన్నారు,1944, ఏప్రిల్ 14న,ముంబైలోవిక్టోరియా వార్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో, అసువులు బాసిన 66, మంది, అగ్నిమాపక సిబ్బంది, గుర్తుగా,అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు, అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని, వివిధ ప్రాంతాల్లో, అగ్ని ప్రమాదాల వల్ల జరిగే నష్టాల గురించి, ప్రజలకు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు, ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ సిబ్బంది అగ్నిమాపక వారోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.....

## వేసవి కాలంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి

## పుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 15 (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా ఉమ్మడి పుల్కల్ మండల పరిసర ప్రాంతాలలో వేసవికాలం కావడంతో తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, పుల్కల్ మండల ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ మాట్లాడుతూ, వేసవి కాలం కావడంతో ప్రస్తుతం పాఠశాలలకు, సెలవులు సమీపిస్తుండడంతో, మన సింగూరు పరివాహ ప్రాంతం కావున,పిల్లలు సమీపంలోని సింగూరు ప్రాజెక్టు మరియు చెరువుల వద్దకు, స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి, అవాంఛనీయ సంఘటనలు,జరగకుండా తల్లిదండ్రులుచూసుకోవాలని అన్నారు, అలాగే ఎండలో తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు, నీడకు ఉండే ఆటలు ఆడే విధంగాచూసుకోవాలన్నారు వేసవికాలంలో తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పుల్కల్ మండల ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ తెలిపారు...

## బాలానగర్ కు చెందిన పరంజ్యోతికి అద్భుత ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్




**కూకట్పల్లి (ప్రజా బలం) ఏప్రిల్ 15 :**కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ చెందినకు 39 ఏళ్ల ఎం.జె. పరంజ్యోతి అద్భుతమైన సంగీత ప్రదర్శనతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్లో స్థానం సంపాదించి అరుదైన ఘనత సాధించారు. గతేడాది డిసెంబర్ 1న విజయవాడలోని హల్లెల్ మ్యూజిక్ స్కూల్లో లీడ్ మేనేజర్ ఆగుస్టీన్ డాండింగి వేణుగోపాల్ నేతృత్వంలో ఏకంగా 1046 మంది కళాకారులు ఏకకాలంలో 'శంకరాభరణం' రాగాన్ని మొత్తం పూర్తి మూడు తాళాల్లో గంట పాటు ఆలపించి ఈ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని స్వయంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ న్యాయ నిర్ణేత రిచర్డ్ విలియమ్స్ స్టెన్నింగ్ పరిశీలించి ధృవీకరించారు. ఈ ఘనత సాధించినట్లు అధికారిక ధృవీకరణ డిసెంబర్ 9, 2024న ప్రకటించారు. దీనికి సంబంధించి మంగళవారం హైదరాబాద్లోని మణికొండలోని ది లైఫ్ చర్చ్లో బహుమతి పురస్కార కార్యక్రమం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి ఆనందం వ్యక్తం చేస్తూ, ఈ రికార్డు తన నిజమైన విజయం అని, తన కృషి, పట్టుదల సంగీతం పట్ల అంకితభావానికి నిదర్శనమని అన్నారు. ఈ అద్భుతమైన కార్యక్రమం కోసం తాను గత రెండేళ్లుగా సన్నద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రదర్శన జరిగిన రోజే పూర్తి రికార్డింగ్ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రధాన కార్యాలయానికి పంపినట్లు పరమ జ్యోతి వివరించారు. క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, వారి రికార్డుకు సంబంధించిన అధికారిక ధృవీకరణ డిసెంబర్ 9, 2024న వారికి అందింది. ఈ అసాధారణ విజయం ఎం.జె. పరంజ్యోతికి వ్యక్తిగత గుర్తింపును తీసుకురావడమే కాకుండా, ఈ ప్రాంతంలోని గొప్ప సంగీత ప్రతిభను, వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. పరంజ్యోతి యొక్క అంకితభావం 1046 మంది కళాకారుల యొక్క సమిష్టి కృషి సంగీత చరిత్రలో ఒక కొత్త మైలురాయిని సృష్టించింది, తద్వారా వారికి ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్లో సముచిత స్థానం లభించింది.

## ఈసోజిపేట గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 15, ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా,ఉమ్మడి పుల్కల్ మండల పరిధిలో గల ఇసోజిపేట గ్రామంలో (పి ఏ సి ఎస్) ద్వారా వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేసిన, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, మున్నూరు మాణిక్యం, మాట్లాడుతూ, రైతుల యొక్క వరి ధాన్యం చివరి దశలో ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని, ముందస్తుగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం, వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని తెలిపారు, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు, ఏ గ్రేడ్ రకం 2,320, రూపాయలు, రెండవ రకం బి గ్రేడ్,2,300 రూపాయలు, ప్రభుత్వం చెల్లిస్తుందని, సన్నబడ్లకు 500 రూపాయలు బోనస్ కలిపి,2,820 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు, రైతులు వారి యొక్క ధాన్యాన్నికేంద్రాల్లోనే అమ్ముకోవాలని తెలిపారు రైతులకు ప్రభుత్వం వడ్ల డబ్బులను వారం లోపట వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు, గత ప్రభుత్వం హయాంలో పంట పండించిన తర్వాత కూడా ధాన్యం కొనుగోలు చేయక రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు, కానీ ఈ ప్రభుత్వం రైతుల యొక్క శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, ముందుగా వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంజరుగుతుందని, ఇది రైతు ప్రభుత్వం అని తెలిపారు, ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, కాబట్టి రైతులు కూడా వచ్చే వర్షాకాలం సీజన్లో సన్న వడ్లను పండించి, ఈ ప్రజా ప్రభుత్వానికి సహకరించాలని, రైతులకు ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మున్నూరు మాణిక్యం అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నాయిని రవికుమార్, మాజీ సర్పంచి చర్ల దశరథ్ రెడ్డి, గ్రామ మాజీ ఉపాధ్యక్షుడు శివనోళ్ల గణపతి, సీనియర్ నాయకులు బోతిరెడ్డి గారి నారాయణరెడ్డి, నాయకులు గొల్ల వెంకటేశం, చాంద్ పాషా, మైబుసాబ్, మాజీ ఆయకట్టు చైర్మన్ చింతలపల్లి భూమయ్య, పార్టీ కార్యకర్తలు గ్రామ రైతులు పాల్గొన్నారు...

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సంగారెడ్డి నియోజవర్గ ప్రతినిధి ఏప్రిల్ 15 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా/సదాశివపేట:ఆదివారం నాడు సదాశివపేట మండల పరిధిలోని నిజంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది,25 సంవత్సరాల తరువాత కలిసిన మిత్రుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకొని చిన్నానాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల అనంతరం ఆదివారం కలుసుకొని ఆత్మీయత పంచుకున్నారు,అప్పటి స్నేహితులు అందర్నీ కలిసి వారితో ముచ్చటిస్తూ అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటుంటే.. ఆ అనుభూతి వర్ణణాతీతం,అందుకే ఇప్పుడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో బాల్య మిత్రులు, ఒకే చోట చదువుకున్న వ్యక్తులు కలసి గెట్ టూ గెదర్లలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తాజాగా అలాగే 10వ తరగతి వరకూ కలిసి చదువుకున్న విద్యార్థులు అందరూ పాతికేళ్ల తరువాత కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఆనాటి మధురస్మృతులు గుర్తుచేసుకున్నారు. తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన గురువులను సత్కరించారు.

## డాక్యుమెంట్ రైటర్ల నిరసన

యాదాద్రి తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ ద్వారా రోజుకి కేవలం 48 రిజిస్ట్రేషన్ చేయాలని, ఆన్లైన్ లో స్లాట్ బుక్ చేసుకునే విధానం ద్వారా డాక్యుమెంట్ రైటర్స్ జీవనోపాది కోల్పోతున్నామని డాక్యుమెంట్ రైటర్స్ అన్నారు.

నూతన విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసారు. సబ్ రిజిస్టర్ కు వినతిపత్రం అందజేసారు. మంగళవారం నుండి శనివారం వరకు డాక్యుమెంట్ రైటర్ సేవలు నిలిపివేయునట్లు తెలిపారు.

# వేములవాడ ఎస్బిఐ ముందు రెండు కార్లు ఢీ..

# తప్పిన పెను ప్రమాదం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మంగళవారం రోజున వేములవాడ పట్టణంలోని ఎస్బిఐ బ్యాంకు ముందు రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతి వేగంగా వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కార్, ఇన్నోవా కార్ను ఢీ కొట్టింది. దీంతో అదుపుతప్పిన ఇన్నోవా కారు అక్కడ నిలిపి ఉన్న పలు ద్విచక్ర వాహనాల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయినాయి. అదృష్టవశాత్తు వాహనాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ప్రత్యక్ష సాక్షుల సమాచారం ప్రకారం స్విఫ్ట్ డిజైర్ వాహనదారుడు మధ్యమధ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దీనితో ప్రజలకు, వాహనదారులకు,స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలోనే సిమెంట్ లారీలు, స్టీల్ లారీలు, ప్రతిరోజు ఐదు నుండి పది లారీలు అన్లోడ్ చేస్తుండడంతో సెస్ ఆఫీసు నుండి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదురు వరకు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న మున్సిపల్ అధికారులు పట్టించుకున్న అధికారులేడు అని వేములవాడ పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో తరచు ప్రమాదాలు జరగడం నిత్య కృత్యమైనాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు సిమెంటు లారీలను, స్టీల్ లారీలను ప్రధాన రహదారిపై అన్లోడ్ చేయడం నిలిపివేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## బద్ది పోచమ్మ ఆలయంలో బోనాలు సమర్పించిన భక్తులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మంగళవారం రోజున వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆనవాయితీ ప్రకారం సోమవారం తమహిష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు, మంగళవారం రోజున బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు తెల్లవారుజాము నుంచే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి, డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా బద్దిపోచమ్మ ఆలయం వరకు నృత్యాలు చేసుకుంటూ ఆలయమునకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు తమ పిల్లాపాపలను, తమ పాడి పంటలను, చల్లంగా చూడాలని, ఆ బద్ది పోచమ్మ అమ్మవారిని వేడుకున్నారు. బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారి దర్శనానికి, బోనాలు సమర్పించడానికి సుమారుగా రెండు గంటల సమయం పట్టింది. విపరీతమైన ఎండ వేడిమికి భక్తులు అవస్థలను ఎదుర్కొంటూ తమ బోనాలను సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

# రాజన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నార్తులకు,

# పేదలకు అన్న వితరణ కార్యక్రమం.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** రాజన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున పేదలకు, అన్నార్తులకు, లింగాల వైష్ణవి జన్మదినం సందర్భంగా అన్న వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా లింగాల వైష్ణవి తల్లిదండ్రులు లింగాల తిరుమల్- దీపిక దంపతుల చేతుల మీదుగా అన్నం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ ను పేదలకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాజన్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు లింగాల వైష్ణవికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలు శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రసాదించాలని కోరుకున్నారు. రాజన్న ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను ఇలా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ద్వారా పేదలకు, అన్నార్తులకు ఆకలి తీర్చిన వారం అవుతామని, ఇంకా ఎవరైనా మీ పుట్టినరోజు వేడుకలు, వివాహ వేడుకలు జరుపుకోవాలని అనుకుంటే, పేదలకు, అన్నార్తులకు అన్నదానం నిర్వహించాలి అనుకుంటే వేములవాడ పట్టణంలోని రాజన్న చారిటబుల్ ట్రస్ట్ ను సంప్రదించాలని కోరారు. చేకూర్తి నవీన్, 9032221325, దెబ్బటి ప్రవీణ్,8121312315 నెంబర్లను సంప్రదించండి అని తెలిపారు.

## కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది

దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పై సంచలన వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామి కవేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారు. తొగుటలో జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో కొత్త ప్రభాకర్రెడ్డి మాట్లాడారు. అవసరమైతే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని,ఆ ఖర్చును తాము భరిస్తామంటు న్నారు. పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారు, కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని అన్నారు.రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. రాజకీయాల్లోకి వచ్చాక సిన్సియర్ ఉంటే కుదరడం లేదని దురుసుగా ఉంటే ఎలా ఉంటుందో చూపిస్తనని అన్నారు.

### వరంగల్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

### కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల, ఈ నెల 27వ తేదీన జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు హాజరై సభను విజయవంతం చేయాలని కోరుట్ల బీడీ కార్మికులను ఎమ్మెల్యే డా.సంజయ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేసీఆర్ బీడీ కార్మికుల కష్టాన్ని గుర్తించి దేశంలోనే బీడీ కార్మికులకు జీవన భృతి ఇచ్చిన ఏకైక రాష్ట్రం మన తెలంగాణ అని వారికి గుర్తు చేశారు.మొదట బీడీ మహిళలకు 1,000 పెన్షన్ ఇచ్చుకున్నట్లు పేర్కొన్నారు. తరువాత 2,000 చేసుకున్నట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వం వస్తే 4,000 చేస్తుండే అని అన్నారు.కానీ దురదృష్టవశాత్తు కొందరి తప్పుడు ప్రచారాలతో కేసీఆర్ ప్రభుత్వం పోయిందని, మిగిలిన బీడీ కార్మికులకు కూడా పెన్షన్ అందించాలని ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు.

# టీ బి రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ



**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గం ఏప్రిల్ 15:** ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టీ బి రోగులకు ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థ నిక్షయ్ మిత్రాగా నమోదు చేసుకొని వారి సహకారంతో , ఈరోజు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేయడం జరిగినది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టి.బి డాక్టర్ రాజేశం మాట్లాడుతూ%,%, మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుండి త్వరగా కోలుకోవచ్చని చెప్పారు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమా గౌరీ మాట్లాడుతూ,

క్షయ వ్యాధిని నివారించడంలో ముందస్తు వ్యాధి నిర్ధారణ పూర్తి కాలం మందులు వాడటం చాలా ముఖ్యమని తెలియజేశారు అలాగే మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని 6 టిబి యూనిట్లలో 750 టిబి రోగులకు రెండు నెలలకు సరిపడా 1500 న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అంతట నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.

ప్రోగ్రాం ఆఫీసర్ టిబి డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ%,

%ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు , నిశ్చయమిత్ర ద్వారా దాతలు ముందుకు వచ్చి టిబి బారిన పడిన రోగులకు న్యూట్రిషన్ కిట్ల అందించడంలో సహాయం చేయమని కోరారు.

ఈ కార్యక్రమంల లో డిప్యూటీ డి ఎంహెచ్ ఓ డాక్టర్ సత్యవతి, పీహెచ్సీ ఉప్పల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యా , శ్రీ అభిలాష్ స్టేట్ ప్రాజెక్ట్ లీడర్ ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్, శ్రీనివాస్ , వాసు ప్రసాద్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ టీబీసెల్ ,బోగ ప్రకాష్ సూపర్వైజర్, డిస్ట్రిక్ట్ టీబీ సిబ్బంది , ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉప్పల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హనుమాజీపేటలో వరి ధాన్యం

# కొనుగోలు కేంద్రం ప్రారంభం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మంగళవారం రోజున వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఈ సందర్భంగా వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్రవంతి – హరి నందన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మద్దతు ధర సన్న వడ్లకు బోనస్ గా క్వింటాల్కు 500 రూపాయలు ఇస్తుందని, రైతులు ప్రైవేటు రైస్ మిల్లులకు గాని, దళారులకు గాని, ధాన్యాన్ని అమ్ముకొని మోసపోవద్దని, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులను ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి సెస్ డైరెక్టర్ ఆకుల దేవ రాజం, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సంఘ స్వామి యాదవ్, రాజన్న సిరిసిల్ల జిల్లా డిసిసి కార్యదర్శి బాలసాని శ్రీనివాస్ గౌడ్, బత్తిని ఎల్లా గౌడ్, మండల బీసీ సెల్ అధ్యక్షులు వంగపల్లి మల్లేశం సోషల్ మీడియా చిలుక ప్రభాకర్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆదిల్ పాషా, అనంతరెడ్డి, జంకె సత్తయ్య, తీగల ఎల్ల గౌడ్, ఎల్లాల ఎల్లారెడ్డి, కొమ్ము మల్లయ్య, లక్ష్మీరాజం, కిరణ్, శంకరయ్య కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేములవాడ లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 4వ

# మహాసభల పోస్టర్ ఆవిష్కరణ.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మంగళవారం రోజున వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పోస్టర్ ఆవిష్కరించుకోవడం జరిగింది. ఈనెల 21 -22 తేదీలలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో జరిగే రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ ప్రతిరోజు ఇసుకకు, మొరానికి పర్మిషన్లు ఇవ్వాలని, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని, నూతన లేబర్ కార్డులు జారీ చేయాలని, లేబర్ కార్డు ఉన్నవారికి రెన్యువల్ చేయాలని, భవన నిర్మాణ కార్మికుల అమ్మాయిలకు వివాహమైతే ఒక లక్ష రూపాయలు, డెలివరీ 50 వేల రూపాయలు, సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు, యాక్సిడెంట్లో చనిపోతే 10 లక్షల రూపాయలు,55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను కాపాడాలని,4 కోడ్ లను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గాజుల పోశెట్టి, కో రేపు శ్రీను, లక్ష్మణ్, లింగం, నరేష్ తదితర కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణాన్ని

## నిలువరించాలని ఫిర్యాదు

నివాస ప్రాంతాల మధ్య నిర్మించి తలపెట్టిన ఆలయ నిర్మాణాన్ని నిలువరించాలని జిహెచ్ఎంసి అధికారులకు కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల సుభాష్ నగర్ కు చెందిన 65 ఏళ్ల వృద్ధుడు యాదగిరి ఫిర్యాదు చేశారు. పూర్తిగా ఇళ్ల సముదాయాల మధ్య ఈ ఆలయాన్ని నిర్మించేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని అదే సమయంలో అక్రమంగా నివాసాల మధ్య నిర్మించడం పూర్తిగా చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఆలయాల నీడ నివాసాలపై పడడం హిందువులు సాంప్రదాయానికి విరుద్ధంగా భావిస్తానని ఆలయం నిర్మిస్తే సమీపంలోని ఇళ్ల యజమానులు అపరిచితుని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఆలయ నిర్మాణాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## బహుళ ప్రయోజనాల గల కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందాం - పర్యావరణ శాస్త్రవేత్తలు




తెలుగు రాష్ట్రాలలో బహుళ ప్రయోజనాలను అందిస్తున్న కోనో కార్పస్ మొక్కలను రక్షించుకుందామని ప్రముఖ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ ఎ.ఆర్. రెడ్డి, సిసిఎంబి పూర్వ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. మోహన్ రావు, జన విజ్ఞాన వేదిక పూర్వ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ఉస్మానియా యూనివర్సిటీ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, జీవ శాస్త్ర నిపుణులు గోపాలకృష్ణ పేర్కొన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందాం అనే అంశంపై మీడియా సమావేశం వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, యోగివేమన విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ కోనోకార్పస్ మొక్కపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధనలు జరిపిన ప్రొఫెసర్ ఎ.ఆర్ రెడ్డి ప్రసంగిస్తూ మొక్కలన్నిటిలో అత్యధిక కార్బన్ డై ఆక్సైడ్ ను తీసుకొని అత్యధిక ఆక్సిజన్ ను అందిస్తున్న మొక్క కోనోకార్పస్ అని తన పరిశోధనలో తేలిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోనోకార్పస్ పై జరిపిన పరిశోధనలన్నీ మంచి ప్రయోజనాలున్నాయని పేర్కొన్నాయన్నారు. తక్కువ నీరున్నా బ్రతుకుతుందని, ఎలాంటి నిర్వహణ వ్యయం ఉండదని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలలో అపోహలను నమ్మి మంచి ప్రయోజనాలు గల కోనోకార్పస్ మొక్కలను నరక వద్దని విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలో సగటున ఒక మనిషికి 421 మొక్కలు ఉండగా, బ్రెజిల్ లో 500, అమెరికాలో 470 ఉండగా భారతదేశంలో కేవలం 28 మొక్కలు మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలను ఎక్కువ తీసుకుంటుందనే ప్రచారం అవాస్తవమని, నీటి లభ్యత లేని దుబాయ్, సౌదీ అరేబియాలో కోనోకార్పస్ మొక్కలను విరివిగా పెంచుతున్నారని తెలిపారు. కోనోకార్పస్ గుబురుగా పెరగడం వల్ల పక్షులు గూళ్ళు పెట్టుకోలేవన్నారు. ప్రతి మొక్క నుండి అన్ని ప్రయోజనాలు పొందలేమని, కొన్ని పండ్లు ఇస్తాయని, కొన్ని పూలు ఇస్తాయని, మరికొన్ని నీడను, కలపను ఇస్తాయన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ బాధ్యతాయుత స్థానంలో, గౌరవప్రదమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కోనోకార్పస్ మొక్క ఆక్సిజన్ పీల్చుకొని కార్బన్ డై ఆక్సైడ్ ను విడుదల చేస్తుందని పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలుగు రాష్ట్రాలలో వాల్టా చట్టాన్ని అమలు చేయడం లేదని, చెట్లను నరికిన వాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పులో చెట్లను నరకడం మనుషులను నరికినట్టే భావించాలని తీర్పునిస్తూ ప్రతి నరికిన చెట్టుకి లక్ష రూపాయల పెనాల్టీ విధించిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కోనోకార్పస్ చెట్లను నరికే కార్యక్రమాన్ని కొనసాగిస్తే సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేస్తామన్నారు. మొక్కల మాఫియా అబద్దాలను ప్రచారం చేస్తుందన్నారు. కోనోకార్పస్ విదేశీ మొక్క అని ప్రచారం చేస్తున్నారని, మనదేశంలో ఉన్న సగం మొక్కలు విదేశాల నుండి వచ్చినవేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ బి.యన్. రెడ్డి, జీవశాస్త్ర నిపుణులు గోపాలకృష్ణ, వి.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి,
జన చైతన్య వేదిక అధ్యక్షులు,
ఫోన్ నెంబర్ : 9949930670

## ఉద్యోగ విరమణ పొందిన హెూంగార్డు ఆఫీసర్ కు సన్మానం



**ఖమ్మం ఏప్రిల్ 15 ( ప్రజాబలం బ్యూరో)** ఉద్యోగ విరమణ పొందిన సత్తుపల్లి యూనిట్ హెూంగార్డు ఆఫీసర్ మిట్టపల్లి వాణి ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా హెూంగార్డ్స్ యూనిట్ ఆఫీసర్ ఆర్ ఐ శ్రీ ఎం సురేష్, హెడ్ కానిస్టేబుల్ నవీన్ కుమార్, ఖమ్మం జిల్లా హెూం గార్డ్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బంక శ్రీను, జాతీయ ఉపాధ్యక్షులు %జు% వేంకటేశ్వర్లు, నీరజ, డి .రమేష్ డి.రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## గల్ఫ్ లో హత్యగావించబడ్డ నిర్మల్ జిల్లా వాసి కుటుంబానికి అండగా బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

### విదేశాంగ మంత్రిత్వ శాఖ,కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.

### మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చే దిశగా చర్యలు



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** నిర్మల్ జిల్లా సొన్ మండల కేంద్రానికి చెందిన అష్టం ప్రేమ్ సాగర్ దుబాయ్ లో మృతి చెందడంతో,కుటుంబ సభ్యులు మరియు మండల నాయకులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కి విన్నవించుకోగా,నేడు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో మరియు-రాష్ట్ర ప్రభుత్వ.ఎన్ ఆర్ ఐ సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ప్రేమ్ సాగర్ మృతదేహం స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు అధికారులకు సూచించారు.మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని,వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, కుంటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

## ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం ప్రకారమే భూబదలాయింపులు చేపట్టాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** నిర్మల్ జిల్లాలో అభివృద్ధి పనుల నిర్వహణలో అటవీ భూముల వినియోగానికి సంబంధించి ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం మేరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టంపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ భూములపై చేపట్టే అభివృద్ధి పనులకు పరివేశ్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా స్థాయిలోనే మంజూరు చేసి, అభివృద్ధి కార్యక్రమాలు ఆపకుండా కొనసాగేలా చూడాలని అటవీ అధికారులకు సూచించారు.అటవీ భూముల్లో రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ప్రాజెక్టులు, పంచాయతీ భవనాలు తదితర నిర్మాణాల కోసం తప్పనిసరిగా పరివేశ్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు.ఒకవేళ ప్రతిపాదిత ప్రాజెక్టు టైగర్ రిజర్వ్ జోన్‌లో ఉంటే కేంద్ర,రాష్ట్ర వైల్డ్ లైఫ్ అధికారుల అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడానికి అటవీ శాఖ రెవెన్యూ, విద్యుత్,ఇంజనీరింగ్ శాఖలతో సమన్వయంగా పని చేయాలన్నారు. అనంతరం పరివేశ్ పోర్టల్ గురించి అధికారులకు అవగాహన కల్పించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఎఫ్ఓ నాగినిబాను,ఆర్డీఓలు రత్నకళ్యాణి,కోమల్ రెడ్డి,పంచాయతీ రాజ్,ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు

## భైంసా లోనూ భరోసా కల్పిస్తున్న భరోసా సెంటర్ సిబ్బంది:జిల్లా ఎస్పీ డా జి.జానకీ షర్మిల






**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** భైంసా పట్టణంలోనూ భరోసా సెంటర్ ఉంటే బాగుంటుందని భావించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల ఐపిఎస్ భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుండి దాదాపు విడిపోయే క్షణాల్లో వచ్చిన వారికి కూడా భరోసా సెంటర్ పోలీసులు అక్కున చేర్చుకుని అనుభవజ్ఞులైన కౌన్సిలర్స్ చేత మళ్లీ వారి వివాహ బంధానికి అర్థాన్ని తెలిపేలా ఒకటి చేస్తూ ఎన్నో జంటలను ఏకం చేస్తున్నందుకు జిల్లా భరోసా సెంటర్ పోలీసులను ఎస్పీ జానకి షర్మిల ప్రశంసించారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమం ముగిసిన తర్వాత భరోసా సెంటర్ ద్వారా కలిసిన జంటను దగ్గరికి తీసుకుని వైవాహిక బంధం విలువ, దాంతోపాటు క్షణికావేశంలో మనం తీసుకునే నిర్ణయాలు ఒకటికి పది సార్లు ఆలోచించి తీసుకోవాల్సి ఉంటుందని తెలియజేస్తూ కలిసిపోయిన ఆ జంటను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎవరికి ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్మల్ జిల్లా పోలీసులు ఎప్పుడు తమకు అండగా ఉండడంతో పాటు భరోసా కల్పిస్తారనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని తెలిపారు.క్షణికావేశం తో దూరంగా ఉంటున్న ఒక జంటకి బరోసా సిబ్బంది రెండవసారి కౌన్సెలింగ్ ఇవ్వటం జరిగింది,దాని ఫలితంగా ఈ రోజు వారు సుఖ సంతోషాలతో దాంపత్య జీవితం కొనసాగిస్తూ ఎస్పీ గారిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదులు ఆన్లైన్లో పొందుపరుస్తూ ఏ మేరకు సమస్యలు పరిష్కారం ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమం లో అవినాష్ కుమార్ ఐపిఎస్,ఇన్స్పెక్టర్ లు నైలు,గోపినాథ్, మల్లేష్,ఎస్ఐ లు శంకర్,గౌస్,గణేష్ మరియు భరోసా సెంటర్ సిబ్బంది జ్యోతి,శిరీష,క్యాంప్ ఇన్చార్జి రఘువీర్ పాల్గొన్నారు

## జిల్లా వ్యాప్తంగా వారంలో ఒకరోజు కేజీబీవీ లో మహిళ పోలీసులు నిర్వహిస్తున్న “పోలీస్ అక్క” కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల






**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** నిర్మల్ జిల్లా లోని 18 పాఠశాలలకు 18 మంది మహిళా కానిస్టేబుల్ లను పర్య వేక్షణ అధికారులుగా నియమించి ఒక్కో పాఠశాలలను ఒక్కో మహిళ కానిస్టేబుల్ నీ నియమించి వారంలో ఒక రోజు అట్టి స్కూల్ పిల్లలతో గడపాలని చేపట్టిన ప్రోగ్రాం మీద ఈ రోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ ఆన్లైన్ లో అందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ వారి వద్ద నుండి సమాచారాన్ని సేకరించి తదుపరి దిశానిర్దేశం చేశారు. స్కూల్ లో విద్యా ర్థిని లతో కలసి ఉండి మరియు రాత్రి వారితో బస చేయటం వల్ల వారికి దగ్గరవుతారు తద్వారా వారి సాధక బాధకాలు పంచుకోవచ్చు.తల్లి దండ్రులకు దూరంగా ఉంటూ ఉంటారు కాబట్టి విద్యార్థిని లకు ఎన్నో సమస్యలు ఉంటాయి,వాటిని వినటం వల్లనే సగం బారం తగ్గుతుందని తెలియజేసారు. వారిని మానసికంగా ఉత్తేజపరచాలని తదుపరి చదువుల నిమిత్తం సలహాలు ఇవ్వాలని తెలిపారు.

భవిష్యత్తు లో మంచి ఉద్యోగం సంపాదించాలంటే ఎలా చదవాలి అనేది వారికి ఇప్పటి నుండే అలవాటు చేయాలన్నారు. ఉదయమే మానసిక ఉల్లాసం కోసం, శారీరకంగా ఉత్తేజం కోసం యోగా కూడా చేయించాలన్నారు. గత కొన్ని వారాలుగా ఈ ప్రోగ్రాం లో చురుగ్గా పనిచేస్తున్న వారిని ప్రశంసించారు.

ఈ మీటింగ్ లో అవినాష్ కుమార్ ఐపిఎస్, రాజేష్ మీన ఐపిఎస్,ఇన్స్పెక్టర్లు అజయ్,నైలు, గోపినాథ్,మల్లేష్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com